సామాజిక ఉపయోగం గత వారంరోజులపై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో **ఒక పూర్తి పేజీ**



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-7-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 160 పేజీలు: 10+4 వెల: 6.50





షుగర్ పేషెంట్లకు శుభవార్త

## 'అవిక్లీ' వచ్చేసింది

వారానికో ఇంజక్షన్ తీసుకుంటే చాలు

2




గురువారం 'మెల్‌బోర్న్ మీట్స్'లో పాల్గొనేందుకు వెళ్తున్న ప్రధాని మోడీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్

### భారత్- ఆసీస్ స్నేహానికి

# ప్రవాసులే బలం

'మెల్‌బోర్న్ మీట్స్ మోడ్జీ'లో ప్రధాని మోడీ

వన్డే మ్యాచ్‌లా అజెండా..

టి-20లా నిర్ణయాలు..

టెస్ట్ మ్యాచ్‌లా భాగస్వామ్యం

**మెల్‌బోర్న్, జులై 9:** ఆస్ట్రేలియా పర్యటనలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మెల్‌బోర్న్‌లో అఖండ స్వాగతం లభించింది. ప్రవాస భారతీయులు భారీసంఖ్యలో పాల్గొన్న 'మెల్‌బోర్న్ మీట్స్ మోడ్జీ' కార్యక్రమంలో ప్రధాని మోడీ భారత్- ఆస్ట్రేలియా సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆస్ట్రేలియాలోని భారతీయ సమాజం రెండు దేశాల మధ్య స్నేహ బంధానికి ముఖ్యమైన శక్తిగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. భారత్-

>>2

రూ.7,345 కోట్ల ప్రాజెక్టుకు ప్రభుత్వం ఆమోదం



### మూసీ పునరుజ్జీవ


# పనులకు గ్రీన్‌సిగ్నల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై9:** మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు మొదటి దశకు అనుమతిస్తూ తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.7,345.12 కోట్లతో జోన్-1 పనులు చేపట్టేందుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. జోన్1 ఏ,జోన్1 బి ప్రాధాన్య కారిడార్లలో మూసీ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. రూ.4,500 కోట్ల ఏడీబీ రుణంతో మూసీ రివర్ ఫ్రంట్ బోర్డు ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. రూ.2,845 కోట్లు హెచ్ఎండిఏ లేదా టిజిఐఐసి

>>2

### ఎన్నికలప్పుడే రాజకీయాలు:

# రాష్ట్రాభివృద్ధికి కలిసిరండి!



ప్రీమియర్ ఎనర్జీ సోలార్ మాడ్యూల్ యూనిట్‌ను ప్రారంభించిన అనంతరం ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

**అధికారం కోల్పోయిన బాధ మీకు ఉన్నా అభివృద్ధి జరగనివ్వండి..**

**తెలంగాణ రైజింగ్-2047 విజన్‌తో 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం**

**కాలుష్య పరిశ్రమలను 'ఔటర్' బయటకు తరలించేందుకు చట్టం చేశాం**

**ప్రీమియర్ ఎనర్జీ సోలార్ మాడ్యూల్ యూనిట్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై9:** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు అంతర్భాగం మొత్తంగా కాలుష్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్ద డానికి ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. 2,100 చ.కి.మీ మేరకు విస్తరించి ఉన్న ఓఆర్ఆర్ లోపల కోర్ అర్బన్ ఏరియాలో 1 కోటి 35 లక్షల జనాభా అవసరాలకు అనుగుణంగా నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలోనే అత్యుత్తమ నివాస యోగ్యమైన (బెస్ట్ లివింగ్ సిటీ) తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సోలార్ మాడ్యూల్స్ తయారీ రంగంలో ప్రసిద్ధ ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్‌లో నెలకొల్పిన 5.6 గిగావాట్ల సామర్థ్యం కలిసిన సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి గురువారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. ప్రీమియర్ ఎనర్జీ రూపొందించిన మొట్టమొదటి సోలార్ ఆక్సీ ట్రీ - సోలార్ పవర్డ్ స్ట్రీట్ లైట్, ఎయిర్ క్లీనింగ్ సిస్టమ్ 'ఆక్సీట్రీ'ని, యూనిట్‌లో సోలార్ మాడ్యూల్స్‌కు సంబంధించి వివిధ ఉత్పత్తులను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ యూనిట్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ...రాజకీయంగా ఎన్ని ఆరోపణలు వచ్చినా తెలంగాణను అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నాం.. తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నామని చెప్పారు.'రాజకీయాలకు ఇది సమయం కాదు.. ఎన్నికలప్పుడే రాజకీయాలు,అధికారం కోల్పోయిన బాధ మీకు ఉన్నా, అభివృద్ధి జరగనివ్వండి, మమ్మల్ని

>>2

# హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నా డ్రీమ్

**నవంబర్‌లో ఖేలో ఇండియా గేమ్స్‌కు ఆతిథ్యం ఇస్తాం**

**క్రీడాకారుల కోసం స్పష్టమైన స్పోర్ట్స్ పాలసీ తెచ్చాం**

**స్పోర్ట్స్ వర్సిటీ, స్పోర్ట్స్ డిస్ట్రిక్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్**

3

### నీటి లభ్యతకు అనుగుణంగా

# సాగు ప్రణాళికలు

ఎల్‌నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలి

**వాతావరణ శాఖ సూచనలను పరిగణనలోకి తీసుకోవాలి: మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు**



గురువారం ఎల్‌నినోపై సమీక్ష చేస్తున్న మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జులై 9 ప్రభాతవార్త:** ఎల్‌నీనో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రైతాంగం సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, నీటి లభ్యతకు అనుగుణమైన ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఎల్‌నీనో పరిస్థితులు, వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయ

>>2



### బండి భగీరథ్‌కు

# బెయిలు

మంజూరు చేసిన హైకోర్టు

2



### దేశంలోనే అత్యుత్తమ వైద్య సంస్థగా

# బీబీనగర్ ఎయిమ్స్

87 శాతం పనులు పూర్తి

**డిసెంబర్ నాటికి పూర్తి స్థాయిలో వైద్య సేవలు: కేంద్ర ఆరోగ్య మంత్రి నడ్డా**

**యాదాద్రిభువనగిరి, బ్యూరో ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మితమవుతున్న బీబీనగర్ ఎయిమ్స్‌ను డిసెంబర్ నాటికి పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వేగంగా పనులు చేపట్టిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. ప్రస్తుతం నిర్మాణ పనులు 87

>>2






గురువారం హైదరాబాద్‌లో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని కలిసిన సిఎస్ సంజయ్ జాజు

## స్పీకర్, మండలి చైర్మన్‌తో సిఎస్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై9:** తెలంగాణ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను అధికార నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన గారు. ఈసందర్భంగా సంజయ జాజుని శాలువాతో సన్మానించి, పుష్ప గుచ్ఛం, మెమెంటో అందించి స్పీకర్ శుభాకాంక్షలు తెలిపారు. స్పీకర్‌తో పాటు వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య కూడా పాల్గొన్నారు.

అనంతరం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంజయ్‌జాజు, గుత్తాసుఖేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అంద జేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి సెక్రెటరీ డా. వి. నరసింహాచార్యులు కూడా పాల్గొన్నారు.

## సాగు ప్రణాళికలు

>> కార్యాచరణపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఐటీ పరిశ్రమల శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్, సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఇఎన్‌సి రమేష్ బాబు, వ్యవసాయశాఖా కార్యదర్శి సురేంద్ర మోహన్‌లు సమీక్షలో పాల్గొనగా వీడియో కాన్ఫరెన్స్ ద్వార వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు లు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా వారీ కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి జిల్లాలో వర్షపాతం, భూగర్భ జలాలు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, సాగునీటి లభ్యతను నిరంతరం సమీక్షించి, వాటికి అనుగుణంగానే పంటల ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, గ్రామసభలు, రైతు వేదికలు, క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమాల ద్వారా రైతులకు విస్తృతంగా వివరించాలని సూచించారు. వాతావరణ శాఖ, వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి శాస్త్రీయ సమాచారాన్ని వేగంగా రైతులకు చేరవేయాలని చెప్పారు. ఏ ప్రాంతంలో ఏ పంట అనుకూలమో శాస్త్రవేత్తల సిఫారసుల ఆధారంగా రైతులకు స్పష్టమైన సలహాలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎల్‌నీనో సవాళ్లను శాస్త్రీయ ప్రణాళికతో ఎదుర్కొని రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తుందని పునరుద్ఘాటించారు.

## కాంగ్రెస్ పని అయిపోయినట్లేనని రేవంత్ సొంత సర్వేలోనే తేలింది

### ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బిఆర్ఎస్‌కు 78 సీట్లు వస్తాయి: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై9:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పని ఇక అయిపోయినట్లే అని.. ఇదే అంశం రేవంత్ రెడ్డి చేయించుకున్న సొంత సర్వేలోనూ తేలిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తన పరిపాలనపైన, తన నాయ కత్వంపైన, సగం పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఒక విస్తృత సర్వేను చేయించుకున్నారని, అందులోనూ ప్రజా వ్యతిరేకత చాలా స్పష్టంగా వ్యక్తమైందన్నారు. గురువారం గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీ నేతలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో జరిగిన ఈ సమావేశానికి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గ ఇంచార్జులు, ఎస్ఐఆర్ కమిటీ నేతలు హాజరయ్యారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఎస్ఐఆర్ పై ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలు, అలాగే పార్టీ పరంగా చేయాల్సిన సూచనలపై ఈ సందర్భంగా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే భారత రాష్ట్ర సమితి సుమారు 78 సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆ సర్వేలో తేలిందన్నారు. దీంతో పాటు రెండు మీడియా సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఇంటెలిజెన్స్ విభాగాలు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలోనూ ఇదే అంశం వ్యక్తమైందన్నారు. మరోసారి ప్రజలు కేసీఆర్ ను ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నామని స్పష్టంగా తమ అభిప్రాయం చెప్పిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. అయితే తన సొంత సర్వేతో పాటు పలు సర్వేల్లో వ్యక్తమైన ప్రజా వ్యతిరేకతను చూసి తట్టుకోలేకనే ముఖ్యమంత్రి గత వారం రోజులుగా అడ్డగోలుగా మాట్లాడుతున్నారన్నారు. దీంతోపాటు తన పరిపాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అనేక అటెన్షన్ డైవర్షన్ పనులు చేస్తున్నారని, అందులో భాగంగానే కాళేశ్వరం నుంచి మొదలుకొని రైతుబంధు వరకు అన్నింటిపైన అడ్డగోలుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్ కార్యక్రమం అత్యంత మందకొడిగా సాగుతున్నదని, ముఖ్యంగా ప్రభుత్వం మరియు ఎలక్షన్ కమిషన్ నియమించిన బూత్ లెవెల్ ఆఫీసర్లకు సరైన శిక్షణ, తగిన ఏర్పాట్లు ఇవ్వకపోవడంతో మొత్తం ఈ కార్యక్రమం అత్యంత మందకొడిగా కొనసాగుతున్నదని, దీనివల్ల ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఫీడ్‌బ్యాక్ వస్తోందని ఆయన అన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ లాంటి అత్యధిక జనసాంద్రత ఉండే మహానగరంలో ఈ ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన ఫారాల పంపిణీ, వాటిలో ఓటర్ల నమోదు వంటి అంశాలపై సరైన అవగాహన లేకుండానే అధికారులను కేటాయించారని కిందటి స్థాయి నుంచి పార్టీ వర్గాలు ఇస్తున్న ఫీడ్‌బ్యాక్‌ని కేటీఆర్ ప్రస్తావించారు. అయితే ఎస్ఐఆర్ కార్యక్రమం అత్యంత కీలకమైన అంశమని.. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలన్న రాజ్యాంగ స్ఫూర్తి ఆధారంగా దొంగ ఓట్లు లేకుండా చూడాలని కోరారు. ఒకవైపు మొన్నటికి మొన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి సంబంధించి ఉపఎన్నికల సందర్భంగా భారీగా బయటపడిన డబుల్ ఓట్లు, దొంగ ఓట్ల వ్యవహారాన్ని ప్రతి ఒక్క నాయకుడు గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌కు సంబంధించి పార్టీ నియమించుకున్న బూత్ లెవెల్ అసిస్టెంట్ల సహకారంతో ఏ ఒక్కరి ఓటు పోకుండా చూడాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అధికారంలో ఉన్నందువలన డబుల్ ఓట్ల నమోదు లేదా ఇతర ప్రాంతాల వారిని ఆయా నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదు చేయించే ప్రయత్నాలు చేస్తున్నాయని, ఇలాంటి సందర్భంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, మద్దతుదారుల ఓట్లు పోయేలా ప్రయత్నం చేసే ప్రమాదం ఉందన్నారు. మరోవైపు ఎస్ఐఆర్ కు సంబంధించిన అంశంలో ఎదురవుతున్న ఇబ్బందులను, ప్రజల నుంచి వస్తున్న ఫీడ్‌బ్యాక్‌ని, సమస్యలను ఎలక్షన్ కమిషన్ దృష్టికి ఎప్పటికప్పుడు పార్టీ తరఫున తీసుకుపోతున్నట్లు తెలిపారు.

## షుగర్ పేషెంట్లకు శుభవార్త: ‘అవిక్లీ’ వచ్చేసింది

### వారానికో ఇంజక్షన్ తీసుకుంటే చాలు

### భారత్ మార్కెట్లోకి మెడిసిన్ విడుదల




**కొపెన్ హ్యాగన్,జులై 9:** మధుమేహం చికిత్సలో కీలక ముందడుగు పడిం ది. ప్రపంచంలోనే వారానికి ఒక్కసారి తీసుకునే బేసల్ ఇన్సులిన్‌ను భారత్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. డెన్మార్క్‌కు చెందిన ఔషధ సంస్థ నోవో నార్డిస్క్ “అవిక్లీ” పేరుతో ఈ ఇన్సులిన్‌ను విడుదల చేసింది. టైప్1, టైప్ 2 మధుమేహంతో బాధపడే వారికి ఇది ఉపయో గపడనుంది. సాధారణంగా ఇన్సులిన్ తీసు కునే రోగులు రోజూ ఒకసారి లేదా అంతకంటే ఎక్కువ సార్లు ఇంజెక్షన్ తీసుకోవాల్సి వస్తుంది. కొత్తగా వచ్చిన అవిక్లీతో వారానికి ఒక్కసారి ఇంజెక్షన్ తీసుకుంటే సరిపోతుంది. దీంతో ఏడాదికి 365 ఇంజెక్షన్ల స్థానంలో కేవలం 52 వేసుకుంటే చాలు. రోజూ సూది తీసుకోవాలనే భయంతో చాలామంది ఇన్సులిన్‌ను ఆల స్యంగా ప్రారంభిస్తుంటారని, ఈ సమస్యకు కొత్త చికిత్స ఉపయోగపడుతుందని కంపెనీ తెలిపింది. భారత్‌లో ప్రస్తుతం దాదాపు 10.1 కోట్ల మంది మధుమేహంతో బాధపడు తున్నారు. మరో 13.6 కోట్ల మందిలో ప్రీ డయాబెటిస్ లక్షణాలు ఉన్నాయి. తొమ్మిది లక్షల మందికిపైగా టైప్1 మధుమేహ రోగులు ఉన్నారు. టైప్2 మధుమేహంతో బాధపడే వారిలో కూడా కొంతమందికి ఇన్సులిన్ తప్ప నిసరిగా అవసరం అవుతోంది. ఈ ఇన్సు లిన్‌ను ఫ్లెక్స్ టచ్ పెన్ ద్వారా వారానికి ఒక్క సారి తీసుకోవాలి. ఇలా తక్కువసార్లు ఇంజెక్షన్ తీసుకోవాల్సి రావడంతో చికిత్స ను క్రమం తప్పకుండా కొనసాగించే అవకాశం పెరుగు తుందని నిపుణులు చెబుతున్నారు.

రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించే సామర్థ్యంలో ఇది రోజూ తీసుకునే ఇన్సులిన్‌తో పోలిస్తే మెరుగైన ఫలితాలు ఇచ్చినట్లు క్లినికల్ పరీక్షల్లో తేలిందని కంపెనీ వెల్లడించింది. భద్రత విషయంలో కూడా ఇదే స్థాయి ఫలితాలు నమోదయ్యా యని తెలిపింది. రోజూ ఇంజెక్షన్ల భయం, చికిత్స క్లిష్టంగా ఉండటం వల్ల చాలామంది ఇన్సులిన్‌ను ఆలస్యంగా ప్రారంభిస్తారని అలాంటి వారికి వారానికి ఒక్కసారి తీసుకునే ఈ కొత్త ఇన్సులిన్ మంచి ప్రత్యామ్నాయంగా మారొచ్చని వైద్యులంటున్నారు.

## వారం - వర్జ్యం

10-07-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
దశమి ఉ.8.16, ఏకాదశి తె.5.22
భరణి మ.1.11
వర్జ్యం : రా.12.06-రా.1.33
దు.ఉ.8.17-ఉ.9.09,
(2) మ.12.38-మ.1.30
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** మీ మాట దురుసుతనం వల్ల మిత్రులు సైతం శత్రువులుగా మారే ప్రమాదం ఉంది. జాగ్రత్త వహించండి.

**వృషభం:** పాతబాకీలు వసూలై ఆర్థిక అవసరాలు తీరుతాయి. అన్యభాషలను అభ్యసించారు. తద్వారా లాభపడతారు.

**మిథునం:** మొండి వ్యవహారాలను కాలానికి వదిలి వేస్తారు. చికాకు కలిగించే పరిస్థితులకు దూరంగా పారిపోకుండా వుంటారు.

**కర్కాటకం:** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. భూవివాదాలు తీరి లబ్ధి పొందుతారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**సింహం:** అంతర్గతంగా వేదాంత ధరణి అలవరచుకుంటారు. ప్రతికూల వాతావరణాన్ని కూడా కృషితో అనుకూలంగా మలచుకుంటారు.

**కన్య :** వలుకుబడి ఉన్నవారితో పరిచయాలు ఏర్పడుతాయి. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు.

**తుల :** చేపట్టిన పనులలో అనేకమైన వాటిని విజయవంతంగా పూర్తి చేస్తారు. ఋణాలు తీరి ఊరట చెందుతారు.

**వృశ్చికం:** జీవిత భాగస్వామి ద్వారా ధనలాభం పొందుతారు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. దేవాలయాల సందర్శనం.

**ధనుస్సు:** గతము కన్నా వృద్ధి బాగుంటుంది. అనేకాంశాలు అనుకూలంగా వుంటాయి. ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం తగదు.

**మకరం:** ఎదుటివారి సంభాషణలలోని నిజా నిజాలను గుర్తెరిగి తదనుకూలంగా నడుచుకుంటారు. వాహన సౌఖ్యం.

**కుంభం:** భాగస్వామ్య పెట్టుబడులలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం చెప్పదగినది. వాహనాలు నడిపేటప్పుడు నిర్లక్ష్యం తగదు.

**మీనం:** మీ పరోక్షంలో జరుగుతున్న అన్ని పనులను కూడా గమనిస్తూ కఠినంగా వ్యవహరిస్తారు. వస్త్రలాభం కలదు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ప్రవాసులే బలం

>> ఆస్ట్రేలియా మధ్య సంబంధాలు కేవలం ప్రభుత్వాల మధ్య మాత్రమే కాకుండా ప్రజల మధ్య అనుబంధంతో మరింత బలపడుతున్నాయని మోడీ వ్యాఖ్యలు స్పష్టం చేశాయి. మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి దాదాపు 30 వేల మంది హాజరయ్యారు. ప్రవాస భారతీయుల ఉత్సాహం, మద్దతు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రధాని మోడీ తన ప్రసంగంలో భారతీయ సమాజాన్ని భారత్- ఆస్ట్రేలియా స్నేహానికి ‘బలమైన స్తంభాలలో ఒకటి’గా అభివర్ణించారు. ‘మెల్‌బోర్న్‌లోని భారతీయ సమాజం మధ్య ఉండటం ఎంతో ఉత్సాహంగా ఉంది. వారి శక్తి, ఉత్సాహం సాటిలేనివి. వారు భారత్‌ఆస్ట్రేలియా స్నేహానికి కీలకమైన బలమైన స్తంభాలు’ అని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

ప్రసంగంలో ప్రధాని మోడీ క్రికెట్‌ను కూడా ప్రస్తావిస్తూ భారత్- ఆస్ట్రేలియా సంబంధాలను క్రీడతో పోల్చారు. మెల్‌బోర్న్ వంటి క్రీడా నగరంలో క్రికెట్ గురించి మాట్లాడకుండా ఉండటం సాధ్యం కాదని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. క్రికెట్ రెండు దేశాల మధ్య ఒక ‘దౌత్య భాష’గా మారిందని చెప్పారు. భారత్- ఆస్ట్రేలియా భాగస్వామ్యాన్ని క్రికెట్ ఫార్మాట్లతో పోల్చిన ప్రధాని, ‘మన సమావేశాల అజెండా వన్డే మ్యాచ్‌లా స్పష్టంగా ఉంటుంది. నిర్ణయాలు టి20లా వేగంగా ఉంటాయి. మన భాగస్వామ్యం టెస్ట్ మ్యాచ్‌లా దీర్ఘకాలికంగా, బలంగా ఉంటుంది’ అని అన్నారు. ఈ వ్యాఖ్యలకు ప్రేక్షకుల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది.

భారత్- ఆస్ట్రేలియా సంబంధాలు గత కొన్నేళ్లలో మరింత బలపడుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. 2014లో 28యేళ్ల తర్వాత ఆస్ట్రేలియాలో పర్యటించిన తొలి భారత ప్రధానమంత్రి తానేనని గుర్తుచేసుకున్న మోడీ, తన తాజా పర్యటనను 12 యేళ్లలో ‘హ్యాట్రిక్’ పర్యటనగా అభివర్ణించారు. భారత్- ఆస్ట్రేలియా సంబంధాలు ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయో ఈ తరచు పర్యటనలు సూచిస్తున్నాయని అన్నారు. భారత్, ఆస్ట్రేలియాలను దగ్గర చేయడంలో తన పాత్ర కంటే ప్రవాస భారతీయుల పాత్ర మరింత గొప్పదనిప్రధాని మోడీ ప్రశంసించారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ సమాజం తమ కృషి, సేవల ద్వారా భారతదేశ ప్రతిష్ఠను పెంచుతోందని అన్నారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్‌కు మోడీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అల్బనీస్‌ను ‘భారతదేశానికి మంచి మిత్రుడు’గా అభివర్ణించారు. ఆయనతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ప్రత్యేకమైన అనుభూతిని ఇచ్చిందని అన్నారు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం నుంచి మెల్‌బోర్న్‌లోని ప్రసిద్ధ క్రికెట్ వేదిక వరకు ఇద్దరు నాయకులు కలిసి ఎన్నో గుర్తుండిపోయే క్షణాలను పంచుకున్నారని ప్రధాని పేర్కొన్నారు. భారతీయ సమాజాన్ని ఉద్దేశించి అల్బనీస్ చేసిన ప్రసంగాన్ని కూడా ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా ‘ఆపరేషన్ సిందూర్’ను ప్రస్తావిస్తూ, ఉగ్రవాద శిబిరాలపై భారతదేశం జరిపిన దాడుల ప్రభావం దాని సరిహద్దులకు ఆవల కూడా చాలా దూరం వరకు వ్యాపించిందని అన్నారు. ఉగ్రవాద శిబిరాలలో జరిగిన పేలుళ్లు ‘ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనించాయని’, ఉగ్రవాదంపై దృఢంగా వ్యవహరించడానికి, తన జాతీయ భద్రతను కాపాడటానికి భారతదేశానికి ఉన్న సంకల్పాన్ని ఇది స్పష్టం చేస్తుందని ఆయన అన్నారు. ఆధునిక భారతదేశం ‘మరింత ఎదగండి, మరింత సాధించండి’ అనే నినాదాన్ని విశ్వసిస్తుందని ఆయన అన్నారు. భారతదేశాన్ని 140 కోట్ల ఆకాంక్షల దేశంగా అభివర్ణిస్తూ, దేశ ప్రజల కలలు, సంకల్పమే దేశ పురోగతికి చోదకశక్తిగా ఉందని మోడీ అన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. జాతీయ భద్రత, ఆర్థికాభివృద్ధి పరస్పర అనుసంధానమైన అంశాలని పేర్కొన్న ఆయన, గత విజయాలతో సంతృప్తి చెందకుండా మరింత ఉన్నత లక్ష్యాలతో భారత్ ముందుకు సాగుతోందని చెప్పారు. ‘మరింత అభివృద్ధి చెందండి.. మరింత సాధించండి’ అనే దృక్పథంతో దేశం కొత్త పారిశ్రామిక పునాదిని నిర్మిస్తోందని ప్రధాని తెలిపారు. చిప్స్ నుంచి ఓడల వరకు విస్తరించిన ఆధునిక తయారీ పర్యావరణ వ్యవస్థను భారత్‌రూపొందిస్తోందని, ప్రపంచ తయారీ కేంద్రంగా ఎదగడానికి వేగంగా అడుగులు వేస్తోందని అన్నారు.



గురువారం ‘మెల్‌బోర్న్ మీట్స్ మోడీ’లో అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్

## అత్యుత్తమ వైద్య సంస్థగా బీబీనగర్ ఎయిమ్స్

>> శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. బీబీనగర్ ఎయిమ్స్‌లో అధికారులతో గురువారం సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, దేశంలో ఆరోగ్య రంగానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఒకప్పుడు దేశంలో ఢిల్లీలో మాత్రమే ఎయిమ్స్ ఉండేదని, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి హయాంలో మరో ఐదు ఎయిమ్స్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. 2014 తర్వాత మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా మరో 23 ఎయిమ్స్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టగా, ఇప్పటికే 14 పూర్తిస్థాయిలో సేవలందిస్తున్నాయని, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు.

సుమారు రూ.1,000 కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న బీబీనగర్ ఎయిమ్స్ తెలంగాణ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించే కేంద్రంగా మారనుందని తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 24 వైద్య విభాగాలు పనిచేస్తుండగా, ఇప్పటికే రెండు ఎంబీబీఎస్ బ్యాచ్‌లు విద్యను అభ్యసిస్తున్నాయని చెప్పారు. అవసరమైన బోధనా సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నారని, వైద్య విద్య, వైద్య సేవలు, పరిశోధనలను సమాంతరంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.

ప్రస్తుతం బీబీనగర్ ఎయిమ్స్‌లో రోజుకు సుమారు 1,800 మంది రోగులకు ఔట్‌పేషెంట్ సేవలు అందుతున్నాయని, అత్యవసర వైద్య సేవలు, ఆధునిక నిర్ధారణ పరీక్షలు, ప్రత్యేక వైద్య చికిత్సలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. టెలిమెడిసిన్ సేవల ద్వారా లక్షలాది మంది ప్రజలు నిపుణుల వైద్య సలహాలు పొందుతున్నారని వెల్లడించారు. వైద్య పరిశోధన రంగంలో కూడా ఎయిమ్స్ విశేష పురోగతి సాధిస్తోందని జేపీ నడ్డా తెలిపారు. పరిశోధన కార్యక్రమాల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.64 కోట్ల నిధులు మంజూరు చేసిందని, ప్రస్తుతం 128 పరిశోధన ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇప్పటివరకు వెయ్యికి పైగా పరిశోధనా పత్రాలు ప్రచురితమవడం సంస్థ ప్రతిష్ఠను మరింత పెంచిందన్నారు.

దేశంలోనే తొలిసారిగా బీబీనగర్ ఎయిమ్స్‌లో కమ్యూనిటీ రేడియో స్టేషన్‌ను ఏర్పాటు చేశామని, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోందన్నారు. అలాగే ఎయిమ్స్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 547 లక్షలకు పైగా వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలను చేరువ చేసినట్లు వివరించారు.

బీబీనగర్ ఎయిమ్స్‌లో అన్ని మౌలిక సదుపాయాలు, అత్యాధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులు, పూర్తి స్థాయి బోధనా సిబ్బంది అందుబాటులో ఉన్నారని మంత్రి తెలిపారు. కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రజలకు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఢిల్లీలోని ఎయిమ్స్ దేశంలో అత్యున్నత వైద్య సంస్థగా ఎదగడానికి దాదాపు రెండు దశాబ్దాలు పట్టిందని, అయితే బీబీనగర్ ఎయిమ్స్ కేవలం పదేళ్లలోనే వేగంగా అభివృద్ధి సాధించిందన్నారు.

వైద్య సేవలు, వైద్య విద్య, పరిశోధన రంగాల్లో బీబీనగర్ ఎయిమ్స్‌ను దేశంలోనే ఆదర్శ సంస్థగా, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని జేపీ నడ్డా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి విజయ్ నేత్రా, రాజ్యసభ సభ్యులు డా. కె. లక్ష్మణ్, లోక్ సభ సభ్యులు డి.కె.అరుణ, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ , బిజెపి జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మూసీ పునరుజ్జీవ పనులకు గ్రీన్‌సిగ్నల్

>> నుంచి రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మూసీ రివర్ ఫ్రంట్ పనులు ఈపీసి విధానంలో నిర్వహించనున్నారు. జోన్1లో హిమాయత్‌సాగర్-బాపూఘాట్ వరకు రూ.3,104 కోట్లతో 9.20 కి.మీ అభివృద్ధి చేయనున్నారు. జోన్-1బీలోఉస్మాన్ సాగర్-బాపూ ఘాట్ వరకు రూ.3,950 కోట్లతో 11.80 కి.మీ. అభివృద్ధి చేయనున్నారు. మొత్తం 21 కి.మీ. ప్రాధాన్య స్ట్రెచ్‌లో మూసీ రివర్ ఫ్రంట్‌పనులు జరుగనున్నాయి. ప్రాజెక్టు పర్యవేక్షణకుప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ నియామకానికి ఎంఆర్‌డిసిఎల్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని ఎంఆర్‌డిసిఎల్‌కు ఆదేశాలు జారీ చేసింది.

## బండి భగీరథ్‌కు బెయిలు

### పోక్సో కేసులో షరతులతో మంజూరు చేసిన హైకోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై9:** పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ. లక్ష పూచీకత్తుతో పాటు కోర్టు నిర్దేశించిన షరతుల మేరకు బెయిల్ మంజూరైంది. ఈ కేసు విచారణ ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండాలని హైకోర్టు స్పష్టం చేసింది. బండి భగీరథ్‌పై పేటబషీరాబాద్ పీఎస్‌లో పోక్సో కేసు నమోదు కాగా, మే 16న అతడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాం డ్‌కు తరలించారు. ప్రస్తుతం చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ భగీరథ్ విద్యార్థి అని, 45 రోజులకు పైగా జైలులో ఉండటంతో జీవితంలో చాలా కోల్పోయాడని తెలిపారు. పరస్పర అంగీకారంతో జరిగిన దానిపై కేసులు నమోదు చేయడం చెల్లదని, ఇదే విషయాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులు పలు తీర్పుల్లో వెల్లడించాయన్నారు. బెయిల్ మంజూరు చేస్తే కోర్టు విధించిన షరతులకు కట్టుబడి ఉంటారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వెంటనే వాంగ్మూలాల సేకరణ మొదలైందన్నారు. దర్యాప్తు దాదాపు పూర్తికావచ్చిందని, గడువులోగా అభియోగ పత్రాన్ని దాఖలు చేస్తామన్నారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన తీర్పును రిజర్వ్ చేస్తూ గురువారంకు వాయిదా వేశారు. గురువారం భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలా ఉండగా, తన మైనర్ కుమార్తెను బండి భగీరథ్ లైంగికంగా వేధించాడంటూ ఆ బాలిక తల్లి మే 8న పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కంప్లైంట్ చేయగా అతనిపై పోక్సో కేసు నమోదైంది. 17 ఏళ్ల బాలికను బండి భగీరథ్ లైంగికంగా వేధించడం, అసభ్యంగా ప్రవర్తించడం, బెదిరించడం, నేరపూరిత కుట్రకు పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ కుమార్తెకు ఇష్టం లేకున్నా ఫామ్‌హౌస్, ప్రైవేటు అపార్ట్‌మెంట్లకు రావాలని భగీరథ్ బలవంతం చేసినట్లు ఫిర్యాదులో తెలిపారు. దీనిపై సమగ్రంగా విచారణ జరిపిన అనంతరం మే 16న పోలీసులు బండి భగీరథ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఇప్పుడు ఆయనకు బెయిల్ రావడంతో విడుదల కానున్నారు.

## రాష్ట్రాభివృద్ధికి కలిసిరండి!

>> కొన్నాళ్లు పని చేయనివ్వండి’ అని విపక్షాలకు పిలుపునిచ్చారు. దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు చెన్నై లాంటి మెట్రోపాలిటన్ నగరాలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోని కారణంగానే చాలా కష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. ‘ఆ నగరాల అనుభవాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలోని జీడిమెట్ల, బాలానగర్ లాంటి ఇండస్ట్రియల్ పార్కులున్న ప్రాంతాల్లో పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం, దానికితోడు మూసీ నది కాలుష్యంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుకే 2,100 చ.కి.మీ మేరకు విస్తరించి ఉన్న ఈ కోర్ అర్బన్ రీజియన్‌లో పూర్తిగా కాలుష్యరహిత ప్రాంతంగా మార్చాలని సంకల్పించాం’ అని చెప్పారు. పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించడానికి చట్టం చేశాం. ఓఆర్ఆర్ బయట పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ ప్రాంతంలో మాన్యుఫాక్చరింగ్ జోన్‌గా గుర్తించాం. ఇక్కడి నుంచి తరలించిన పరిశ్రమలకు అవసరమైన స్థలాలను మాన్యుఫాక్చరింగ్ జోన్ లో కేటాయిస్తామని ముఖ్యమంత్రి వివరించారు. ‘మాన్యుఫాక్చరింగ్ జోన్‌లో మొట్టమొదటగా ప్రారంభమైన సంస్థ ప్రీమియర్ ఎనర్జీ కావడం ప్రశంసనీయం. కేవలం 12 నెలల కాలంలో యూనిట్‌ను నెలకొల్పింది’ అని సిఎం సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. ‘తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు ప్రాంతీయ మండళ్లుగా విభజించి సమగ్రమైన ప్రణాళికలతో ముందుకు వెళుతున్నాం. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమిగా తెలంగాణను తీర్చిదిద్దాలని సంకల్పించాం. దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ 10 శాతం భాగస్వామ్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్ది, తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టాలన్నది మా సంకల్పం’ అని ప్రకటించారు.

వైట్ కాలర్ ఉద్యోగాలు కష్టమైన పరిస్థితులను అర్థం చేసుకుని యువత బ్లూకాలర్ జాబ్స్ అందిపుచ్చుకునే దిశగా నైపుణ్యతను పెంచడానికి ఎక్కువ దృష్టి సారించాం. యువతకు నైపుణ్యం అందించేందుకు ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలు, స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు వంటి మొత్తంగా వ్యవస్థలను ఆ దిశగా సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

‘హైదరాబాద్ ప్రపంచంతో పోటీ పడాలంటే ఇప్పుడున్న పెట్టుబడులు, పరిశ్రమలు సరిపోవు. మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలు రావాలి. 2047 నాటికి వంద సంవత్సరాల స్వాతంత్ర్య ఉత్సవాలను జరుపుకోబోతున్న తరుణంలో వెనక్కి తిరిగి చూస్తే ఎక్కడ మొదలయ్యాం. ఎక్కడికి చేరుకోవాలనుకున్నామో ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్లాలి’ అని చెప్పారు.

పెరిగిన కాలుష్యాన్ని నియంత్రించడానికి సోలార్ ఎనర్జీతో ఆక్సిజన్ పంపింగ్ చేసే యంత్రాలను ప్రీమియర్ ఎనర్జీ రూపొందించడం అభినందనీయం. అలాంటి పరిస్థితులు తలెత్తడంపై అందరూ ఆలోచన చేయాలి అని చెప్పారు. ప్రకృతిని విధ్వంసం చేయడం వల్ల ఇలాంటి తీవ్రమైన పరిణామాలకు దారితీస్తోంది. నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. అంతకన్నా ఎక్కువ ప్రజల నుంచి సంపూర్ణ సహకారం ఉండాలని ముఖ్యమంత్రి కోరారు. గ్రామంలో భూములు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఇంటి పట్టాలు, ఉపాధి కోసం వ్యాపార సముదాయాలను నిర్మించి ఇవ్వాలని కలెక్టర్ ను ఆదేశిస్తున్నట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా రైతులు త్యాగం చేయడం వల్లే ఈ అభివృద్ధి సాధ్యమైందన్నారు.

చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామన్నారు. బుద్వేల్ నుంచి కొడంగల్ వరకు 100 మీటర్ల రోడ్డు నిర్మాణం జరుగుతోందని, త్వరలోనే ఇక్కడ ఆలయ ప్రారంభోత్సవానికి వస్తా.. మళ్లీ మీ అందరినీ కలుస్తా అని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, ప్రభుత్వ సలహాదారు కె.రామకృష్ణారావు, ప్రీమియర్ ఎనర్జీ చైర్మన్ సురేందర్ పాల్ సింగ్ సలూజా, మేనేజింగ్ డైరెక్టర్ చిరంజీవ్ సింగ్ సలూజా, ప్రభుత్వ అధికారులు, సంస్థ ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# తాత.. నువ్వు పూరీలు వేస్తేనే తింటా..

## మనవడు అడిగితే తప్పతుందా?

## సిఎం రేవంత్ చెఫ్ అవతారం!



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 9:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి రోజూ ఎంత బిజీగా ఉంటారో అందరికీ తెలిసిందే. కుటుంబ సభ్యులతో కలిసి సమయం గడపే అవకాశం ఆయనకు చాలా తక్కువగా లభిస్తుంది. ఆ సమయంలోనే ఆయన తన ఫ్యామిలీతో ఎంజాయ్ చేస్తారు. తాజాగా రేవంత్ తన మనవడి కోసం షెఫ్‌గా మారిపోయారు. మనవడు అడిగాడని ఆయన స్వయంగా పూరీలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోని సోషల్ మీడి యా ద్వారా పంచుకున్నారు. 'తాత.. నువ్వు పూరీలు వేస్తేనే తింటా' అని మనవడు అడిగితే తప్పుతుందా. పక్కన మనవడు.. చేతిలో పిడికెడు పిండి.. దోసిట్లో నవ్వులు.. గుండ్రంగా లేని డజన్ పూరీలు.. బిజీ బిజీగా సాగుతున్న ప్రజా జీవితంలో మనవడితో కలిసి పూరీలు వేస్తూ ఈ కొన్ని క్షణాలు, మధుర జ్ఞాపకాలు' అంటూ ఆయన ఎక్స్‌లో విడియో షేర్ చేశారు.

# కేంద్ర, రాష్ట్ర పథకాలు చివరి లబ్దిదారుని వరకు చేరాలి

## ప్రతి రంగంలో నాణ్యత, పారదర్శకత, సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వాలి: గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో, జులై 9, ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి వాటి ప్రయోజనాలు చివరి లబ్దిదారుని వరకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని గవర్నర్ శివప్రతాప్‌శుక్లా అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల అధికారులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై గవర్నర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కె.ఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం అమలు, టీబీ బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, స్క్రీనింగ్ క్యాంపులు, ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం, పల్స్ పోలియో కార్యక్రమం అమలు తీరుపై గవర్నర్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గవర్నర్ మాట్లాడుతూ, టీబీ నిర్మూలనకు మరింత పటిష్ట చర్యలు చేపట్టాలని, విస్తృత స్థాయిలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి వ్యాధి నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు, వివిధ శాఖ అధికారులతో అన్ని అంశాలపై విస్తృతంగా చర్చించామని పేర్కొన్న గవర్నర్, పరిపాలనలో ఎదురయ్యే చిన్నచిన్న లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన లబ్దిదారులకు చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్న గవర్నర్, ఈ ప్రాంతం పత్తి సాగుకు ప్రసిద్ధి చెందినందున రైతులను అధిక ఆదాయం వచ్చే పంటల సాగు, విలువ ఆధారిత వ్యవసాయం వైపు ప్రోత్సహించాలని సూచించారు. పాలనలో పారదర్శకత అత్యంత కీలకమని, పారదర్శక వ్యవస్థ వల్ల ప్రజలకు, రైతులకు, ప్రభుత్వానికి సమానంగా ప్రయోజనం కలుగుతుందని అన్నారు. భవిష్యత్తులో కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ, దానిని భయపడాల్సిన అవసరం లేదని, ఏఐని మనిషి సృష్టించాడనే విషయాన్ని గుర్తుంచుకొని, దానిని సమర్థవంతమైన సాధనంగా ఉపయోగించుకుని పరిపాలన, సేవల నాణ్యతను మరింత మెరుగు పరచుకోవాలని సూచించారు. ప్రతి శాఖ సమన్వయంతో, ప్రతి రంగానికి సమాన ప్రాధాన్యం ఇస్తూ పనిచేస్తే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని గవర్నర్ పేర్కొన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా అమలు చేస్తున్న తీరును ఆయన అభినందించారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయడం అభినందనీయమని అన్నారు. వర్షాకాలంలో సంక్షేమ హాస్టళ్లలో నివసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పైకప్పుల లీకేజీలు, దెబ్బతిన్న భవనాలు, నీటి సరఫరా, డ్రైనేజీ తదితర పెండింగ్ మరమ్మత్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. అత్యవసర నిధులను పారదర్శకంగా, అవసరాలకు అనుగుణంగా వినియోగించి, విద్యార్థులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని కలెక్టర్లను ఆదేశించిన మంత్రి, 'హాస్టళ్లలో చదువుతున్న ప్రతి విద్యార్థి భద్రత, ఆరోగ్యం, విద్యా ప్రగతి ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం' అని స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో హనుమ కొండ జిల్లా అదనపు కలెక్టర్లు రవి సంధ్యారాణి, వరంగల్ డీసీపీ దారా కవిత, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు



గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

# కెసిఆర్ బయటకు రాడు.. రాజకీయాలు చెయ్యడు

## ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, జులై 9,ప్రభాతవార్త:** కెసిఆర్ రాసి పెట్టుకో 2035 వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నే అని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ జోస్యం చెప్పారు. సిఎల్‌పి కార్యాయలంలో గురువారం సిఎల్‌పి విలేఖరులతో మాట్లాడుతూ కెసిఆర్ బయటకు రాడు..రాజకీయాలు చెయ్యడు అని ధీమా వ్యక్తంచేశారు. కెటిఆర్ కి తన పార్టీ ని పటిష్టం చేసుకో లేక సోషల్ మీడియా,సర్వే ల పేరుతో ప్రజలను తప్పు దారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాడనీ ఆరోపించారు. నేనే మళ్లీ సిఎం అన్న రేవంత్ రెడ్డి మాటలకు భయపడే కెటిఆర్ సర్వే ల ఫలితాలు చెపుతున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు బిజెపి తో కలవడం తప్ప బిఆర్ ఎస్ కి ఇంకో మార్గం లేదనీ అద్దంకి సలహా ఇచ్చారు. బిజెపి తో కలిస్తేనే బిఆర్ ఎస్ కి రాజకీయ భవిష్యత్తు ఉంటుదని అని అన్నారు. బిజెపి తో సీట్ల బేరం కోసమే బిఆర్ ఎస్ హడావుడి చేస్తోందనీ ఆయన వివరించారు. కెసిఆర్ పేరు చెప్పుకొని పార్టీ లో బలపడటానికి పోటీ పడుతున్నారనీ మీ మద్యనే సిఎం కుర్చీ కోసం పోటీ ఉందనీ విమర్శించారు. హరీష్ రావు పార్టీ లో ఉంటాడనే నమ్మకం లేదనీ అనుమానం వ్యక్తంచేశారు. కల్వ కుంట్ల కుటుంబం గందర గోళంలో ఉందనీ అద్దంకి అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కల్వకుంట్ల కుటుంబాన్నీ కూల్చిందనీ అన్నారు. పశుపతిలా కల్వకుంట్ల కుటుంబానికి ప్రజలు సమాధి కట్టారు మళ్లీ వచ్చినా జనం వది పెట్టరని అన్నారు.



# రైతు సంక్షేమమే కాంగ్రెస్ పునాది

## 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా అందజేత

## రైతుమేళాలో పాల్గొన్న డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**చింతకాని, జులై 9, ప్రభాతవార్త:** రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారూ మండలం పరిధిలోని మత్కేపల్లి క్రాస్‌రోడ్‌లో గురువారం నిర్వహించిన మెగా రైతు మేళాకు రైతులు విశేషంగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మంత్రివర్గం రైతుల అవసరాలు, వ్యవసాయ రంగ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందన్నారు విత్తనం వేసినప్పటి నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి దశలో రైతులకు ప్రభుత్వం అండగా ఉంటోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ప్రతి కుటుంబానికి వ్యవసాయంతో అనుబంధం ఉందని, అందుకే ఇక్కడ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రత్యామ్నాయ పంటలపై శాస్త్రవేత్తలతో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 10న జరిగే రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి సహా మంత్రివర్గం మొత్తం హాజరవుతుందని అన్నారు. చింతకాని మండలంలో మూడు లక్షల మంది రైతులతో భారీ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద రైతు సభను చింతకాని మండలంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవడం లేదని, ఈ ఏడాది నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ఎలా వ్యవసాయం చేయాలనే అంశాలపై వ్యవసాయ శాఖ శాస్త్రీయ సూచనలు అందిస్తోందన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్నను కొనుగోలు చేయలేదని, రైతులు నష్టపోకుండా ఉండేందుకు డిప్యూటీ సీఎం రూ.5 వేల కోట్లు కేటాయించి మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేశారని తెలిపారు మొక్కజొన్నతో పాటు జొన్న, సోయా తదితర పంటలను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. మొక్కజొన్న విక్రయించిన రైతుల ఖాతాల్లో మద్దతు ధర చెల్లింపులు రేపటిలోగా జమ చేస్తామని స్పష్టం చేశారు. జూలై 10న జరిగే రైతు ఆశీర్వాద సభ చారిత్రక ఘట్టమని, రైతులకు అవసరమైన ప్రతి సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. మెగా రైతు మేళా, రైతు ఆశీర్వాద సభ నిర్వహణకు అద్భుతమైన ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం, అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు.వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను రైతులకు వివరించేందుకు ఈ మెగా రైతు మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు.కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మెగా రైతు మేళా కోసం మొత్తం 150 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించడమే నా డ్రీమ్

## నవంబర్‌లో ఖేలో ఇండియా గేమ్స్‌కు ఆతిథ్యం ఇస్తాం

## క్రీడాకారుల కోసం స్పష్టమైన స్పోర్ట్స్ పాలసీ తెచ్చాం

## స్పోర్ట్స్ వర్సిటీ, స్పోర్ట్స్ డిస్ట్రిక్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 9:** హైదరాబాద్ వేదికగా ఒలింపిక్స్ క్రీడలను నిర్వహించాలనేదే తన డ్రీమ్ అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. క్రీడా రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో క్రీడాకారుల కోసం స్పష్టమైన స్పోర్ట్స్ పాలసీ తీసుకువచ్చామని, క్రీడాకారులకు సంపూర్ణ సహకారం అందిస్తామని పేర్కొన్నారు. గురువారం గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌ను, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ వర్సిటీ(వైపిఈఎస్‌యు)ని సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. స్పోర్ట్స్ వర్సిటీ వెబ్‌సైట్, లోగో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇండియన్ ఒలంపిక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పిటి ఉష పాల్గొన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ యువకులు దేశ సంపద, కానీ ఒలంపిక్స్‌లో ప్రపంచ దేశాలతో పోల్చితే భారత్ అత్యంత వెనుకబడి ఉందని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ క్రీడల పతకాల పట్టికలో.. భారత్ అట్టడుగు స్థానంలో ఉంటోందని అన్నారు. దేశానికి అకాడమీలు, వసతులు అవసరమని తెలిపారు. క్రీడాకారులను ప్రభుత్వాలు ప్రోత్స హించాలని సూచించారు. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పుకొచ్చారు. దేశం గర్వించే క్రీడాకారులు, వ్యాపారవేత్తలను భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. అప్పుడప్పుడు పీటీ ఉష లాంటి క్రీడాకారులు క్రీడల్లో దేశానికి పేరు తీసుకువచ్చారని ప్రశంసించారు. క్రీడల్లో రాణించడం వల్లే పీటీ ఉషకు గుర్తింపు వచ్చిందని కొనియాడారు. అంతకు ముందు యంగ్ ఇం డియా స్పోర్ట్స్ ఫెలోషిప్,అకడమిక్ కోర్సులను ప్రారంభించారు.నేసనల్ టాలెంట్ ఇడెంటిఫికేషన్ ప్రోగ్రామ్ పర్ పారా అథ్లెటిక్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.



ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదిత్య మెహతా ఫౌండేషన్‌తో ఎంఓయు కుదుర్చుకుంది. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు,క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన మై భారత్‌తో అవగాహన ఒప్పందం ప్రభుత్వం కుదుర్చుకుంది. ఇదిలా ఉండగా ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026,నేషనల్ ఇంటర్–డిస్ట్రిక్స్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్(ఎన్ఐడిజె ఏఎం) టోర్నమెంట్స్ 8వ ఎడిషన్‌కు తెలంగాణ అతిథ్యం ఇవ్వనుంది. తెలంగాణ స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని సిఎం ప్రారంభించారు.

వివిధ క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన తెలంగాణకు చెందిన ఆరుగురు క్రీడాకారులకు రూ. 7.15 కోట్ల మేరకు నగదు ప్రోత్సాహకాలను ఈ సందర్భంగా వారికి సిఎం అందించారు. దీప్తి దివాంజీ (ప్యారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్) కి రూ. 50 లక్షలు, దనుష్ శ్రీకాంత్ (షూటింగ్ డెఫ్లింపిక్స్) కు రూ. 2.10 కోట్లు, ఈషా సింగ్ (ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ విజేత వరల్డ్ రికార్డు) కు రూ. 3.3 కోట్లు, నిఖత్ జరీన్ (బాక్సింగ్) కు రూ. 60 లక్షలు, తనిష్క్ మురళీధర్ నాయుడు (షూటింగ్) కు రూ. 53.65 లక్షలు, రావూరి సురభి భరద్వాజ్ (షూటింగ్) కు రూ. 10 లక్షల నగదు ప్రోత్సాహకాలకు సంబంధించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా చెక్కులను అందించారు.

# పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా జూమ్ సమీక్ష సమావేశం

## బిఎల్ఎ పనితీరుపై పిసిసి అధ్యక్షుడు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సమీక్ష

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణతో అర్హులు ఓట్లు కోల్పోకుండా కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎలు చొరవ తీసుకోవాలని ఇతర నాయకులు కూడా చిత్తశుద్ధితో ప్రజాస్వామ్య ప్రక్రియ దెబ్బతినకుండా జాగ్రతగా ఉండాలని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షినటరాజన్ పిలుపు నిచ్చారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం, బూత్ స్థాయి ఏర్పాట్లు, బిఎల్‌ఒల పనితీరుపై పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా గాంధీభవన్ నుంచి గురువారం పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో జూమ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీలు, పార్లమెంట్ ఇంచార్జ్‌లు, సర్ పార్లమెంట్ కోఆర్డినేటర్లు, అసెంబ్లీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. సర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఈ సమీక్ష చేపట్టారు. సమావేశంలో ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గంలోని పనితీరును క్షుణ్ణంగా సమీక్షించిన మహేష్‌కుమార్‌గౌడ్, మీనాక్షి నటరాజన్ బూత్‌ల వారీగా జరుగుతున్న సర్ ప్రక్రియ, బిఎల్‌ఒల పనితీరు, ఓటర్ల జాబితా పరిశీలన, అవసరమైన పత్రాల సేకరణ, ప్రతి అర్హ ఓటు పరిరక్షణకు తీసు కుంటున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. పనితీరు మెరుగు పర్చాల్సిన ప్రాంతాలపై సంబంధిత ఇన్‌చార్జ్‌లకు దిశానిర్దేశం చేశారు. బూత్ స్థాయిలో సమన్వయం మరింత బలోపేతం చేయాలని, ప్రతి బిఎల్ఏ పూర్తి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి నిరక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, అర్హులైన వారి ఓటు రక్షణే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# రేపు యాదగిరిగుట్ట ఆలయ పాలకవర్గం ప్రమాణస్వీకారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 9:** ఈ నెల 11న యాదగిరిగుట్ట ఆలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయనుంది. ఉదయం 11.37కు ప్రధానాలయంలోని బంగారు వాకిలి ఎదుట చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జూన్ 30న యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేసింది.



# పూరీ జగన్నాథుడికి 95 కిలోల వెండితో ప్రత్యేక రథం

**పూరి, జులై 9:** జగన్నాథుడి రథయాత్ర కోసం పూరీ నగరం సహా అంతటా అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాజస్థాన్ లోని ఉదయ్‌పుర్‌లో కూడా ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. జగన్నాథుడి కోసం 95 కిలోల భారీ వెండి రథం సిద్ధమవుతోంది. మొత్తం 58 విడిభాగాలను కలిపి దాదాపు 21 అడుగుల ఎత్తు, 17 అడుగుల పొడవుతో కళాకారులు రథాన్ని తీర్చిదిదుతున్నారు. ప్రస్తుతం రథం విడిభాగాలకు తుది మెరుగులు దిద్దుతు న్నారు. రథయాత్రకు ఐదు రోజుల ముందు ప్రతి భాగాన్ని ఒక్కచోటుకు చేరుస్తారు. ఆ తర్వాత నైపుణ్యం గల శిల్పులు వాటిని నిర్ణీత క్రమంలో అమర్చుతారు. రథయాత్ర ముగిశాక వాటిని జాగ్రత్తగా వేరుచేసి భద్రపరుస్తారు. జూలై 16న జగన్నాథుడి ఊరేగింపును తిలకించేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

# కొనుగోలు కేంద్రాలు, లైసెన్సుల మంజూరులో రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు ప్రాధాన్యం

## కొత్త మార్గదర్శకాలు విడుదల చేసిన సర్కార్

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త:** రైతు ఉత్పత్తిదారుల సంస్థలను (ఎఫ్‌పీఓలు) మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ), ధర మద్దతు పథకం (పీఎస్ఎస్) కింద ఏర్పాటు చేసే పంటల కొనుగోలు కేంద్రాల కేటాయింపులో అర్హత కలిగిన రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు దీనికి సంబంధించి వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్ ఉత్తర్వులు విడుదల చేశారు. మౌలిక సదుపాయాలు, ఆర్థిక సామర్థ్యం, శిక్షణ పొందిన సిబ్బంది, పారదర్శక నిర్వహణ ఉన్న రైతు ఉత్పత్తిదారుల సంస్థలను జిల్లా కలెక్టర్లు గుర్తించి కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు. ఇప్పటికే ఈ బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), స్వయం సహాయక సంఘాలు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలు(డీసీఎంఎస్), గిరిజన సహకార సంస్థ (జీసీసీ) వంటి సంస్థలతో పాటు అర్హత కలిగిన రైతు ఉత్పత్తిదారుల సంస్థలను కూడా భాగస్వాములుగా చేర్చాలని ప్రభుత్వం ఆదేశించింది.


ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల విక్రయాలకు అవసరమైన లైసెన్సుల కోసం రైతు ఉత్పత్తిదారుల సంస్థలు సమర్పించే దరఖాస్తులను జిల్లా వ్యవసాయ అధికారులు ప్రాధాన్యంతో పరిశీలించి త్వరితగతిన మంజూరు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ఐఎఫ్ఎఫ్‌సీవో యూరియా, గ్రీన్ మ్యాన్యూర్ తదితర వ్యవసాయ ఇన్‌పుట్ల పంపిణీలోనూ రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు ప్రాధాన్యం కల్పించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వుల అమలును సమర్థంగా పర్యవేక్షించేందుకు జిల్లా కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ, మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో క్రమం తప్పకుండా సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ఆదేశించింది. రైతులే భాగస్వాములుగా ఉండే రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పెరగడంతో పాటు ప్రభుత్వ సేవలు, వ్యవసాయ ఇన్‌పుట్స్ రైతులకు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

# ప్రభుత్వం, పార్టీ స్పందించాలి.. నా శాఖను టచ్ చేశారు

## పిసిసి ఛీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌తో మంత్రి కొండా సురేఖ భేటీ

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త:** 'కొండ సురేఖ ఏదో ఒకటి వచ్చి రానివి చిచ్చు పెట్టుకొంటుందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తనపై బురద జల్లుతున్నారనా, నా శాఖను టచ్ చేశారు కనుకనే నేను స్పందించాన'ని దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. దేవాదాయ శాఖ కార్యాలయంలో ఒక ఎమ్మెల్యే రౌండ్‌టేబుల్ సమావేశం జరిపి సమీక్ష చేసి మినట్లు జారీచేసే అధికారం ఎక్కడిది అని ప్రశ్నించారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు మంత్రి కొండ సురేఖ గురువారం గాంధీభవన్‌లో కలిసి ఫిర్యాదు చేశారు. నేను టిఆర్ఎస్ ఎమ్మెల్యే అని చెప్పుకొనే కడియం శ్రీహరి కాంగ్రెస్ టికెట్టు పొందిన ఆయన కూతురు కావ్య తరుపున ప్రచారం చేశారని ఆయన నీతి నిజాయితీ,విలువలు గురించి మాట్లాడటం హాస్యాస్పదం అని విమర్శించారు. కడియం శ్రీహరి నూటికి నూరుపాళ్ళు తప్పు చేశారని కడియం పార్టీ పరం గా చర్యలు తీసుకోవాలని మంత్రి విన్నవించారు. మా హజ్బండ్ బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చినప్పుడు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి వచ్చారని బిఆర్ఎస్ ఎమ్మెల్యే పదవికి రాజీనామాచేసి కడియం కాంగ్రెస్‌లోకి రావాలని ఆమె డిమాండ్ చేశారు.

మహిళా మంత్రిని టార్గెట్ చేస్తూ జిల్లా రాజకీయాల్లో తనను ఇబ్బంది పెడుతున్న కడియం పై చర్యలకు డిమాండ్ చేశారు. నిన్న ముఖ్యమంత్రికి సైతం మంత్రి హోదాలో ఫిర్యాదు చేసాను అని వివరించారు. ఈ రోజు పిసిసి చీఫ్‌కు ఆ విషయంకూడా చెప్పినట్లు సురేఖ తెలిపారు. సురేఖ విజ్ఞప్తి పై స్పందించిన టిపిసిసి చీఫ్ మహేష్ కడియం శ్రీహరి , కొండా సురేఖ వివాదాన్ని పరిష్కరిస్తానని హామి ఇచ్చారని సురేఖ అన్నారు. నలుబై సంవత్సరాల రాజకీయ అనుభవం కడియం శ్రీహరికి రూల్స్ రెగ్యులేషన్ తెలియదా ఆయన ఏదైనా శాఖకు సంబంధించి మంత్రికి లేదా ముఖ్యమంత్రికి ఎమ్మెల్యేగా తెలుపాలని అధికారుల చాంబర్‌లోకి వెళ్ళి ఇవ్వొచ్చుకానీ ఇలా రివ్యూచేసి తన పిఆర్‌వోతో పత్రికలకు ఫోటోలు ప్రెస్‌నోట్లు ఇవ్వడం ఏంటీ ఇది కేవలం సమాంతర ప్రభుత్వం నడపడమే అని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు.




**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY**
Rayapudi, Amaravati-522237, Andhra Pradesh.
NIT No. Lr. No. MAU61-USI0HB(OTH)/513/2025-HB, Dated:09/07/2026
**E-PROCUREMENT TENDER NOTICE**
**NAME OF THE WORK:** APCRDA-"Improvements to existing Parade ground and parking area for Independence-Day Celebrations-2026 in Amaravati Capital City, Amaravati" **Est. Cost: Rs.4.25 Crores.** The bid can be downloaded on AP e-procurement portal from **10.07.2026 to 17.07.2026 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **17.07.2026 up to 15.00 Hrs**, Technical bid opening **17.07.2026 @ 16.00 Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in.**
Sd/- COMMISSIONER, APCRDA, AMARAVATI

తెలంగాణ ప్రభుత్వం
**నిజామాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయము**
**టెండర్ ప్రకటన నం. EE/NMC/10/2026, తేది: 08.07.2026**
NUDA నిధి క్రింద, బైపాస్ రోడ్‌కు ఉపరితలంపై పేవర్ ప్యాచ్‌లు వేయటం మరియు బైపాస్ రోడ్‌కు మధ్యస్థ బాట నిర్మాణం ఇతర అభివృద్ధిలు మరియు నిర్వహణ పనులు 02 నం. పనులకు టెండర్ కోరబడుతోంది. **బిడ్స్ ప్రారంభ తేది:** 10.07.2026 మరియు **బిడ్స్ దాఖలుకు చివరి తేది:** 28.07.2026 సా.05.00 గం. **తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం** http://tender.telangana.gov.in పై చూడండి. మరిన్ని తదుపరి వివరాలకు 6309506351 సంప్రదించండి.
సం/- కమిషనర్, NMC
DIPR.No.5782-PP/CL/Advt/1/2026-27, తేది: 09.07.2026

**భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్**
(భారత ప్రభుత్వరంగ సంస్థ)
రామచంద్రాపురం, హైదరాబాద్-502032 మానవ వనరుల యాజమాన్యం
ప్రకటన నెం: అప్రెంటిస్‌లు/2026/03
BHEL HPEP హైదరాబాద్ అప్రెంటిసెస్ చట్టం 1961 క్రింద ఒక సంవత్సరానికి క్రింద పేర్కొనబడిన వివిధ ట్రేడ్స్‌లలో ట్రేడ్ అప్రెంటిసెస్‌లుగా నియామకానికి అర్హులు మరియు ఆసక్తి గల అందరు అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

| వృత్తి | ఎలక్ట్రీషియన్ | ఫిట్టర్ | మెషినిస్ట్ | టర్నర్ | వెల్డర్ |
|---|---|---|---|---|---|
| ఖాళీలు | 25 | 85 | 70 | 42 | 37 |

| కార్పెంటర్ | ఎలక్ట్రానిక్ మెకానిక్ | ఫౌండ్రీమేన్ |
|---|---|---|
| 3 | 9 | 9 |

ట్రేడ్ అప్రెంటిసెస్‌గా ఎంపికైన అభ్యర్థులకు అప్రెంటిస్‌షిప్ మార్గదర్శకాల ప్రకారం, నెలవారీ స్టైపెండ్ చెల్లించబడుతుంది. ఆసక్తిగల మరియు అర్హులైన అభ్యర్థులు (ఆశ్రితులు డిపెండెంట్లు కాకుండా మిగిలిన అభ్యర్థులకు 2023 మరియు ఆ తర్వాత సంవత్సరంలో ఉత్తీర్ణులైన వారు). మా వెబ్‌సైట్ https://hpep.bhel.comపై అందుబాటులో ఉన్న సవివర ప్రకటనను దరఖాస్తు దాఖలుకు సంబంధించిన పూర్తి సమాచారానికి మరియు ఇతర వివరాలకు సంప్రదించవచ్చును.

వార్త

మీరు సాహసంతో పనిని చేపట్టలేకపోతే, మీరు ఓటమికి గురికానేకారు. కాని మీరు జీవితంలో ఏదీ సాధించలేకపోతారు.

-వినోబాభావే

# శాంతి ముణ్ణాళ్ల ముచ్చటేనా?


అమెరికా ఇరాన్‌ల మధ్య మళ్లీ భీకర యుద్ధానికి దారి తీసిన పరిస్థితులు ఉభయదేశాల మధ్య తాత్కాలిక శాంతి ఒప్పందానికి చెల్లుచీటీ పడినట్లే. ఇరాన్‌పైఅమెరికా తాజాగా చేపట్టిన సైనిక చర్యతో ఇరాన్ సైనిక, అణు సామర్థ్యాలను నిర్వీర్యం చేసినట్లుగా అమెరికాఅధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంబరపడిపోతున్నట్లే ఉంది. ఆయన ఏమి మాట్లాడినా అది సంచలనమే. అయితే అందులో గాసిప్ ఎంత ఉందో వైరిపక్షం వారు తేల్చేవరకు అంతే. టర్కీ రాజధాని అంకారాలో 'నాటో' సదస్సు అనంతరం మాట్లాడుతున్నప్పుడు ఇరాన్‌కు ఎలాంటి సైన్యం కానీ, వైమానిక దళం కానీ మిగలలేదని, 159నౌకలు సముద్ర గర్భంలో కలిసి పోయాయని వివరించారు.ఇరాన్ ప్రభుత్వం ఇక ఎన్నటికీ అణ్వాయుధాన్ని తయారుచేయలేదని అన్న ఆయన మాటలే నిజమైతే ఇరాన్, అమెరికాల మధ్య ద్వేష, శత్రు సంబంధాలే ఉండవని తేటతెల్లమైనట్లే కదా! ఇక వైరం కథ కంచికేనని అనుకోవాలి. కానీ పరిస్థితులు అలా కనిపించడం లేదు. హార్ముజ్ జల సంధిలో ఈ దుర్ఘటనలు అంతర్జాతీయ నౌకలకు ఎంతో ముప్పుగా పరిణమించాయి. తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ముగిసింది. భవిష్యత్‌లో చర్చలుండవు, సంప్రదింపులు మాత్రమే అనికూడా ట్రంప్ ప్రవచించారు.ఎప్పుడో ఓసారి ఇలాంటి విషయాలను వింటే ఇదే ఫైనల్ అను కోవడం సహజం. కానీ ట్రంప్ ఉదయం ఓ మాట, సాయంత్రం ఓ పలుకు పల్లె వేయడం వలన సీరియస్‌గా యుద్ధం జరుగుతున్నవేళ వాటికి విలువ లేకుండాపోయింది. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలు ఈ పశ్చిమాసియా యుద్ధ నేపథ్యంలో ఒడిదుడుకులు ఎదు ర్కొంటున్న పరిస్థితుల్లో కూడా ట్రంప్ తన హోదాను మరచి వాచాలత ప్రదర్శించడాన్ని ఏ దేశమూ హర్షించడం లేదు. అదేఇప్పుడు ప్రపంచ దేశాలను సంక్షోభంలో ముంచుతోంది. ఆయన మాటలకు నాటో అరబ్‌దేశాలు ఖాతరు చేయడంలేదు. తాజాగా అమెరికా, ఇరాన్ యుద్ధ ఘర్షణలో ఇటలీలోని తమ సైనిక స్థావరాలను భాగస్వా మ్యం చేయబోమని 'నాటో' వేదికగా ఇటలీ ప్రధాన మంత్రి జార్జియా మెలోని స్పష్టంచేశారు. ఇరువర్గాల మధ్య ఘర్షణలు తగ్గించే ప్రయత్నానికి బదులు వత్తాసు పలకడం విష యంలో ఔచిత్యం లేదు. తమతో కలిసిరాని స్పెయిన్ వంటి దేశాలతో అమెరికా ఏకపక్షంగా ట్రేడ్‌డీల్‌ను ఉపసంహరించుకుంది. ఇరాన్‌పై భీకర దాడులకు సహకరించాలని ఆయా దేశాల మెడపై ట్రంప్ కత్తివేలాడుతోంది. యుద్ధశాంతులలో తనదే పైచేయి అనిచెప్పుకున్న ఆయన ఇరాన్‌ను సర్వనాశనం చేయాలని సంకల్పం చెప్పుకున్నట్లుగానే ఉంది.ఇరాన్ ప్రపంచ చిత్రపటంలో కనిపించదు. ఇరాన్‌ను అణ్వాయుధరహిత దేశం స్థాయికి పడకొట్టేశామని చెప్పుకున్న ట్రంప్ ఇంకా దాడులు ఎందుకు కొనసాగిస్తున్నారో ఎవరూ జవాబు చెప్పలేని ప్రశ్న. పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. మరోసారి ప్రపంచ దేశాలను గందరగోళంలోకి నెట్టే అసందర్భ ప్రేలాపనలకు, యుద్ధ నిర్ణయాలకు పర్యవసానాలకు శ్వేత సౌధాధినేత జవాబు చెప్పాలి. 'నాసైన్యం– నా ఇష్టం' అంటే కుద రదు. హార్ముజ్ జలసంధిపై ఇరాన్, అమెరికా దాడులు ప్రతిదాడులు తర్వాత చమురు సరఫరాలకు అంతరాయం ఏర్పడిన రీత్యా బ్రెంట్‌క్రూడ్ ధరలు పెరిగాయి. శాంతి ఒప్పందం కూడా ప్రశాంతంగా జరుగలేదు. ఇరాన్‌ను బెదిరించి లొంగదీసుకోవాలన్న అమెరికా ఆశలు అడియాసలే అయ్యాయి. తీరా ఆరునెలల తాత్కాలిక ఒప్పందం ముణ్ణాళ్ల ముచ్చటే అయింది. అమెరికా గొంతెమ్మ షరతులు కారణంగానే ఇరాన్ లొంగినట్లు సయోధ్యకొచ్చినా ట్రంప్ వాచాలత వారిని పూర్తిస్థాయి శాశ్వత ఒప్పందం దిశగా పయనించనీయలేదు. తుర్కియేలో నాటో సదస్సు పూర్తయ్యాక ట్రంప్ మాట్లాడిన మాటలేవీ వినసొంపుగా లేదు. ఇరాన్‌పై దాడులు కొనసాగుతున్నట్లు చెప్పడం అదొక టెంపరితనమే. ఇప్పటికీ చాలా దేశాలు ట్రంప్ అనౌచిత వైఖరి వలలో ఆర్థికంగా బలహీనపడ్డాయి. ఇప్పటికిప్పుడు శాశ్వత మైత్రీ సంబంధాలు ఏర్పడినా గత యుద్ధపు నాటి పర్యవసానాలు ఫలితాలను తట్టుకుని వెంటనే నిలదొక్కుకునే పరిస్థితి ఏ దేశానికీ లేదు. మళ్లీ ఇప్పటి ఉద్రిక్తతలు ప్రపంచాన్ని ఏపరిస్థితికి తీసుకెళ్తుందోనని అన్నిదేశాలు ఆందోళన పడుతున్నాయి. ఇప్పటికే స్టాక్ మార్కెట్‌ల కుదేలయ్యాయి. తాత్కాలిక ఒప్పందం వీగిపోయింది. కాల్పుల విరమణకు తెరపడిం దన్న ట్రంప్ వాక్యాలు అంతర్జాతీయ చమురు మార్కెట్ పై ప్రభావం చూపాయి. ఆరుశాతం చమురు ఉత్పత్తుల ధరలు పెరిగాయి. ఇరాన్ చమురు అమ్మకాలపై అమెరికా మళ్లీ ఆంక్షలు విధించింది. ఇరాన్‌లో తమ దాడులకు వీలున్న లక్ష్యాలన్నిటినీ ఏకరువు పెట్టి మరీ ట్రంప్ ఆదేశాన్ని హెచ్చరిస్తున్నారు. ఖమేనీ అంత్యక్రియలు ప్రారంభమైన వేళ తానే కనుక దయ చూపకపోతే ఆ అంత్యక్రియల సందర్భంగా బాంబులేసి ఇరాన్ పెద్ద తలకాయలను ఒక్కసారిగా లేపేసే వాడిననే ట్రంప్ చెప్పుకోవడం కూడా ఆ దేశం ఆగ్రహానికి కారణమైంది. ఇరాన్‌ను పూర్తిగా నాశనం చేశామని చెప్తూనే 'ఖర్గ్ ద్వీపం' దాడుల విషయం ప్రస్తావిం చడం కూడా ఇరాన్ కోపానికి కారణమే. అమెరికా సైన్యం ఇరాన్ భూ భాగంపై బుధవారం రాత్రి చేసిన భీకరమైన వైమానిక దాడులు బాగా కల్లోల పరుస్తున్నాయి. ఈ దాడుల్లో భారతదేశ భాగస్వామ్యంతో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేసిన చబహార్ నౌకాశ్రయం అమెరికా క్షిపణులు ఒక్కసారిగా విరుచుకు పడడంతో భారీగా దెబ్బతిందన్న సమాచారం ఆందోళనకరమే. దెబ్బతిన్న దేశాల సైతం ఉభయ యుద్ధ భాగస్వామ్య మున్న దేశాలను శాంతి దిశగా సన్నద్ధం చేయడమొక్కటే శరణ్యం.

అందం తొందరగా కంటికి పాతబడి పోతుంది. శౌశీల్యానికి మాత్రమే ఎప్పుడూ నశించని ఆకర్షణ ఉంటుంది.



గురజాడ అప్పారావు

కల్లోలంగా ఉన్న కొలనులో నిశ్చలమైన ప్రతిబింబం కనబడదు. అలాగే నిలకడలేని మనసులో శాంతి నిలబడదు.



కె.స్టాన్‌స్లావిస్కి

# విధానాలు, వివాదాలలో ఇథనాల్

**ఇథనాల్ శక్తి సాంద్రత పెట్రోల్ కంటే తక్కువ కావడంతో, మైలేజీపై కొంత ప్రభావం ఉండటం సహజం. లీటర్ ఇథనాల్‌లో సుమారు 21మెగాజౌల్స్ శక్తి ఉండగా, పెట్రోల్‌లో అది 32 మెగాజౌల్స్ వరకు ఉంటుంది. అయితే ఇ-20లో కేవలం 20శాతం మాత్రమే ఇథనాల్ ఉండటంతో, మైలేజీ పై వాస్తవ ప్రభావం 2నుండి 4శాతంలోపే ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది.మరోవైపు, ఇథనాల్‌కు అనుకూలంగా వినిపించే ఒక సాంకేతిక వాదన కూడా ఉంది. శక్తిసాంద్రత తక్కువగా ఉన్నప్పటికీ, ఇథనాల్ ఆక్టేన్ సంఖ్య పెట్రోల్ కంటే గణనీయంగా ఎక్కువగా ఉంటుంది. అధిక ఆక్టేన్ ఇంధనం ఇంజిన్‌లో అనియంత్రిత దహనం (నాకింగ్) సమస్యను తగ్గించి, తగిన విధంగా రూపకల్పన చేసిన ఇంజిన్లలో పనితీరును మెరుగు పరచగలదని సాంకేతిక నిపుణుల అంచనా. అయితే ఈ ప్రయోజనాలు ఎంత మేరకు సాధారణ వినియోగదారుడికి అందుతున్నాయన్నది ఇంకా చర్చనీయాంశంగానే ఉంది.**



కృష్ణబాలాజి పల్లపోతు

దేశంలో రెండు దశాబ్దాలకు పైగా అమలవుతున్న ఇథనాల్ మిశ్రమ కార్యక్రమం ఇ-20 స్థాయికి అంటే 20 శాతానికి చేరుకోవడంతో దాని ప్రయోజనాలు, పరిమితులు, దీర్ఘకాలిక ప్రభావాలపై చర్చలు ఊపందుకున్నాయి. చమురు దిగుమతులనుకొంత మేర తగ్గించి విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయడం, శిలాజ ఇంధనాలవల్ల ఏర్పడే కర్బన ఉద్గారాలను నియంత్రించడం, చెరకు, మొక్కజొన్న వంటి పంటలకు అదనపు వినియోగావకాశాలు కల్పించి రైతుల ఆదాయం పెంచడం ఈ విధానం ప్రధాన లక్ష్యాలు.అయితే, ఆహార అవసరాలకు ఉపయోగపడే పంటలను ఇంధన ఉత్పత్తికి మళ్లించడం సమంజసమేనా?ప్రకృతి విపత్తులు, వాతావరణ మార్పుల వల్ల పంటల దిగుబడి తగ్గితే ఆ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలి? అన్న ప్రశ్నలు ప్రధానంగా వినిపిస్తూనే ఉన్నాయి.వాస్తవానికి, కేంద్ర ప్రభుత్వం 2003లో బ్రెజిల్, అమెరికా వంటి దేశాల తరహాలో ఇథనాల్ సమ్మిళితపెట్రోల్ వాడకాన్ని ప్రోత్సహించడం ప్రారంభించింది. ఇథనాల్ అనే ఆల్కహాల్ రకానికి చెందిన సేంద్రీయ పదార్థం చెరకు, మొక్క జొన్న వంటి పంటలను పులియబెట్టడం ద్వారా ఉత్పన్నమవుతుంది. 2013-14లో దేశ సగటు ఇథనాల్ మిశ్రమం 2శాతానికి లోపే ఉండేది. అది క్రమంగా పెరుగుతూ, 2025 చివరి నాటికి 20శాతం లక్ష్యాన్ని గడువుకంటే ముందుగానే సాధించింది. దాంతో 2026 ఏప్రిల్ నాటికి దేశవ్యాప్తంగా ఇ-20 ప్రామాణిక పెట్రోల్‌గా ప్రకటించబడింది. ఈ లక్ష్య సాధన కోసం ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచారు.2017-18లో సుమారు 500 కోట్ల లీటర్లు మాత్రమే ఉన్న ఇథనాల్ ఉత్పాదనా సామర్థ్యం 2023- 24 నాటికి 1,600 కోట్ల లీటర్లు దాటింది. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో డిస్టిలరీల సంఖ్య భారీగా పెరగడంతో, ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ వాణిజ్య కార్యకలాపాలు ఊపందుకోవడం ఆశాజనకమైన పరిణామం. ఈ కార్యక్రమం ద్వారా గత పదేళ్లలో సుమారు లక్షా 63 వేల కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యం ఆదా అయిందని, సంబంధిత రైతులకు పంట కొనుగోళ్లకు గాను లక్షా పదివేల కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయని అధికారిక అంచనాలు చెబుతున్నాయి. ఈ సంఖ్యలు, పరిణామాలు స్థూలంగా ఆశాజనకంగానే కనిపిస్తున్నప్పటికీ,విధాన నిర్ణయం అమలులో ఉన్న లోటుపాట్లపై ఎక్కువ చర్చ జరుగుతోంది. ఎందుకంటే అత్యుత్తమమైన విధానాలను కూడా అమలులో లోపాల వల్ల చతికిలపడవచ్చన్నది అనేక సందర్భాల్లో రుజువైంది.ఇ-20పై సాధారణ ప్రజల నుండి ఎక్కువగా వినిపించే అభ్యంతరాలు మైలేజీ తగ్గుదల, వాహనాల దీర్ఘకాలిక పనితీరుపై దాని ప్రభావానికి సంబంధించినవి. ఇథనాల్ శక్తి సాంద్రత పెట్రోల్ కంటే తక్కువ కావడంతో, మైలేజీపై కొంత ప్రభావం ఉండటం సహజం. లీటర్ ఇథనాల్‌లో సుమారు 21మెగాజౌల్స్ శక్తి ఉండగా, పెట్రోల్‌లో అది 32 మెగాజౌల్స్ వరకు ఉంటుంది. అయితే ఇ-20లో కేవలం 20శాతం మాత్రమే ఇథనాల్ ఉండటంతో, మైలేజీ పై వాస్తవ ప్రభావం 2నుండి 4శాతం లోపే ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది.మరోవైపు, ఇథనాల్‌కు అనుకూలంగా వినిపించే ఒక సాంకేతిక వాదన కూడా ఉంది. శక్తిసాంద్రత తక్కువగా ఉన్నప్పటికీ, ఇథనాల్ ఆక్టేన్ సంఖ్య పెట్రోల్ కంటే గణనీయంగా ఎక్కువగా ఉంటుంది. అధిక ఆక్టేన్ ఇంధనం ఇంజిన్‌లో అనియంత్రిత దహనం (నాకింగ్) సమ




స్యను తగ్గించి, తగిన విధంగా రూపకల్పన చేసిన ఇంజిన్లలో పనితీరును మెరుగుపరచగలదని సాంకేతిక నిపుణుల అంచనా. అయితే ఈ ప్రయోజనాలు ఎంత మేరకు సాధారణ వినియోగదారుడికి అందుతున్నాయన్నది ఇంకా చర్చనీయాంశంగానే ఉంది. లోకల్‌సర్కిల్స్ అనే ప్రముఖ పౌర వేదిక నిర్వహించిన సర్వే ప్రకారం 2023కు ముందు తయారైన వాహనాలను ఉపయోగిస్తున్న వారిలో 56శాతం మంది 10 శాతానికి పైగా మైలేజీ తగ్గిందని పేర్కొన్నారు. ప్రజల అనుభవానికీ, అధికారిక అంచనాలకు మధ్య ఉన్న ఈ గణనీయమైన వ్యత్యాసానికి గల కారణాలపై ప్రభుత్వం నుండి స్పష్టమైన, సంతృప్తికరమైన, గణాంకాలతో కూడిన వివరణ కోసం వినియోగదారులు ఎదురు చూస్తున్నారు. అలాగే, కొత్త వాహనాలను ఇ-20కు అనుగుణంగా తయారు చేస్తున్నప్పటికీ, ఇప్పటికే రోడ్లపై ఉన్న కోట్లాది వాహనాలపై దీర్ఘకాల ప్రభావం గురించి ఆందోళనలు కొనసాగుతున్నాయి.సర్వేల్లో దాదాపు 28శాతం మంది వాహనదారులు వివిధ సమస్యలను నివేదించారు. దీనిపై కూడా ప్రభుత్వం నుండి రాజకీయ ప్రకటనలే తప్ప గట్టి భరోసాలభించలేదు. ప్రజల్లో అసంతృప్తికి మరోకారణం పెట్రోల్‌లో కొంత భాగాన్ని స్థానికంగా, సాపేక్షంగా తక్కువ ధరలో లభ్యమయ్యే ఇథనాల్‌తో భర్తీ చేస్తున్నప్పటికీ, ధరలో ప్రయోజనం కనిపించడం లేదు. ఒకవైపు మైలేజీపై సందేహాలు, మరోవైపు వాహనాల పనితీరుపై ఆందోళనలు, దానికి తోడు ధరల్లో ఆశించిన తగ్గుదల లేకపోవడం వెరసిఇ-20పై అసంతృప్తికి కారణమవుతున్నాయి. ఇబ్బందులను స్వచ్ఛందంగా భరించడానికి సిద్ధపడుతున్నప్పుడు, కనీసం ధరల పరంగానైనా కొంత ఉపశమనం ఉండాలని వినియోగదారులు ఆశించడం సహజమే. ఇటీవలి కాలంలో మరో వాదన కూడా ప్రముఖంగా వినిపిస్తోంది 'నా వాహనం ఫలానా ఇంధనంతోనే నడవాలని కట్టడి చేయడం ఎంతవరకూ సబబు? మైలేజి, వాహనం తయారీ, ఇంజన్ పనితీరు, ఇంధనం ధర వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని సరైనఇంధనాన్ని ఎంచుకునే అవకాశం నాకే ఉండటం సమంజసం కదా!'. బ్రెజిల్ వంటి దేశాల అనుభవంతో పోల్చుకుంటే, ఈ ఆవేదన అర్థవంతంగానే కనిపిస్తోంది. పర్యావరణ ప్రయోజనాల విషయంలో కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. ఇథనాల్ మిశ్రమం వల్ల కొన్నిఉద్గారాలు తగ్గుతాయని అనేక అధ్యయనాలు సూచిస్తున్నప్పటికీ, దేశవ్యాప్తంగా గాలి,నాణ్యతపై దాని సమగ్ర ప్రభావాన్ని నిర్ధారించే దీర్ఘకాలిక స్వతంత్ర అధ్యయనాలు ఇప్పటికీ పరిమితంగానే ఉన్నాయి. మరోపక్క, దేశంలోని ప్రధాన నగరాల్లో వాయుకాలుష్యం ఇప్పటికీ ఆందోళనకర స్థాయిలోనే కొనసాగుతోంది. ఏవిధానమైనా దాని ఫలితాలను కొలవగలిగితేనే దానిపట్ల ప్రజల్లో విశ్వాసం బలపడుతుంది. ఇక్కడ మరో అంశం ఇథనాల్ ఉత్పత్తికి ప్రధానంగా ఉపయోగించే చెరకు పంట అత్యధిక నీటి వినియోగం కలిగిన పంటల్లో ఒకటి. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ఇథనాల్ ఉత్పత్తి కోసం చెరకుపండిస్తే, అది భూగర్భ జలాలపై అదనపు ఒత్తిడికి దారితీస్తుందని కొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంధన విషయంలో స్వయం సమృద్ధి సాధించడం అభిలషణీయమే. కానీ దానికోసం ఆహారోత్పత్తికి కావాల్సిన భూగర్భ జలాలను పణంగాపెట్టడం సమర్థనీయమైనది కాదు. భవిష్యత్తులో భారత్ ఇ30, ఇ50 లేదా ఇ85 వంటి అధిక ఇథనాల్ మిశ్రమాలవైపు అడుగులు వేయాలనుకుంటే,అలాంటి సమగ్రవ్యవస్థను కూడా దశలవారీగా నిర్మించాల్సి ఉంటుంది.రెండు దశాబ్దాల ప్రయాణం తర్వాత కూడా ఆ దిశగా మన పురోగతి పూర్తి సంతృప్తికరంగా ఉందని చెప్పలేం. ప్రస్తుతం ఇ20పై చర్చ జరుగుతున్నప్పటికీ, సమాంతరంగా బ్యూరోఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ 2026లో ఇ22, ఇ25, ఇ27, ఇ30 మిశ్రమాలకు సంబంధించిన ప్రమాణాలను ప్రకటించింది. ఇ85 మిశ్రమం కూడా పుణె, నాగ్‌పూర్ వంటి కొన్ని నగరాల్లో ప్రయోగాత్మకంగా అందు బాటులోకి వచ్చింది.ఇది సాధారణ పెట్రోల్ కంటే సుమారు రూ.20 తక్కువ ధరకు లభిస్తున్నప్పటికీ,మైలేజీ, ధరలోని రాయితీ మైలేజీ తగ్గుదలకు తగినంతగా ఉందా అన్నఅంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. 15 ఐసోబ్యుటినాల్ కలపడం ద్వారా ఈ తరహా డీజిల్ ఉత్పత్తి చేసే అవకాశాలు ప్రస్తుతం పరిశీలన దశలో ఉన్నాయి. చివరగా, ఇథ నాల్ విధానం విజయవంతమైందా లేదా అన్నది నిర్ణయించేది పారదర్శక గణాంకాలు, ఫలితాలను కొలవడానికి స్పష్ట మైన ప్రమాణాలు, అధ్యయనాలు, ప్రజల అనుభవాలే కానీ ఆర్భాటమైన ప్రకటనలు, నినాదాలు, రాజకీయ వాదోపవాదాలు కావు. ●

# చేపల రైతు చేతుల్లో దేశ ఆహార భద్రత



రామ కిష్టయ్య సంగనభట్ల

ప్రతి సంవత్సరం జూలై 10న భారత దేశం జాతీయ చేపల రైతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుంది. దేశ ఆహార భద్రతకు, పోషకాహార అవసరాలకు తోడ్పడుతున్న మత్స్య రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న లక్షలాది చేపల రైతులు, మత్స్యకారులు, ఆక్వా ప్రెన్యూర్ల అంకిత భావానికి, కృషికి గుర్తింపుగా ఈ దినోత్సవం నిర్వహించ బడుతుంది. ఇది కేవలం ఒక రోజువేడుక మాత్రమే కాకుండా, దేశమత్స్య పారిశ్రామిక అభివృద్ధికి దిశానిర్దేశం చేసే ప్రేరణాత్మక దినంగా నిలుస్తోంది. ఈ దినోత్సవాన్ని జూలై 10న జరుపుకోవడానికి ఒక ప్రత్యేక నేపథ్యం ఉంది. 1957లో ఇదే తేదీన, ప్రముఖ భారతీయ మత్స్య శాస్త్రవేత్తలు డాక్టర్ హీరాలాల్ చౌదరి, డాక్టర్ కె.హెచ్. అలీకున్ని ఒడిశాలోని అంగుల్‌లో మేజర్ కార్ప్ చేపలపై హైపోఫిసేషన్ అనే శాస్త్రీయ సాంకేతికతను విజయవంతంగా ప్రయోగించారు. ఈ సాంకేతికత ద్వారా చేపల ఉత్పత్తిలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. దీని ఫలితంగా దేశంలో వాణిజ్య ఆక్వాకల్చర్‌కు బలమైన భూమిక ఏర్పడింది. మత్స్య పాలనలో శాస్త్రీయత, ఉత్పాదకత పెరిగి నీలి విప్లవానికి నాంది పలికింది. నీలి విప్లవం ఫలితంగా భారత దేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద చేపల ఉత్పత్తి దారుగా నిలిచింది. దేశం మొత్తంలో చేపల ఉత్పత్తిలో సుమారు 65 శాతం వాణిజ్య ఆక్వాకల్చర్ ద్వారానే లభిస్తోంది. 2023-24 సంవత్సరానికి గాను భారత్‌లో చేపల ఉత్పత్తి సుమారు 174లక్షల మెట్రిక్ టన్నులు కాగా, వీటిలో 131లక్షల మెట్రిక్ టన్నులు ఆక్వాకల్చర్ నుంచి లభించాయి. అంతేకాకుండా, దేశీయ మత్స్య ఉత్పత్తిలో భారత్ వాటా ప్రపంచ స్థాయిలో 8శాతంగా ఉంది. ఈరంగం దాదాపు2.8కోట్ల మంది మత్స్యకారులకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జీవనాధారంగా మారింది. ఈ రంగంలో ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తెలంగాణ, కేరళ, గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు ముందంజ



లో ఉన్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోని చేపల ఉత్పత్తిలో దాదాపు 35శాతం వాటాను కలిగిఉంది. సరైన విధానాలు, సాగు కోసం అనుకూల వాతావరణం, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతుతో ఈ రాష్ట్రాలు మత్స్య రంగంలో అత్యుత్తమ స్థానాలను ఆక్రమించాయి. కేంద్ర ప్రభుత్వం నీలి విప్లవాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన వంటి పథకాలను ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా చేపల ఉత్పత్తిని పెంచడమే కాకుండా, పోస్ట్‌హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, శీతల భద్రపరిచే భవనాలు, రవాణా సదుపాయాలు, మార్కెటింగ్ మద్దతు వంటి రంగాల్లో అభివృద్ధికి పునాదులు వేశాయి.యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళల పాత్రను పెంచడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చారు. 2023-24లో పిఎమ్ఎమ్ఎస్ కింద దాదాపు ..2,500 కోట్ల మేర బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. నూతన ఆవిష్కరణలతో బయోఫ్లాక్, ఆర్సీఆర్ఎస్, ఇంటెన్సివ్ కల్చర్ పద్ధతులు రైతులకు తక్కువ ఖర్చుతో అధిక ఉత్పత్తిని అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. నీటి వనరుల సమర్థ వినియోగం, ఆరోగ్య సంరక్షణ, చేపల నిర్వహణ వంటి అంశాల్లో శాస్త్రీయ మార్గదర్శకాలు ఇవ్వడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు సాగుతున్నాయి.అయితే,ఈరంగం ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా తక్కువ కావు. నీటి కాలుష్యం, సకాలంలోమార్కెట్ మద్దతు లేకపోవడం, సరైన ధరకే విక్రయానికి అవకాశాలు లేకపోవడం,రవాణా లోపాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి. జలవనరుల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు కూడా తక్షణ పరిష్కారం కోరుకుంటున్నాయి. జాతీయ చేపల రైతుల దినోత్సవం సందర్భంగా కేంద్రం, రాష్ట్రాలస్థాయిలో అవార్డులు, సన్మానాలు, శిక్షణా శిబిరాలు, ప్రదర్శనలు, సెమినార్లు, ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించడం ద్వారా మత్స్యరంగ అభివృద్ధికి కొత్త దిక్సూచి చూపే ప్రయత్నం జరుగుతోంది. ఈ వేదికల్లో రైతులు, పరిశోధకులు,శాస్త్రవేత్తలు పరస్పరంగా జ్ఞానాన్నిపంచుకుంటూ వ్యవస్థను మెరుగు పరిచే మార్గాలుఅన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ చేపల రైతుల దినోత్సవం కేవలం స్మరణ దినంగా మాత్రమే కాక, మత్స్య రంగానికి విశిష్ట దిశానిర్దేశం చేసే ఒక ఉద్యమంగామారాలి. ప్రతి నీటి రైతు భారత ఆహార భద్రతకు కాపలా దారుడిగా నిలుస్తున్నాడు. వారి శ్రమకు, అంకిత భావానికి గౌరవం తెలుపడమే ఈ దినోత్సవ అసలైన ఉద్దేశం. ●

# నైపుణ్య విద్యే ఉద్యోగ భద్రతకు పునాది

సి.హెచ్.ప్రతాప్

దశాబ్దాలుగా భారతదేశంలో ఇంజినీరింగ్, మెడిసిన్ కోర్సులనే ఉపాధికి భరోసానిచ్చే విద్యగా భావించే అభిప్రాయం బలంగా నెలకొంది. మంచి ర్యాంకు వస్తే ఇంజినీరింగ్, అత్యుత్తమ ర్యాంకు వస్తే మెడిసిన్ అనే భావన ఇప్పటికీ చాలామంది తల్లిదండ్రుల్లో కనిపిస్తోంది. అయితే మారుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, సాంకేతిక విప్లవం, సేవారంగ విస్తరణ, నూతన పరిశ్రమల ఆవిర్భావం ఈ అభిప్రాయాన్ని పూర్తిగా మార్చేస్తున్నాయి. నేటి ఉద్యోగ విపణిలో డిగ్రీ కంటే నైపుణ్యానికే ఎక్కువ విలువ లభిస్తోంది. కేంద్ర గణాంకాల ప్రకారం 2022-23లో భారతదేశంలో సుమారు 1.09 కోట్ల మంది ఉన్నత విద్యను పూర్తిచేశారు. అయితే ఇండియా స్కిల్స్ రిపోర్ట్ ప్రకారం పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఉన్న పట్టభద్రుల శాతం కేవలం 55శాతం మాత్రమే. అంటే విద్య పూర్తిచేసిన ప్రతి ఇద్దరిలో ఒకరు మాత్రమే ఉద్యోగానికి తగిన నైపుణ్యాలతో బయటకు వస్తున్నారన్న మాట.ఇదే భారత విద్యావ్యవస్థ, పరిశ్రమల అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. ప్రతి సంవత్సరం దేశంలో సుమారు 11 నుంచి 12 లక్షల మంది ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరుతుండగా, ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందే అవకాశం మాత్రం సుమారు 70నుంచి 80 వేల మంది విద్యార్థులకు మాత్రమే లభిస్తోంది. మిగిలిన లక్షలాది మంది యువతకు ఇతర రంగాల్లో అవకాశాలు కల్పించడం కాలానుగుణ అవసరం. అందుకే ఉపాధి అవకాశాలను కేవలం రెండు కోర్సులకు పరిమితం చేయడం సరైన దృక్పథం కాదు. నేటి ప్రపంచంలో డేటా సైన్స్, కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, సైబర్ భద్రత, క్లౌడ్ కంప్యూటింగ్, డ్రోన్ టెక్నాలజీ, రోబోటిక్స్, సెమీకండక్టర్ టెక్నాలజీ, పునరుత్పాదక ఇంధన రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. పరిశ్రమల అంచనాల ప్రకారం డేటా సైన్స్, కృత్రిమ మేధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు సంవత్సరానికి 15 నుంచి 20 శాతం చొప్పున పెరుగుతున్నాయి. అదే విధంగా ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో కూడా నిపుణుల అవసరం గణనీయంగా పెరుగుతోంది. సేవారంగం భారత ఆర్థిక వ్యవస్థకు ప్రధాన చోదకశక్తిగా మారింది. దేశ జీడీపీలో ఈరంగం వాటా 55నుంచి 60శాతం వరకు ఉంది. హాస్పిటాలిటీ, టూరిజం, ఫుడ్ టెక్నాలజీ, హెల్త్‌కేర్,



ఫార్మసీ, బయోటెక్నాలజీ, ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, లాజిస్టిక్స్, ఫ్యాషన్ డిజైన్, యానిమేషన్, గేమ్ డిజైన్, డిజిటల్ మార్కెటింగ్, ఫిల్మ్ టెక్నాలజీ, అగ్రిటెక్, ఫిన్‌టెక్ వంటి రంగాల్లో వేగంగా ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి. కొన్ని రంగాల్లో వార్షిక నియామకాల వృద్ధి 8 నుంచి 12 శాతం వరకు నమోదవుతోంది. ప్రతి సంవత్సరం దేశంలో 25 నుంచి 30లక్షల మంది యువత ఐటీఐలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, వృత్తి శిక్షణా సంస్థల్లో చేరుతున్నారు. సరైన శిక్షణ పొందిన అభ్యర్థులకు దేశీయంగానే కాక విదేశాల్లో కూడా మంచి అవకాశాలు లభిస్తున్నాయి. ముఖ్యంగా సమాచార సాంకేతికం, ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణ, పారిశ్రామిక నిర్వహణ, వెల్డింగ్ ఆటోమేషన్ వంటి రంగాల్లో విదేశీ నియామకాలు పెరుగుతున్నాయి. ఇంటర్న్‌షిప్‌లకు కూడా నేటి ఉద్యోగ విపణిలో విశేష ప్రాధాన్యం ఏర్పడింది. పరిశ్రమల అధ్యయనాల ప్రకారం ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థుల్లో 30నుంచి 60 శాతం మంది అదే సంస్థల్లో ఉద్యోగాలు పొందుతున్నారు.మరోవైపు,పరిశ్రమల్లో నైపుణ్యాల కొరత కారణంగా సుమారు40నుంచి 50 శాతం ఉద్యోగాలకు అదనపు శిక్షణఇవ్వాల్సి వస్తోందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య బలమైన అనుసంధానం అవసరాన్ని స్పష్టంచేస్తోంది. ప్రభుత్వం కూడా విద్యావిధానంలో సమతుల్య దృక్పథాన్ని అవలంబించాలి. ఇంజినీరింగ్,మెడిసిన్ విద్యకు ఎంత ప్రాధాన్యం ఇస్తుందో,నైపుణ్యాధారిత, బహుళశాఖల, వృత్తి విద్యా కోర్సులకు కూడా అంతే ప్రాధాన్యం కల్పించాలి. ప్రతి జిల్లాలో ఆధునిక స్కిల్ యూనివర్సిటీలు, ఫినిషింగ్ స్కూల్స్, పరిశ్రమల భాగస్వామ్యంతో శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలి.పాఠశాలస్థాయి నుంచే కెరీర్ కౌన్సెలింగ్‌ను తప్పనిసరి చేసి, విద్యార్థుల అభిరుచి, సామర్థ్యానికి అనుగుణంగా కోర్సుల ఎంపికకు మార్గనిర్దేశం చేయాలి.స్టార్టప్‌లు,స్వయం ఉపాధి, డిజిటల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలి.దేశ అభివృద్ధికి వైద్యులు, ఇంజినీర్లు ఎంత అవసరమో, శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, ఫార్మసీ పరిశోధకులు, బయోటెక్నాలజిస్టులు,డేటా విశ్లేషకులు, డిజైనర్లు, ఆరోగ్య సేవల నిపుణులు, సృజనాత్మక రంగాల ప్రతిభావంతులు కూడా అంతే అవసరం. ఉపాధిని నిర్ణయించేది కోర్సు కాదు. కాలానుగుణ నైపుణ్యం, నిరంతర అభ్యాసం, సృజనాత్మకత, నవకల్పన పట్లఆసక్తి. ఈఅవగాహన విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, విధాన నిర్ణేతల్లో పెరిగినప్పుడే భారత యువశక్తి ప్రపంచ ఉద్యోగ విపణిలో మరింత సమర్థంగా నిలబడగలదు. ●

# ప్రజావాక్కు

### భద్రతా ప్రమాణాల నిర్లక్ష్యం

లక్నోలో వివాహ ఏర్పాట్ల మధ్య జరిగిన అగ్నిప్రమాదంలో నిశ్చితార్థం చేసుకున్న యువజంట మృతిచెందడం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించింది. ఈ విషాదం అగ్నిప్రమాదాలు కేవలంప్రమాదవశాత్తూ జరిగేవికాదని, భద్రతా ప్రమాణాల నిర్లక్ష్యం వల్ల సంభవిస్తున్న మానవ నిర్మిత విపత్తులని మరోసారి గుర్తుచేసింది. నివాస ప్రాంతంలో నడుస్తున్న వాణిజ్య భవనంలో అత్యవసర నిష్క్రమణ మార్గాలు లేకపోవడం లేదా పనిచేయకపోవడం వంటిలోపాలు భవనతనిఖీల్లోనే గుర్తించాల్సిన అంశాలు. అయినప్పటికీ అనేక చోట్ల అగ్నిమాపక అనుమతుల గడువు ముగిసినా, భద్రతా పరికరాలు పనిచేయకపోయినా, తనిఖీలు నామమాత్రంగానే కొనసాగుతున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాతే బాధ్యులపై చర్యలు తీసుకోవడం పరిపాటిగా మారింది.ప్రతి నగరంలో నివాస ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న వాణిజ్య భవనాలపై ముందస్తు సమాచారం లేకుండా అగ్ని భద్రతా తనిఖీలు నిర్వహించడం తప్పనిసరి చేయాలి.

- సి. సాయిరుత్విక్, శ్రీకాకుళం

### ఉద్యమకారులను గుర్తించాలి

తెలంగాణ తొలి దశ 1969, మలిదశ ఉద్యమం 2001 నుండి 2014 వరకు జరిగిన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగుల గుర్తింపుకు ప్రాముఖ్యతఇవ్వాలి. మరీ ముఖ్యంగా మలిదశ ఉద్యమంలో వివిధయూనివర్సిటీ విద్యార్థులు,ఉన్నత విద్యలను అభ్యసించిన నిరుద్యోగులు ఇటీవలకాలంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం జరిగింది. తెలంగాణ ఉద్యమకారులను ప్రత్యేకంగా గుర్తించాలి. గత ప్రభుత్వంలో ఉద్యోగ నియామకాలు తక్కువ సంఖ్యలో ఉండి నిధులు నియామకాల ఏకైక లక్ష్యం కోసం తెలంగా ణ రాష్ట్ర సాధనే ఊపిరిగా ఉద్యమించి ఇటీవల కాలంలో ఉద్యోగాలు సాధించిన ఉద్యమకారులకు తక్కువ సర్వీస్ సమస్యల పరిష్కారం కోసం వారికి స్పెషల్ ఇంక్రిమెంట్ ఆలోచనచేసి ఆచరణ చేపట్టాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

### సాంకేతికత పట్ల అవగాహన అవసరం

నేడు సమాజంలో ప్రతి పనికి సాంకేతికత వినియోగం ఎక్కువగా అయింది. కావున ప్రతివిషయంలో సాంకేతికత పట్ల అవగాహన పెంచుకుని మన పనులకు ఇతరులపై ఎక్కువగా ఆధారపడకుండా మనమే పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుంది.

- ఎం. శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### పరిశుభ్రత ప్రతి పౌరుడి కర్తవ్యం

నేడు కొందరు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం, ప్లాస్టిక్ సీసాలు, కవర్లు, ఆహార అవశేషాలు రోడ్లపై పడేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. చెత్తను నిర్లక్ష్యంగా పారేయడం వల్ల దుర్వాసన, దోమలు, ఈగలు పెరిగి అనేక వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది.మన ఇల్లు ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో, మన వీధులు, పార్కులు, బహిరంగ ప్రదేశాలుకూడా అంతేశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది. పరిశుభ్రత ప్రభుత్వ బాధ్యతే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యం కూడా. పరిశుభ్రమైన పరిసరాలతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం. ఇతరులకు ఆదర్శంగా నిలుద్దాం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### హోటల్ లైసెన్సు రద్దు చేయాలి

సినిమా హాల్‌కి వెళితే అక్కడ ఉచిత టాయిలెట్స్ ఖచ్చితంగా ఉంటాయి.అలాగే హోటల్‌కువెళితే అక్కడ కూడా టాయిలెట్లు ఉంటాయి. అవి కనీస అవసరాలు. మరి నిత్యం విజయవాడ లోని బస్టాండుకు వేలాదిమంది వస్తుంటారు. బస్టాండులోని అరైవల్ దగ్గరున్న షిర్డీ హోటల్‌కు వేలాదిమంది భోజనం , టిఫిన్లు చేస్తుంటారు.అక్కడ హోటల్‌లో టాయిలెట్లు ఉండాలి. మొన్న ఆ హోటల్‌లో భోంచేసి యూరినల్స్ ఎక్కడ అని అడిగితే పక్కన ఉన్న ఐదురూపాయల టాయిలెట్లు చూపించారు. మీ హోటల్‌లో టాయిలెట్ లేదా అని అడిగితే లేదన్నారు.మరి టాయిలెట్ లేకుండా ఆ హోటల్‌కు లైసెన్స్ ఎలా ఇచ్చారు? ఆ అవసరం తీర్చాల్సిన బాధ్యత హోటల్ వారిదే. కనుక సంబంధిత అధికారులు తక్షణమే విజయవాడ ఆర్టీసీ బస్టాండులోని షిర్డీ హోటల్ లైసెన్స్ రద్దు చేయాలి. ఆర్టీసీ యాజమాన్యం వారు కూడా తక్షణమే చర్యలు తీసుకోవాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### అన్నదాత పట్ల చొరవ చూపాలి

ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక కుదేలవుతున్న రైతన్నకష్టాలు వర్ణనాతీతం.అనాది నుంచి కర్షకుడికి అతివృష్టి, అనావృష్టి అవినాభావ సంబంధం అంటే అతిశయోక్తికాదు. అగ్నికిఆజ్యం పోయకుండా కల్తీ విత్తనాలు, ఎరువులు తదితర వ్యవసాయ సంబంధిత వనరులతో మూలిగే నక్కమీద తాటికాయపడినట్లు ఈ యేడాది రుతు పవనాలు ఆలస్యానికి కారణమయిన ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావంవల్ల పంటలకు కోలుకోలేని దెబ్బ. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాత పట్ల మరింత చొరవ చూపాలి.

-ఆర్ వెంకటేష్ చరన్, బెంగళూరు


గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# భారత్ ఆర్థికవ్యవస్థపై విదేశీ ఇన్వెస్టర్లకు ఎంతో నమ్మకం

## భారత్ ఎన్ఐఐఎఫ్‌లో ఆసీస్ పెన్షన్‌ఫండ్ రూ.3వేల కోట్ల పెట్టుబడులు: మెల్‌బోర్న్ సదస్సులో ప్రధానిమోడీ



**మెల్‌బోర్న్,జులై 9:** భారత్‌లో విదేశీ పెట్టుబడుల ప్రవాహం మరోసారి ఊపందుకుంది. ఆస్ట్రేలియాలోని అతిపెద్ద పెన్షన్ ఫండ్ ఆస్ట్రేలియన్ సూపర్ భారతదేశంలో రూ.3,311 కోట్లు అదనంగా పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ పెట్టుబడిని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్‌ఎన్ఐఐఎఫ్‌లో పెట్టనుంది. ఈ నిర్ణయాన్ని ప్రధాని నరేంద్ర మోడీ స్వాగతిస్తూ, భారత ఆర్థిక వ్యవస్థపై ప్రపంచ పెట్టుబడిదారుల విశ్వాసానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఈ పెట్టుబడి భారత్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ, మౌలిక సదుపాయాల రంగం, సంస్కరణలపై అంతర్జాతీయ పెట్టుబడిదారులు ఉంచుతున్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తుందని ప్రధాని మోడీ అన్నారు. ఇండియా-ఆస్ట్రేలియా సిఇఒ ఫోరమ్‌లో మోడీ ఈవ్యాఖ్యలుచేసారు. మెల్‌బోర్న్‌లో జరిగిన ఇండియా-ఆస్ట్రేలియా సిఇఒ ఫోరమ్ సదస్సులో ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోని ఆల్బనీస్‌తోకలిసి ప్రధాని పాల్గొని భారత్‌లోని పెట్టుబడుల అవకాశాలను వివరించారు. భారత్‌ఆస్ట్రేలియా మధ్య ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసే కీలక అడుగుగా పెన్షన్‌ఫండ్ పెట్టుబడిఅని ప్రధాని మోడీ అభివర్ణించారు. ఎన్ఐఐఎఫ్‌లో ఆస్ట్రేలియన్ సూపర్ ప్రకటించిన కొత్త 500 మిలియన్ల పెట్టుబడితో భారతదేశంలో తమ పెట్టుబడులను మరింత విస్తరించనుంది. ఈ తాజా పెట్టుబడితో భారత ఆస్తి రంగంలో ఆస్ట్రేలియన్ సూపర్ మొత్తం పెట్టుబడి 3.3 బిలియన్లడాలర్లకు చేరనుంది. ప్రస్తుతం ఈ సంస్థ భారత్‌లో మౌలిక సదుపాయాలు, ఈక్విటీలు, ప్రైవేట్ మార్కెట్లలో ఇప్పటికే సుమారు 2.8 బిలియన్లు పెట్టుబడి పెట్టింది. ఆస్ట్రేలియన్ సిఇఒ పాల్ ష్రోడర్ మాట్లాడుతూ, ప్రధాని మోడీకి వ్యాపారం, పెట్టుబడులపై లోతైన అవగాహన ఉందని అన్నారు. ప్రధాని మోడీ పెట్టుబడిదారులకు స్థిరమైన విధానాలు, దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలపై స్పష్టమైన దృష్టిని కలిగి ఉన్నారు.

వ్యాపార సంస్థలతో ఆయన వ్యవహరించే తీరు మమ్మల్ని ఎంతో ఆకట్టుకుంది. భారత్-ఆస్ట్రేలియా ప్రజల మధ్య ఉన్న బలమైన సంబంధాలు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలకు దారి తీస్తాయని ష్రోడర్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియన్ సూపర్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ షాన్ మాన్యుయెల్ మాట్లాడుతూ, భారత్‌లో దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని చెప్పారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఊతం లభిస్తుంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు మరింత పెరిగే అవకాశం ఉంది. ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయి. రోడ్లు, రైల్వేలు, ఇంధనం, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో ప్రాజెక్టులకు నిధులు అందుబాటులోకి రావడం ద్వారా భారత్-ఆస్ట్రేలియా ఆర్థిక భాగస్వామ్యం మరింత బలపడతాయని ఇరుదేశాలప్రధానులు వెల్లడించారు.

**రక్షణ, సముద్ర భద్రతపై ప్రత్యేక దృష్టి**

శుద్ధిచేసిన యురేనియంను భారత్‌కు సరఫరాచేసే ఒప్పందంతోపాటు ఇంధనభద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ రెండుదేశాలు అవగాహనకు వచ్చాయి. ఇరు దేశాలు సంయుక్త రక్షణ, భద్రతా సహకార ప్రకటనను ఆమోదించాయి. దీని ద్వారా రక్షణ పరిశ్రమల్లో భాగస్వామ్యం, ఉమ్మడి ఆవిష్కరణలు, సమాచార మార్పిడి, విపత్తుల సమయంలో మానవతా సహాయం, సహాయక చర్యల్లో సహకారం మరింత బలోపేతం కానుంది. అలాగే సముద్ర భద్రత సహకార రోడ్‌మ్యాప్‌పై అంగీకారం కుదిరింది. భారత తీర రక్షక దళం, ఆస్ట్రేలియా మారిటైమ్ బోర్డర్ కమాండ్ మధ్య అవగాహన ఒప్పందం కూడా కుదిరింది. ఇంధన భద్రతపై ఇరు దేశాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు యురేనియం సరఫరా జరిగేలా పౌర అణు ఒప్పందం కింద పరిపాలనా ఏర్పాటుపై అంగీకారం కుదిరింది. దీని ద్వారా భారత్ ఇంధన వనరులు మరింత విస్తరించడంతో పాటు శక్తి భద్రత బలోపేతం కానుంది.


**మెల్‌బోర్న్ సూపర్‌హిట్**

మెల్‌బోర్న్‌లో ఇండియా ఆసీస్ సిఇఒల ఫోరమ్ సదస్సుతోపాటు ప్రవాసభారతీయుల సమావేశంలో పాల్గొన్న మోడీ మాట్లాడుతూ మెల్‌బోర్న్ సభ సూపర్‌హిట్ అని బ్లాక్‌బస్టర్ అని వ్యాఖ్యానించారు. భారతీయులు ఏదేశంలో ఉన్నా ఆ దేశ ప్రగతికి దోహదపడుతూ భారత ప్రతిష్టను ఇనుమడింపచేస్తారన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో భారత్ సత్తా ప్రపంచానికి చాటిచెప్పామని,

ఉగ్రవాదం ఏరూపంలో ఉన్నా భారత్ ఉపేక్షించబోదని సందేశం పంపించగలిగామన్నారు. అలాగే మేకిన్ ఇండియా ఇపుడు ప్రపంచ వ్యాప్తం కావడం భారత్‌కు గర్వకారణంగా నిలిచిందని మోడీ పేర్కొన్నారు.

## ఇంధన భద్రతపై ఆస్ట్రేలియా భారత్‌ల ఒప్పందం

**మెల్‌బోర్న్,జులై 9:** భారత్, ఆస్ట్రేలియా దేశాల మధ్య ఇంధన భద్రతకు సంబంధించి ప్రధానఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం వల్ల ఆస్ట్రేలియా నుంచి శాంతియుత అవసరాల కోసం భారత్‌కు యురేనియం ఎగుమతులకు మార్గం సుగమమైంది. ఇంధన రంగంలో రెండు దేశాల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అడుగుగా దీనిని భావిస్తున్నారు. ఆస్ట్రేలియాలో జరిగిన వార్షిక ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశం తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బనీస్ సంయుక్తంగా ఈ విషయాన్ని ప్రకటించారు. అణుశక్తి రంగంలో కీలక ఒప్పందం కుదిరిందని, దీనివల్ల ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు యురేనియం సరఫరాకు మార్గం ఏర్పడుతుందని మోడీ తెలిపారు. ఇది దేశ స్వచ్ఛ ఇంధన లక్ష్యాలకు కొత్త ఊతం ఇస్తుందని చెప్పారు. రెండు దేశాలు విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఇంధన వాణిజ్యం, సరఫరా వ్యవస్థ బలోపేతం, స్వచ్ఛ ఇంధన వినియోగం పెంపుపై కలిసి పనిచేయాలని నిర్ణయించినట్లు వెల్లడించాయి. 2015లో కుదిరిన అణు సహకార ఒప్పందం కింద యురేనియం ఎగుమతులకు అవసరమైన పరిపాలనా ప్రక్రియలను కూడా పూర్తి చేసినట్లు పేర్కొన్నాయి. ఆస్ట్రేలియా నుంచి వచ్చే యురేనియం పూర్తిగా శాంతియుత అవసరాలకే వినియోగిస్తామని స్పష్టం చేశాయి. దీనిపై ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ భద్రతా నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన సరఫరా, ధరలపై ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశాయి. అయినా ఇంధన సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు కొనసాగిస్తామని వెల్లడించాయి. ద్రవీకృత సహజ వాయువు సరఫరాలో ఆస్ట్రేలియా, ద్రవ ఇంధనాలు, పెట్రోలియం ఉత్పత్తుల సరఫరాలో భారత్ కీలక భాగస్వాములని రెండు దేశాలు గుర్తించాయి. పునరుత్పాదక ఇంధనం, తక్కువ కాలుష్య ఇంధనాలు, పెట్టుబడులు, ప్రాంతీయ సహకారాన్ని మరింత పెంచాలని నిర్ణయించాయి. బొగ్గు, డీజిల్, సహజ వాయువు వంటి ఇంధనాల సరఫరా స్థిరంగా కొనసాగేలా కలిసి పనిచేస్తామని స్పష్టంచేశాయి. భారత్ ప్రారంభించిన గ్లోబల్ బయోఫ్యూయెల్స్ అలయన్స్ కార్యక్రమాన్ని కూడా ఆస్ట్రేలియా స్వాగతించింది.



## ఆ ఉత్పత్తులకు సుంకాలుండవ్!

### మోడీ పర్యటనకు ముందే న్యూజిలాండ్ కీలక ప్రకటన

**వెల్లింగ్టన్, జులై 9:** భారత ప్రధాని నరేంద్ర మోడీ న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లడానికి ముందే ఆ దేశ ప్రధాని క్రిస్టఫర్ లుక్సాన్ కీలక ప్రకటన చేశారు. భారత్‌కు న్యూజిలాండ్ ఎగుమతి చేస్తున్న వస్తువుల్లో 57 శాతం ఉత్పత్తులపై ఇకపై ఎలాంటి సుంకాలు ఉండబోవని చెప్పారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిన తొలిరోజు నుంచే ఇది అమలులోకి వస్తుందన్నారు. ఈ చారిత్రక ఒప్పందం ద్వారా భారత మార్కెట్‌లో న్యూజిలాండ్ ఉత్పత్తులకు విస్తృత ప్రవేశం లభిస్తుందని, ఇది న్యూజిలాండ్ వ్యాపారులకు ఊతమిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టుచేశారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న ప్రధాని మోడీ.. ఈ నెల 10,11 తేదీల్లో న్యూజిలాండ్‌లో పర్యటించనున్నారు. దాదాపు గత 40 యేళ్లలో భారత ప్రధాని అక్కడ పర్యటించడం ఇదే తొలిసారి. పర్యటనలో భాగంగా అక్లాండ్‌లో ఏర్పాటు చేయనున్న సమావేశంలో వాణిజ్య ఒప్పందాలు, అభివృద్ధి, తదితర అంశాలపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. ప్రభుత్వ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. వాణిజ్యం, రక్షణ, పరస్పర సహకారం తదితర అంశాలపై ప్రధాని మోడీ దృష్టిపెట్టనున్నారు. అంతేకాకుండా అక్కడి వ్యాపారవేత్తలు, క్రీడాకారులతోనూ మోడీ సమావేశం కానున్నారు.

## నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్‌లో హనీమూన్ బోగీ

### టిటిఇ సస్పెన్షన్‌కు దారితీసిన అత్యుత్సాహం



**ముంబయి,జులై 9:** ఎసి రైలు బోగీని హనీమూన్ సూట్‌లా అలంకరించి కొత్త జంటకు ప్రత్యేక ఏర్పాట్లు చేసిన దృశ్యాల విడియోలు హల్‌చల్ చేసినవైనం సంబంధిత టిటిఇ సస్పెన్షన్‌కు దారితీసింది. బెలూన్లు, పూలమాలలు, గులాబీ రేకులు, ఐ లవ్ యూ బోర్డులతో అలంకరించిన రైలు క్యాబిన్‌ను చూసిన నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేయడంతో పాటు రైల్వే భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తారు. ఈ నెల 6న బల్లార్షా-ముంబై నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్ రైల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. జల్నాకు చెందిన ఓ నూతన వధూవరుల కోసం రైల్లోని ఎసి కూపేను ముందుగానే బుక్ చేశారు. అదే సమయంలో 'రహత్ రూమ్ డెకరేషన్' అనే ఈవెంట్ డెకరేషన్ సంస్థకు చెందిన సిబ్బంది రైలులోకి వెళ్లి క్యాబిన్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. కొత్త దంపతులు ఔరంగాబాద్ నుంచి కారులో జల్నా రైల్వే స్టేషన్‌కు చేరుకుని అక్కడి నుంచి రైలులో ప్రయాణం ప్రారంభించారు. ఆన్‌లైన్ ద్వారా డెకరేషన్ సేవలను బుక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. రైలు క్యాబిన్‌ను హనీమూన్ సూట్‌ను తలపించేలా తీర్చిదిద్దడంతో ఆ దృశ్యాలు క్షణాల్లోనే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ వీడియో వైరల్ కావడంతో రైల్వే అధికారులపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. అనుమతి లేకుండా బయటి వ్యక్తులు రైలులోకి ఎలా ప్రవేశించారు? భద్రతా నిబంధనలు ఎలా ఉల్లంఘించారనే ప్రశ్నలు తలెత్తాయి. విషయం రైల్వే మంత్రిత్వశాఖ దృష్టికి చేరడంతో అధికారులు వెంటనే విచారణ ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో బయటి వ్యక్తులను అనుమతి లేకుండా రైలులోకి అనుమతించడం, ప్రయాణికుల కంపార్ట్‌మెంట్‌లో భారీగా అలంకరణలు చేయడం రైల్వే నిబంధనలకు విరుద్ధమని అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించారనే ఆరోపణలతో సంబంధిత టిటిఇ గిరీష్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ శాఖాపరమైన విచారణకు ఆదేశించారు.



## రాయ్‌గఢ్‌లో కుండపోత కొట్టుకుపోయిన గ్యాస్ సిలిండర్లు

**రాయ్‌గడ్,జులై 9:** మహారాష్ట్రలోని రాయగఢ్ జిల్లాలో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. వరదల కారణంగా పన్వేల్ తాలూకాలోని హెచ్‌పిసిఎల్ పాతాళగంగా ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్ నీటమునిగింది. దీంతో నింపినవి, ఖాళీవి కలిపి సుమారు 3,000 సిలిండర్లు వరద ప్రవాహంలో కొట్టుకుపోయి పాతాళగంగా నదిలోకి చేరాయి. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ కిషన్ జవాలే ప్రజలను అప్రమత్తం చేశారు. నదిలో లేదా ఒడ్డున కొట్టుకొచ్చిన సిలిండర్లు కనిపించినా వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తాకొద్దని సూచించారు. ఇంటికి తీసుకెళ్లొద్దని హెచ్చరించారు. వాటిలోగ్యాస్ ఉందో లేదో, అవి సురక్షితస్థితిలో ఉన్నాయో లేదో తెలియదని వెల్లడించారు. వాటినితెరవడం లేదా వినియోగించడం ప్రమాదకరమని పేర్కొన్నారు. వరదల్లో కొట్టుకుపోయిన సిలిండర్లనుగుర్తించి తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నదిలో లేదా పరిసరప్రాంతాల్లో ఎల్పీజీ సిలిండర్లు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

## ఢిల్లీలో భారీ వర్షం

**న్యూఢిల్లీ,జులై 9:** ఉత్తర భారతదేశంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలతో జనజీవనం స్తంభించిపోతున్నది. గురువారం తెల్లవారుజామున ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షాలకు రోడ్లు చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఢిల్లీలోని పలు ప్రాంతాలకు ఇప్పటికే ఐఎండీ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఉరుములు, మెరుపులతోకూడిన వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంకారణంగా న్యూఢిల్లీ రైల్వే స్టేషన్, మునీర్కా, ఇతర ప్రాంతాలతో సహా నగరంలోని కొన్ని ప్రాంతాలలో నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్కు అంతరాయంఏర్పడింది. వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా దేశంలో కురుస్తున్న వర్షాలపై సమీక్షించారు. మంగళవారం కేరళలోని వయనాడ్‌లో శిథిలాలు కూలిపోయి పలువురు చనిపోవడం, జమ్మూలోని దోడాలో ఆకస్మిక వరదలు, మహారాష్ట్ర, గుజరాత్‌లలో ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరిగిన నేపథ్యంలో ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడి భారీ వర్షాల వల్ల తలెత్తిన పరిస్థితులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## జననీరాజనం మధ్య ఖమైనీ అంత్యక్రియలు



**టెహ్రాన్,జులై 9:** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు సూర్యాస్తమయంలోపు పూర్తిచేసారు. అంత్యక్రియలకు లక్షలాది మంది తరలివచ్చారు. ఈ ఉదయమే అంత్యక్రియలు పూర్తి కావాల్సి ఉండగా సాయంత్రానికి వాయిదా పడ్డాయి. ఖమేనీ పార్థివదేహం ఖమేనీ స్వస్థలమైన ఈశాన్య ఇరాన్‌లోని మష్హద్ నగరానికి చేరుకుంది ఇరాక్‌లోని పవిత్ర నగరాలు నజఫ్, కర్బలా దగ్గర నిర్వహించిన అంతిమయాత్రల్లో లక్షలాది మంది పాల్గొనడంతో అంత్యక్రియల కార్యక్రమం ఆలస్యమైంది. తొలుత గురువారం ఉదయమే అంత్యక్రియలు పూర్తి కావాల్సి ఉండగా భారీ జనసందోహం కారణంగా అంత్యక్రియలను సాయంత్రానికి వాయిదా వేశారు. ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ విడుదల చేసిన దృశ్యాల్లో మహాన్ ఎయిర్ విమానం ద్వారా ఖమేనీ భౌతికకాయం మష్హద్ విమానాశ్రయానికి చేరుకున్నట్లు కనిపించింది. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ప్రకారం స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:30 గంటలకు (అనగా భారత కాలమానం ప్రకారం సాయంత్రం 4:30 గంటలకు) అంత్యక్రియలు పూర్తిచేసారు. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఫిబ్రవరి 28న ఖమేనీ మరణించారు. మూడు నెలల తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. భీకరమైన యుద్ధం కారణంగా వాయిదా పడ్డాయి. ప్రస్తుతం అంత్యక్రియల్లో భాగంగా ముందుగా ఇరాక్‌లోని నజఫ్, కర్బలా నగరాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన భౌతికకాయాన్ని విమానంలో మష్హద్‌కు తరలించారు.

ఈ సాయంత్రంతో అన్ని కార్యక్రమాలు పూర్తి కానున్నాయి. టెహ్రాన్‌తో పాటు పలు నగరాల్లో జరిగిన అంతిమయాత్రలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని ఖమేనీకి నివాళులర్పించారు. ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కాపాడిన నాయకుడిగా.. అమెరికా-ఇజ్రాయెల్ విధానాలకు వ్యతిరేకంగా నిలిచిన నేతగా ఆయనను కొనియాడారు. టెహ్రాన్‌కు చెందిన 60 యేళ్ల హుస్సేన్ అక్బరీ మాట్లాడుతూ ప్రపంచానికి మేము అణచివేతకు తలవంచబోమని, మా నాయకుడి రక్తానికి ప్రతీకారం తీర్చుకుంటామని నిరూపించడమే మా లక్ష్యం అని అన్నారు.

## అమెరికా బాంబులేసిన ఖమేనీ కాంపౌండ్ దృశ్యాలు.. షేర్ చేసిన ఇరాన్



**టెహ్రాన్, జులై 9:** అమెరికా-ఇరాన్ యుద్ధం ప్రారంభమైన రోజునే అప్పటి సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ మృతి చెందారు. టెహ్రాన్‌లోని కాంపౌండ్‌లో ఆయనతోపాటు ఇతర కీలక నేతల లక్ష్యంగా ఆ దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఖమేనీని గురువారం సమాధి చేయనున్న నేపథ్యంలో దాడుల్లో దెబ్బతిన్న ఆ భవనం దృశ్యాలను ఇరాన్ ప్రభుత్వ మీడియా షేర్ చేసింది. 35 సెకన్ల నిడివి గల ఆ విడియోలో.. అత్యంత దారుణంగా భవనం దెబ్బతిన్న దృశ్యాలు కన్పించాయి. ఖమేనీ అంతిమయాత్ర వారం రోజులు సాగింది. ఇరాన్, ఇరాక్‌లలోని వివిధ నగరాల మీదుగా ఈ అంతిమయాత్ర సాగింది. ఈ మార్గాల్లో భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు తమ నేతకు అంతిమ వీడ్కోలు పలికారు. ఖమేనీ పార్థివదేహాన్ని ఇరాన్‌లోని ఆయన సొంత పట్టణమైన మషహద్‌లో గురువారు ఖననం చేశారు. ఈ క్రమంలో ఈ పట్టణానికి చేరుకోవడానికి ఉపయోగించే రెండు వంతెనలు అమెరికా దాడుల్లో ధ్వంసమయ్యాయి. మరోవైపు దాడుల నేపథ్యంలో టెహ్రాన్- మషహద్ మధ్య రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. అంత్యక్రియల కార్యక్రమానికి ఆటంకం కలిగించేందుకే యుఎస్ ఈ దాడులు చేసిందని ఐఆర్‌జిసి ఆరోపించింది. ఇవి ఇలాగే కొనసాగితే.. తమ నుంచి వచ్చే భీకరంగా ఉంటుందని హెచ్చరించింది.

## భారత్‌కు తిరిగి వస్తున్న అపురూప ఖళాఖండాలు



**మెల్‌బోర్న్,జులై 9:** ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ప్రధానిమోడీకి ఆదేశ ప్రధాని ఆంటోని అల్బనీస్ అద్భుత రిటర్న్ గిఫ్టులు ఇచ్చారు. భారత్‌కు చెందిన అపురూపమైన చారిత్రక విగ్రహాలు, పూజా సామాగ్రిని వెనక్కి ఇచ్చేసింది ఆస్ట్రేలియా. అవి త్వరలోనే తిరిగి స్వదేశానికి చేరుకోనున్నాయి. తమిళనాడులోని అతి పురాతన ఆలయాలకు చెందిన ఈ అరుదైన సాంస్కృతిక సంపదను భారత్‌కు తిరిగి అప్పగించడానికి ఆస్ట్రేలియా అంగీకరించింది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను కూడా పూర్తి చేసింది. ఇందులో భద్రకాళి అమ్మవారి రూపంతో కూడిన లోహపు త్రిశూలం, పవిత్ర రాతి నంది విగ్రహం, షణ్ముఖ కార్తికేయుడి రాతి విగ్రహం ఉన్నాయి. దీంతో దేశ పురాతన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించే దిశగా, చట్టవిరుద్ధ రవాణాకు అడ్డుకట్ట వేసే విషయంలో ఓ ముందడుగు పడినట్టయింది. భారతీయ శిల్పకళా వైభవానికి, అపార సాంస్కృతిక చరిత్రకు నిదర్శనమైన ఈ కళాఖండాలు చోళులు, విజయనగర రాజుల కాలం నాటివి. తిరిగా రాబోతున్న ఈ కళాఖండాలలో తమిళనాడులోని తిరువారూర్ జిల్లా, కొల్లుమాంగుడిలో కొలువై ఉన్న శ్రీ కాశీవిశ్వనాథస్వామి ఆలయానికి చెందిన రెండు ముఖ్యమైన లోహ, రాతి శిల్పాలు ఉన్నాయి. అందులో మొదటిది త్రిశూలం. దీని పైభాగంలో ఉగ్రరూపంలో ఉన్న భద్రకాళి అమ్మవారి ప్రతిమ అత్యంత కళాత్మకంగా చెక్కారు కళాకారులు. శైవ శాక్తేయ సంప్రదాయాల ప్రకారం ఈ త్రిశూలం దుష్టశిక్షణ, దైవిక శక్తి, రక్షణకు ప్రతీకగా నిలుస్తుంది. ఇది దాదాపు 13వ శతాబ్దం నుంచి 16వ శతాబ్దానికి చెందినదిగా భావిస్తున్నారు. అదే కాశీవిశ్వనాథస్వామి ఆలయానికి చెందిన మరో అరుదైన రాతి శిల్పం నంది విగ్రహం. పరమశివుడి వాహనమైన ఈ నందిని తమిళ శైవ శిల్ప సంప్రదాయంలో అత్యంత సహజసిద్ధంగా తీర్చిదిద్దారు. మెడలో గంటలు, అందమైన పూలదండలతో ప్రశాంత వదనంతో పడుకుని ఉన్న భంగిమలో ఉన్న ఈ నంది శిల్పం చోళుల నాటి శిల్పకళా శైలిని కలిగి ఉంది. శైవ క్షేత్రాల్లో మహాశివుడి గర్భగుడికి అభిముఖంగా కనిపించే నంది విగ్రహం నిస్వార్థ భక్తి, బలం, ధర్మానికి ప్రతీక. వీటితో పాటు తంజావూరు జిల్లా మానంబాడిలో కొలువైన ప్రసిద్ధ నాగనాథస్వామి దేవాలయానికి చెందిన ఆరు తలల కార్తికేయుడి రాతి విగ్రహం కూడా త్వరలోనే భారత్‌కు రానుంది. 11వ శతాబ్దంలో మొదటి రాజేంద్ర చోళుడి కాలంలో నిర్మితమైన ఈ ఆలయంలో కార్తికేయుడి ఈ ఆరు ముఖాల రూపం అపారమైన దివ్య జ్ఞానం, శౌర్యం, రక్షణను సూచిస్తుంది. 12 చేతుల్లో విభిన్న ఆయుధాలను ధరించి, పక్కనే వాహనమైన నెమలితో కూడి ఉన్న ఈ ఐతిహాసిక శిల్పం చోళుల కాలపు శిల్పకళా ప్రాభవానికి అద్దం పడుతోంది.

# సంక్షిప్త వార్తలు

## అమెరికా ఉద్యోగాలు అమెరికన్లకే దక్కాలి



**వాషింగ్టన్, జులై 9:** హెచ్-1బి వీసా దుర్వినియోగాలకు పాల్పడే వారిపై అమెరికా చేపట్టిన చర్యలపై అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ స్పందించారు. అమెరికా ఉద్యోగాలు అమెరికన్లకే దక్కాలని పునరుద్ఘాటించారు. వీసా మోసాలకు పాల్పడే వారిపై అమెరికా కార్మిక శాఖ ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించిందని, విచారణ నిమిత్తం కొంతమందికి నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిపారు. విస్కాన్సిన్‌లో జరిగిన ఓకార్యక్రమంలో వాన్స్ మాట్లాడుతూ.. 'అత్యున్నత ప్రతిభ కలిగిన శాస్త్రవేత్తలు, వైద్యులు, సాంకేతిక నిపుణులు అమెరికాలో పనిచేసేందుకు వీలుగా హెచ్-1బి వీసాను రూపొందించాం. కానీ, కొన్ని పెద్ద కంపెనీలు, వ్యక్తులు ఈ వీసా విధానాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. తక్కువ వేతనాలతో విదేశీ ఉద్యోగులను నియమించుకుని అమెరికా కార్మికు ఉపాధిని దెబ్బతీస్తున్నారు.వీసా దుర్వినియోగం చేసేవారిని ఇకపై ఉపేక్షించబోం. అలాంటి వారికి అమెరికాలోకి ప్రవేశం ఉండదు అని స్పష్టం చేశారు.

## స్పౌజ్ బెనిఫిట్స్‌కు స్వలింగ సంపర్కులు అనర్హులు

**ముంబై:** స్వలింగ సంపర్కుల జంట పెట్టుకున్న అభ్యర్థనను ఆదాయపన్ను శాఖ కొట్టిపారేసింది. వివాహ చట్టం ప్రకారం కానుకలపై ఇచ్చే ఆదాయపన్ను మినహాయింపును తమకు కూడా కల్పించాలని కోరుతూ ఓ స్వలింగ సంపర్కుల జంట బాంబే హైకోర్టును ఆశ్రయించింది. ఆదాయపన్ను శాఖలోని సెక్షన్ 56(2)(ఎక్స్) కింద కలిగే బెనిఫిట్స్ తమకు కూడా ఇవ్వాలని కోరుతూ సేమ్‌సెక్స్ జంట కోరింది. పాయో అశిహో, వివేక్‌దివాన్ అనే జంట ఈపిటీషన్ వేసింది. తమకు పన్ను మినహాయింపు ఇవ్వకపోవడం అనైతికమని స్వలింగ సంపర్కుల జంట వాదించింది. స్వలింగ సంపర్కుల జంట పెట్టుకున్న అభ్యర్థనను ఆదాయపన్ను శాఖ వ్యతిరేకించింది. పెళ్లి కానుకలపై జీవితభాగస్వాములు మినహాయింపు కోరడం చట్టం ప్రకారం వర్తిస్తుందని, కానీ పాయో, వివేక్‌లు దంపతులు కారు అని, వాళ్లు కేవలం స్వలింగ సంపర్క భాగస్వాములు మాత్రమే అని, వారికి ఆదాయపన్ను శాఖ చట్టాలు వర్తించవన్నారు.

## కరూర్ బాధితులకు ఉద్యోగాలు




**చెన్నై,జులై 9:** తమిళనాడు సిఎం విజయ్ శుక్రవారం కరూర్‌లో పర్యటించను న్నారు. 2025, సెప్టెంబర్ 27వ తేదీన కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో సుమారు 41 మంది మృతిచెందిన విషయంతెలిసిందే. టీవీకే ప్రచార సభకు హాజరైనజనం నటుడు విజయ్‌ను చూసేందుకు ఎగబడ్డారు. అయితే కరూర్ తొక్కిసలాటకు చెందిన సుమారు 32 మంది బాధిత కుటుంబాలకు రేపు సీఎం విజయ్ ప్రభుత్వ ఉద్యోగ అపాయింట్ మెంట్ ఆర్డర్లను అందజేయను న్నారు. ఈపర్యటన సందర్భంగా ప్రభుత్వ సంక్షేమపథకాల లబ్ధిదారులకుకూడా ఆయన సాయం చేయనున్నారు.

## 300కుపైగా ఫైవ్‌స్టార్ హోటళ్లకు టోకరా

**న్యూఢిల్లీ,జులై 9:** దేశవ్యాప్తంగా గత మూడు దశాబ్దాలుగా 300కుపైగాలగ్జరీ హోటళ్లను బురిడీ కొట్టించిన తమిళనాడుకు చెందిన 69 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నకిలీ గుర్తింపులతో ఫైవ్‌స్టార్ హోటళ్లలో బస చేసి, బిల్లులు చెల్లించకుండా పరారయ్యేవాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని బింగ్సన్ జాన్‌గా గుర్తించారు. విదేశీ టూరిస్ట్ గైడ్, ఇంగ్లీష్ టీచర్, యోగా ట్రైనర్ వంటి వేర్వేరు గుర్తింపులతో ఫైవ్‌స్టార్ హోటళ్లలో గదులు బుక్ చేసుకుని, పలురోజులు అక్కడే ఉంటూ హోటల్ సౌకర్యాలను పూర్తిగా వినియోగించుకునేవాడు. అనంతరం బిల్లు చెల్లించకుండా అక్కడి నుంచి వెళ్లిపోయేవాడు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ హయత్ హోటల్‌ను లక్ష్యంగా చేసుకున్న జాన్, అక్కడ రెండు రోజుల పాటు బస చేసి రూ.63,755 విలువైన బిల్లు చెల్లించకుండా వెళ్లిపోయాడు. సుమారు రూ.1.48 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌ను కూడా తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.హోటల్ యాజమాన్యం ఫిర్యాదు చేయడంతో యాంటీ క్రైమ్ అండ్ సైబర్ యూనిట్, టెలీబాంధా పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. మొబైల్ ఫోన్ కాల్ డేటా, పత్రాలు, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించి ఒడిశాలోని భువనేశ్వర్‌లో అతడి ఆచూకీని గుర్తించారు. రాయ్‌పూర్ పోలీసుల ప్రత్యేక బృందం 72 గంటల్లోనే అతడిని అదుపులోకి తీసుకుని, "ఆఫీస్ పని కోసం" తీసుకెళ్లానని చెప్పిన దొంగిలించిన ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకుంది.

# వచ్చే యేడాది 300 గిగావాట్ల విద్యుత్ డిమాండ్

### ఇప్పటికే 271 గిగావాట్ల రికార్డు నమోదు

### కేంద్ర ఇంధన శాఖ మంత్రి మనోహర్‌లాల్

**హైదరాబాద్, జూలై 9, ప్రభాతవార్త:** వచ్చే ఏడాది దేశంలో సుమారు 300 గిగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్‌కు సిద్ధం కావాల్సి ఉంటుందని కేంద్ర ఇంధన శాఖ మంత్రి మనోహర్ లాల్ తెలిపారు. అదే సమయంలో, దేశీయ స్వచ్ఛ ఇంధన సరఫరా గొలుసులను వేగవంతంగా అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ మేరకు గురువారం మీడియాతో మాట్లాడుతూ దేశంలో ఇప్పటికే సుమారు 271 గిగావాట్ల రికార్డు స్థాయి గరిష్ఠ డిమాండ్‌ను అందుకుంటున్నారు. ఈ యేడాది డిమాండ్ 276–280 గిగా వాట్లకు పెరిగి, వచ్చే ఏడాదికి 300 గిగావాట్లకు చేరువయ్యే అవకాశం ఉందని వివరించారు. డేటా సెంటర్లు విస్తరిస్తున్న కొద్దీ, ఏఐ వినియోగం, ఈవీల వాడకం పెరుగుతున్న కొద్దీ, ప్రతి ఏటా డిమాండ్ పెరుగుతూనే ఉంటుందన్నారు. భారతదేశం పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని విస్తరిస్తూనే ఉన్నందున, విద్యుత్ వినియోగంలో ఆశించిన పెరుగుదలకు ఇంధన నిల్వ, గ్రిడ్ మౌలిక సదుపాయాలలో అధిక పెట్టుబడి అవసరమవుతుందని మంత్రి అన్నారు. స్వచ్ఛ ఇంధన ప్రాజెక్టులలో స్థానిక పరికరాల వినియోగాన్ని వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. దేశీయ తయారీ వల్ల మొదట్లో ఖర్చులు పెరిగినా దేశం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దేశం ఇప్పటికీ సౌర శక్తి నిల్వ ప్రాజెక్టులలో ఉపయోగించే సెల్స్, బ్యాటరీలతో సహా పలు రకాల భాగాలను దిగుమతి చేసుకుంటోందని చెప్పారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో విదేశీ మారక ద్రవ్యాన్ని పరిరక్షించుకోవడం, ఇంధన భద్రతను బలోపేతం చేసుకోవడం వంటి ఆవశ్యకతను నొక్కిచెప్పారు. పునరుత్పాదక ఇంధనం, ఇంధన నిల్వ సరఫరా గొలుసులలో దేశీయ తయారీని బలోపేతం చేస్తూ, విదేశీ సరఫరాదారులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలనే దిశగా ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. విద్యుత్, పెట్రోలియం లేదా గ్యాస్ ఏదైనా మనం దేశంలోనే మన సొంత సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవాలని లాల్ అన్నారు. ఇందులో భాగం గానే దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించడానికి, పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని విస్తరించడానికి కేంద్రం ఇటీవలి సంవత్సరాలలో అనేక చర్యలను ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు.

## నేటి నుంచి దోస్త్ ఇంట్రా కాలేజ్ ఫేజ్

### 13 వరకు అవకాశం అప్షన్లు.. 14న సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, జూలై 9, ప్రభాతవార్త:** డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)- 2026 ద్వారా ఇప్పటికే మూడో విడతల్లో సీట్ల కేటాయింపును పూర్తి చేశారు. సీట్లు పొందిన వారు కాలేజీల్లో రిపోర్టింగ్ అవకాశం ఈ నెల 4తో ముగిసింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కాలేజీల్లో చేరిన విద్యార్థులకు అదే కాలేజీలో మరో కోర్సులో చేరేందుకు నేటి(శుక్రవారం) నుంచి ఇంట్రా కాలేజ్ ఫేజ్‌కు అవకాశం కల్పించారు. ఈ నెల 13 వరకు ఇంట్రా కాలేజ్ ఫేజ్‌కి అవకాశం కల్పించారు. ఇంట్రా కాలేజ్ ఫేజ్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 14న సీట్ల అలాట్‌మెంట్‌ను చేయనున్నారు. మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

## నేడు ఇంజినీరింగ్ మొదటి విడత సీట్ల కేటాయింపు

### 14 వరకు కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి

### 4న మాక్ సీట్ల కేటాయింపులో 79,313 సీట్ల అలకేషన్

**హైదరాబాద్, జూలై 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్ సెట్-2026 కౌన్సెలింగ్‌లో భాగంగా నేడు(శుక్రవారం) మొదటి విడత సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 14 వరకు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి ఈ నెల 4న మాక్ సీట్ కేటాయింపు చేశారు. 88,053 సీట్లకు గానూ 79,313 సీట్లను కేటాయించారు. 90 శాతం సీట్లను మాక్ సీట్ అలకేషన్‌లో కేటాయించారు. మాక్ సీట్ల కేటాయింపులో భాగంగా ఈ నెల 7 వరకు విద్యార్థులు వెబ్ ఆప్షన్లను మార్చుకోవడానికి అవకాశం కల్పించారు. కొంత మంది విద్యార్థులు తమకు నచ్చిన కాలేజీలో నచ్చిన కోర్సు వచ్చే అవకాశం ఉండటంతో వెబ్ ఆప్షన్లను మార్చుకున్నారు.

## రాష్ట్రంలో భూ ప్రకంపనలు

**హైదరాబాద్, జూలై 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో భూ ప్రకంపనలు నమోదయ్యాయి. తెలంగాణలోని నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి, జగిత్యాల సహా పలు జిల్లాల్లో గురువారం తెల్లవారు జామున ఈ ప్రకంపనలు సంభవించాయి. జాతీయ భూకంప శాస్త్ర కేంద్రం పరిశీలన ప్రకారం, తెల్లవారు జామున 1:40 గంటలకు 4.6 తీవ్రతతో భూకంపం సంభవించి, ఆ తర్వాత రిక్టర్ స్కేలుపై 3.6, 3.9, మరియు 4.1 తీవ్రతలతో కూడిన ప్రకంపనలతో సహా పలు ప్రకంపనలు సంభవించాయి. భూకంప హెచ్చరిక ప్రకారం, భూకంప కేంద్రం హింగోలి నాందేడ్ ప్రాంతంలో ఉన్నప్పటికీ, నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి మరియు జగిత్యాల జిల్లాల్లో ప్రకంపనలు స్పష్టంగా సంభవించాయి. 4.6 తీవ్రత గల ముఖ్యమైన భూకంపం తర్వాత ప్రకంపనలు సంభవించే అవకాశం ఉందని నిపుణులు సూచించారు. ఆ తర్వాత వచ్చే ప్రకంపనల సంఖ్య, తీవ్రత కాలక్రమేణా తగ్గుతూ, అవి భూకంప ప్రక్రియలో ఒక సాధారణ భాగమని నిపుణులు తెలిపారు. వరుస ప్రకంపనలు సంభవించినప్పటికీ, ఈ భూకంప సంఘటనల వలన ప్రాణనష్టం గానీ, గణనీయమైన నిర్మాణ నష్టం గానీ జరిగినట్లు ఎటువంటి సమాచారం లేదని భూకంప సంఘటనలను పర్యవేక్షించే నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ స్పష్టం చేసింది.

## ఆదివాసీల హక్కులు పరిరక్షించాలి: ప్రొ.హరగోపాల్

**హైదరాబాద్ (ముషీరాబాద్), జులై 9, ప్రభాతవార్త:** ఆదివాసీల హక్కుల రక్షణకై ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ సూచించారు. గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ఆదివాసీల హక్కుల పోరాట సమితి, తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు రాథోడ్ గోవర్ధన్ అధ్యక్షతన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరై హరగోపాల్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని షెడ్యూల్డ్ ప్రాంతాల చట్టాలు, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం అమలులో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోందని విమర్శించారు. రాజ్యాంగం కలిపించిన హక్కులను ఆదివాసీలకు పూర్తిస్థాయిలో అమలుచేయకుండా వారి అభివృద్ధి సాధ్యం కాదని, అడవులు, భూమి, సహజ వనరులపై ఆదివాసీల హక్కులను ప్రభుత్వం వెంటనే రక్షించాలని, వారి జీవనోపాధికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. రాథోడ్ గోవర్ధన్ మాట్లాడుతూ లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, గిరిజనుల ఆక్రమిత భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐటిడిఏలను బలోపేతం చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, కోయవంశ రంగారావు కమిటీ సిఫార్సులను అమలుచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ గాధిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాథోడ్ సంజీవ్ నాయక్, తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు, రాష్ట్ర సంఘీభావ నాయకులు జిల్లా నాయకులు వివిధ ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు.




ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్



## సింగరేణి బకాయిలు చెల్లించాలి..

## లేదంటే ఉద్యమమే

### కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ అవినీతిలో పోటీ పడుతున్నాయి

### కొత్తగూడెం నుంచి కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు

**కొత్తగూడెం, జులై 9, ప్రభాతవార్త:** తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షు రాలు కల్వకుంట్ల కవిత గురువారం కొత్తగూడెం పర్యటనలో అధికార, ప్రతిపక్ష పార్టీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బాయి బాట కార్యక్రమంలో భాగంగా పీవీకే5 గనిని సందర్శించి కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించిన ఆమె, అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని పలు ఆరోపణలు చేశారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లోకి తిరిగి వెళ్లబోనని స్పష్టం చేసిన కవిత, ఆ పార్టీ ఖాతాలో ఉన్న రూ.1,400 కోట్లను తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. తమ పార్టీకి భయం లేదని చెబుతూనే ఎన్నికల సంఘానికి వెయ్యికి పైగా ఫిర్యాదులు చేశారని బీఆర్ఎస్‌పై విమర్శించారు. పార్టీ వార్తలు ప్రచురించకుండా ఒత్తిళ్లు తెస్తున్నారని, సోషల్ మీడియాలో అసభ్య ప్రచారం సాగుతోందని ఆరోపించారు. కేటీఆర్ తన సన్నిహితులకు క్విడ్ ప్రో కో ద్వారా అక్రమ అనుమతులు కల్పించారని, హరీశ్‌రావు కాళేశ్వరం వ్యవహారంలో ప్రధాన బాధ్యుడని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు సిద్ధాంతం, విధానం లేకుండా పోయిందని, ప్రజా సమస్యలపై పోటీ పడాలని సవాల్ విసిరారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపైనా కవిత తీవ్ర విమర్శలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటి ఎత్తిపోతల విషయంలో రాజకీయ కక్షతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అర కిలోమీటర్ మేర రాతి కట్ట నిర్మిస్తే నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని సూచించారు. సింగరేణి అంశంపై మాట్లాడుతూ... సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం రూ.54 వేల కోట్ల బకాయిలు చెల్లించకపోవడం వల్లే ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. కార్మికులకు కనీస పనిముట్లు, భద్రతా సదుపాయాలు కూడా అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీనిక్స్ సంస్థకు వేల కోట్ల విలువైన భూములు కేటాయించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఆ భూముల విస్తరణలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని కవిత ఆరోపించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సింగరేణి కార్మికుల సమస్యలపై స్పందించడం లేదని కవిత విమర్శించారు. కేంద్రం తీసుకొచ్చిన కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయించాలని డిమాండ్ చేశారు.

## రావణ్‌పై అక్రమ కేసులు ఎత్తివేయాలి

### తెలంగాణ పౌర హక్కుల సంఘం డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), జులై 9, ప్రభాతవార్త:** ఏపి ప్రభుత్వం యూట్యూబర్ ప్రశ్నా రావణ్‌పై పెట్టిన ఉపా కేసును, జర్నలిస్టు కె.వి.ఆర్, అతని భార్యపై పెట్టిన అన్ని అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఎస్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు మాట్లాడుతూ ఎపి ఉప ముఖ్యమంత్రి కొణిదేల పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను రావణ్ పునశ్చరణ చేసినందుకు ఆయనపై పలు పోలీస్ స్టేషన్‌ల్లో కేసులు నమోదు చేసిన ప్రభుత్వం ఉపా కేసు కూడా నమోదు చేసి నిర్బంధించడం అన్యాయమన్నారు. అలాగే ఈ నెల 1వ తేదీన జర్నలిస్టు కె.వి.ఆర్ ఇంటిపై పోలీసులు దాడి చేసి అమాంతంగా ఎత్తుకు పోయారని, దీన్ని ప్రశ్నించిన ఆయన భార్యపైన కూడా పోలీసులు అక్రమ కేసులు పెట్టారని, ఈ అరెస్టులకు ముఖ్యమంత్రే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అన్ని పత్రికలపైన, యూట్యూబ్‌లపై నిర్బంధాన్ని ఉపసంహరించుకుని పత్రికా స్వేచ్ఛను కాపాడగలిగితే కనీసమైనా ప్రజాస్వామ్యం నిలబడుతుందని, లేకపోతే నిర్బంధమే రాజ్యమేలుతూ ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు పత్రికలు, యూట్యూబ్ ఛానల్స్‌పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు.

## భార్యపై కొడవలితో భర్త దాడి

### పరిస్థితి విషమం.. పోలీసుల అదుపులో భర్త తిమ్మప్ప

**మల్దకల్, జులై 9, ప్రభాతవార్త:** మల్దకల్ మండలం మల్లెందొడ్డి గ్రామంలో భార్యాభర్తల మధ్య గొడవల్లో భర్త తిమ్మప్ప భార్య మహేశ్వరిపై కొడవలితో తలపై దాడి చెయ్యగా మహేశ్వరికి తీవ్రగాయలయ్యాయి. చికిత్స నిమిత్తం మహేశ్వరిని గద్వాల ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్సకోసం కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. కాగా భర్త తిమ్మప్ప వ్యసనాలకు బానిసై తరుచు భార్యతో గొడవ పడేవాడని మద్యం మత్తులోనే భార్యపై దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

## నేడు విద్యాసంస్థల బంద్

### వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను తగ్గించాలన్న ప్రయత్నాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానుకోవాలని, విద్యారంగంలో నెలకొన్న సమ్యలను పరిష్కరిం చాలంటూ వామపక్ష విద్యార్థి సంఘాలు నేడు(శుక్రవారం) బంద్‌కి పిలుపునిచ్చాయి. రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలు బంద్ పాటించాలని వామపక్ష విద్యార్థి సంఘాలు ప్రకటించాయి. రాష్ట్రంలో 27వేల ప్రభుత్వ పాఠశాలలు ఉంటే వాటి సంఖ్యను 4వేలకు తగ్గించాలని సర్కారు భావిస్తోందని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. ఈ నిర్ణయాన్ని ఉపసంహారించుకోవాలని, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రిస్తూ చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ.. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఐఏడిఎస్‌వో, ఏఐఎఫ్‌డిఎస్, ఏఐఎస్‌బి, ఏఐపిఎస్‌యు తదితర వామపక్ష విద్యార్థి సంఘాలు నేడు బంద్‌కి పిలుపునిచ్చాయి. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈఓ, డీఈఓ, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న పాఠశాలలు, హాస్టల్స్, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని వామపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. రాష్ట్రంలోని అన్ని ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణం అమలు చేయాలని, విద్యాహక్కు చట్టం అమలు చేసి అన్ని విద్యా సంస్థల్లో పేదలకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి.

## అనుపురం-ఇస్లాంనగర్ వద్ద

# రోడ్డు ప్రమాదం

### కూలీ దుర్మరణం, ఇద్దరికి సీరియస్.. వరంగల్ తరలింపు

**వేములవాడ అర్బన్, ప్రభాతవార్త:** వేములవాడ అర్బన్ మండలం అనుపురంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వేములవాడ అర్బన్ మండలం అనుపురం గ్రామ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన అతుల్ (35) వలస కూలీ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మరికొందరి పరిస్థితి అత్యంత విషమంగా వుంది. మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన కొందరు కూలీలు పనుల నిమిత్తం తంగళ్లపల్లి, లక్ష్మీపురం వద్ద వారి నాటుకి వెళ్లి తిరిగి బోయినపల్లి మండలం వరదవెల్లి గ్రామంలోని వారి నివాసానికి ఏపీ01శ్రీ9735 నంబర్ గల టాటా ఎస్ వాహనంలో 23 మంది కూలీలు వెళ్తుండగా వేములవాడ అర్బన్ మండలం అనుపురం గ్రామ శివారులో టి ఎస్ 23గి4700 నంబర్ గల బస్సు వెనుక నుంచి బలంగా ఢీ కొట్టడంతో ప్రమాదం సంభవించిందని స్థానికులు తెలిపారు. క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా భయానకంగా మారింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న వేములవాడ పోలీసులు, స్థానికుల సహాయంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తక్షణమే వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను జిల్లా ఎస్పీ మహేష్ బి గీతేతో కలిసి ప్రభుత్వ విప్‌పరామర్శించారు. బాధితులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. 23 మంది కూలీలు ఉన్నారని, వారిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఆ ఇద్దరిని మెరుగైన వైద్య చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. బాధితులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూస్తామని ఆది శ్రీనివాస్ భరోసా ఇచ్చారు.

## ఎసిబికి చిక్కిన పంచాయతీరాజ్ ఎఇ

### రూ. 10,000 తీసుకుంటుండగా పట్టివేత

**కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:** పంచాయతీరాజ్ ఎఇ గతంలో పనిచేసిన చోట ఇవ్వవలసిన బిల్లు విషయంలో లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. పూర్తి వివరాలిలా ఉన్నాయి. పంచాయతీరాజ్ విభాగం చొప్పదండి ఎఇగా పనిచేస్తున్న పైడి సతీష్ గతంలో గంగాధర మండలం ఏ ఈ గా పనిచేశాడు. అప్పుడు చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్‌కు మొండి చేయి చూపాడు. బిల్లు రావాలంటే లంచం ఇవ్వాల్సిందేనని పట్టు పట్టడంతో బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించాడు. బాధితుని ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు గురువారం పదివేల రూపాయలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం తీసుకున్నది నిజమేనని నిర్ధారించు కుని అదుపులోకి తీసుకొని ఎసిబి కార్యాలయానికి తరలించారు. పలు కీలక ఫైళ్ళను కూడా స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ విజయకుమార్ తెలిపారు.



## ఆ శాఖ ఉద్యోగులందరికీ 1నే వేతనాలు

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్యశాఖ పరిధి లో వివిధ ఏజెన్సీలలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలను ప్రతినెల మొదటి తేదీ రోజు విడుదల చేయాటానికి చేసిన విజ్ఞప్తిపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సానుకూలంగా స్పందిం చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు విడుదల చేయాలని ఇచ్చిన ఆదేశాల మేరకు .. వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బం దికి ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలను విడుదల అయ్యేలా చర్యలు తీసుకుంటామనిమంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఏజెన్సీల ద్వారా వేతనాలు తీసుకుంటున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలను ప్రతినెల 1 తేదీన మానవతా దృక్పథంతో, వారి ఆవేదనను అర్థం చేసు కొని విడుదల చేయాటానికి కృషి చేస్తామన్నారు. అందుకు ఐహెచ్ఎఫ్ ఎంఎస్ పోర్టల్ పాలసీలో ప్రతి నెల మొదటి తేదీన వేతనాలను విడు దల చేసేలా సవరణలను తీసుకురావటానికి చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఐపిఎస్ పూర్ణచందర్‌రావు, మాజీ ఐఏఎస్ చిరంజీవులు, కిరణ్‌కుమార్, సూర్యారావు తదితరులు

## ఆగస్టు 7న 'బిసి విద్యార్థుల జాతీయ మహాసభ'

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో తొలి జాతీయ ఓబీసీ విద్యార్థుల జాతీయ మహాసభ ఆగస్టు 7న నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా ఓబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డా.జి. కిరణ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు గురువారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మహాత్మా జ్యోతిరావు ఫూలే 200వ జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్న మండల్ దివస్ వేడుకలు - 2026కు సంబంధించిన పోస్టర్‌ను మాజీ ఐపిఎస్ పూర్ణచందర్‌రావు, మాజీ ఐఏఎస్ చిరంజీవులు చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, భారత రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయ స్ఫూర్తిని బలోపేతం చేయాలంటే ఓబీసీలకు జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు, పదోన్నతుల్లో కూడా రిజర్వేషన్లు కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం కోసం పనిచేస్తున్న శక్తులన్నీ ఈ మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

టి. చిరంజీవులు మాట్లాడుతూ, కుల గణన ఆధారంగా శాస్త్రీయ విధానాలతో విధాన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ అధ్యక్షుడు డా. జి. కిరణ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో ఓబీసీలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, కుల గణన, జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్ల పెంపు, పదోన్నతుల్లో రిజర్వేషన్లు, ఉన్నత విద్యలో సమాన అవకాశాలు, ఫెలోషిప్‌లు, ఉపాధి, ఇతర సామాజిక న్యాయ అంశాలపై విస్తృతంగా చర్చించి, భవిష్యత్ కార్యాచరణకు మార్గదర్శకంగా 'హైదరాబాద్ డిక్లరేషన్'ను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. వెంకట్ మారోజు, సంగెం సూర్యరావు, సైదులు దేవరకొండ, మహేష్ గౌడ్, గంగాధర్, లక్ష్మీ నర్సయ్య, వసుమతి యాదవ్, కొండల్, శివ యాదవ్ పాల్గొన్నారు.

## డిఎంఇ కార్యాలయాన్ని ముట్టడించిన కార్మికులు

### అడ్డుకున్న పోలీసులకు, కార్మికుల మధ్య తోపులాట, ఉద్రిక్తత



**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు శానిటేషన్ వర్కర్స్ వేతనాలు పెంచాలని, దాంతోపాటు పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు ప్రతి నెలా 1వ తేదినే వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు గురువారం కోఠిలోని డీఎంఈ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్మికులను నియంత్రించడానికి పోలీసులు అడ్డుకోవడంతో.. పోలీసులు కార్మికులకు మధ్య తోపులాట జరిగి తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేయుచున్న కాంట్రాక్టు శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు 1వ తేదీన జీతాలు రాకపోవడం, జీతాలు చెల్లించేందుకు ఈ కార్మికులను కాంట్రాక్టు కార్మికులుగా కూడా పరిగణలోకి తీసుకోకపోవడం కార్మికుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా భావించి తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) గత రెండు రోజులుగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ధర్నాలు నిర్వహించి గురువారం కోఠిలోని డిఎంఈ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం లక్ష్మిబాయి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ హాసీనా బేగం, కార్యదర్శులు పి సురేష్, ఏ పార్వతి, ఎస్ కిష్టమ్మ, జైలక్ష్మి, మదన్ సింగ్, షాహిన్ బేగం, కృష్ణవేణి పాల్గొన్నారు.

## కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజులను నియంత్రించాలి

### ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి: ఐద్వా డిమాండ్

### సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వైజ్ఞానిక శిక్షణా తరగతులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి) జులై 9, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు విద్యను పూర్తి వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై మోపుతున్న భారీ ఫీజుల భారాన్ని వెంటనే నియంత్రించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకు రావాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరింది. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఐద్వా వైజ్ఞానిక శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ప్రిన్సిపాల్‌గా వ్యవ హరించగా, రాష్ట్ర వ్యాప్తం గా 29 జిల్లాల నుండి సుమారు 500 మంది మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. శిక్షణా తరగతుల ఆఖరి రోజున ఖిఉత్పత్తి రంగంలో మహిళల పాత్రఖి అనే అంశంపై ఐద్వా సీనియర్ నాయకురాలు బత్తుల హైమావతి క్లాస్ బోధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో మహిళల శ్రమను సము చితంగా ఉపయోగించు కోవడంలో ప్రభుత్వాలు విఫలమవు తున్నాయని విమర్శించారు. మహిళలకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించి, వారి శ్రమకు న్యాయమైన వేతనాలు చెల్లిస్తే రాష్ట్ర ఆదాయంతో పాటు ప్రజల కొనుగోలు శక్తి కూడా గణనీయంగా పెరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణజ్యోతి, సహాయ కార్యదర్శులు కె.ఎన్. ఆశాలత, బుగ్గవీటి సరళ, రాష్ట్ర కోశాధికారి మాచార్ల భారతి, ఆల్ ఇండియా నాయకులు పి. ప్రభావతి, బండి పద్మ, నాగలక్ష్మి, ఎన్. రత్నమాల, కె. గీతా రాణి, ఎమ్. వినోద, బి. అనూరాధ, పి. శశికళ, వై. వరలక్ష్మితో పాటు పలువురు ఐద్వా కార్యకర్తలు హాజరయ్యారు.




ప్రసంగిస్తున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం

### ఇఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో అన్ని సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు

### మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, దామోదర రాజనర్సింహ

**సంగారెడ్డి బ్యూరో, జులై 9, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన, ఆధునిక వైద్య సేవలను ఉచితంగా అందించడంతో పాటు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు సత్వర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఈఎస్ఐ వైద్య సేవలను విస్తరిస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈఎస్ఐ డిస్పెన్సరీని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్‌తో కలిసి మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా అన్ని మౌలిక వసతులు, వైద్య సదుపాయాలను కల్పిస్తూ ఈఎస్ఐ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డి పారిశ్రామిక ప్రాంతంలో పనిచేసే కార్మికులు వైద్య చికిత్స కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే అన్ని రకాల వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో సంగారెడ్డిలో ఈఎస్ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 80 లక్షల కుటుంబాలు ఈఎస్ఐ వైద్య సేవలపై ఆధారపడుతున్నాయని, ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీల్లో అవసరమైన అన్ని సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకే కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థిక భారం మోసుకోవద్దని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంటూ కార్మికులు ఈఎస్ఐ డిస్పెన్సరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు.

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ.. మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటికే ఏడు ఈఎస్ఐ డిస్పెన్సరీలు ఉండగా, సంగారెడ్డిలో ఎనిమిదో డిస్పెన్సరీని ప్రారంభించడం సంతోషకరమన్నారు. రూ.200 కోట్లతో సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. జహీరాబాద్, నారాయణఖేడ్, సదాశివపేట, ఆందోల్, జోగిపేట ప్రాంతాల ప్రజలకు కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, ఈఎన్‌టీ, క్యాన్సర్ చికిత్స, ట్రామా కేర్, నేత్ర వైద్య సేవలు వంటి సూపర్ స్పెషాలిటీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పీజీ సీట్లను కూడా కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని 104 ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల సంఖ్యను పెంచుతూ వైద్య సేవలను మరింత విస్తరిస్తున్నామని తెలిపారు. ప్రజలకు అన్ని రకాల ఆధునిక వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

జిల్లాలో కార్మికుల వైద్య సేవల విస్తరణకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్ మాట్లాడుతూ, సంగారెడ్డి రాష్ట్రంలో ప్రధాన పారిశ్రామిక జిల్లాగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో వేలాది మంది



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం మరింత వైద్య మౌలిక వసతులను కల్పించాలని కోరారు. ఈఎస్ఐ వైద్య సేవల విస్తరణ కార్మికులకు ఎంతో ఉపయోగ పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. గౌతమ్ గారు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు వనిత సంతోష్, అంజమ్మ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఈఎస్ఐ జాయింట్ డైరెక్టర్ డా. గౌతమ్, వైద్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఖమ్మంకు సిఎం రేవంత్‌రెడ్డి

### రైతు ఆశీర్వాద సభకు హాజరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 9:** ఖమ్మం జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు చింతకాని మండలం జగన్నాధపురం సిఎం చేరుకుంటారు. జగన్నాథపురంలో ఏర్పాటు చేసిన 'రైతు ఆశీర్వాద సభ 'కు సిఎం హాజరు కానున్నారు. రైతు భరోసా నిధుల విడుదలతో పాటు రైతులకు ఈపట్టాదార్ పాస్‌బుక్‌ల జారీ చేయనున్నారు. జూన్ 30 న వానాకాలం రైతు భరోసా నిధుల విడుదలను ప్రారంభించిన సీఎం 9 రోజుల్లో 9 వేల కోట్లు విడుదల రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి.

## రోడ్లు భవనాల శాఖ మాజీ ఇఎన్‌సి మోహన్‌నాయక్ కేసులో ట్విస్ట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 9:** ఆదాయానికి మించి అక్రమాస్తుల వ్యవహారంలో అరెస్టయిన రోడ్లు, భవనాల శాఖ ఈఎన్‌సీ మోహన్ నాయక్ కేసులో ట్విస్ట్ చోటు చేసుకుంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా మోహన్ నాయక్ బినామీలను ఏసీబీ విచారించింది. అధికారిక లెక్కల ప్రకారం రూ.17 కోట్ల అక్రమాస్తులను మోహన్ నాయక్ బినామీల పేరున పెట్టినట్లు ఏసీబీ గుర్తించింది. ఈ క్రమంలో గురువారం మోహన్ నాయక్ మరదలు పద్మినిని ఏసీబీ అధికారులు విచారించారు. ఈ నేపథ్యంలో ఆమె స్టేట్‌మెంట్‌ను ఏసీబీ అధికారులు రికార్డ్ చేశారు. గచ్చిబౌలి డిఎల్ఎఫ్ వద్ద ఉన్న రెండు భవనాలను పద్మినీ పేరు మీద మోహన్ నాయక్ రిజిస్టర్ చేయించారు. ఆ ఫ్లాట్లు తనవి కాదని అధికారులకు పద్మిని స్పష్టం చేశారు. మోహన్ నాయక్ నగదుతోనే అతడు చెబితేనే రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కి వెళ్లి సేల్ డీడ్ చేసుకున్నట్లు ఏసీబీకి ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో పద్మిని వివరించారు. ఈ స్టేట్‌మెంట్‌ను మెమో రూపంలో ఏసీబీ కోర్టులో అధికారులు ఫైల్ చేశారు. ఈ రెండు ప్లాట్ల విలువ రూ.2.44 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరో వైపు బినామీల ద్వారా పవర్ ప్రాజెక్టులోనూ మోహన్ నాయక్ పెట్టుబడులు పెట్టినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆ దిశగా వారు విచారిస్తున్నారు.

## ఎల్లంపల్లి నీళ్లను కూడా కాళేశ్వరం నీళ్లుగా చూపించారు

### ప్రభుత్వ విప్ సిహెచ్. విజయరమణారావు

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త:** ఎల్లంపల్లి నీళ్లను కూడా కాళేశ్వరం నీళ్లుగా చూపించారనీ, మానేరు గేట్లు ఎత్తితే ఆ నీళ్ల కూడా కాళేశ్వరం నీళ్లు అని చెపుకున్నారనీ ప్రభుత్వ విప్ సిహెచ్. విజయరమణారావు అన్నారు. సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం ప్రపంచం అంతా ఉందనీ దీన్ని కూడా రాజకీయాల కోసం ఉపయోగించుకోవడం సిగ్గుచేటనీ ఆరోపించారు. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాలనే కాళేశ్వరం నీళ్లు ముద్దాడితే హరీష్‌రావు ప్రతి నియోజకవర్గం వెళ్లి కాళేశ్వరం నీళ్లు ముద్దాడాయనీ చెప్పుకొన్నారని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ నాయకుల మోసకారి మాటలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారనీ హెచ్చరించారు. కాళేశ్వరం కోసం కెసిఆర్ తెచ్చిన అప్పులో మా ప్రభుత్వం 33,574 కోట్ల రూపాయలతో పాటు 417 కోట్ల రూపాయలను వడ్డీగా చెల్లించామనీ వివరించారు. కాళేశ్వరం నుంచి ఎత్తిపోసిన 74 టిఎంసిల కోసం నీళ్ల కోసం తొమ్మిది వేల కోట్ల విద్యుత్ ఛార్జీల కింద చెల్లించామనీ అన్నారు. తుమ్మిడిహట్టి దగ్గర బ్యారేజీ కడితే ఇందులో సగం బిల్లు కూడా వచ్చేది కాదనీ అన్నారు. గతంలో కూడా వర్షాలు రాలేదు, నీళ్ల రాలేదని ఎల్ ఎండీ కి వెళ్లి బిఆర్ఎస్ నాయకులు ఫోటోలు దిగారనీ గుర్తుచేశారు. వర్షాలు పడొద్దు, పంటలు పడొద్దు వెళ్లి మేం ఏడవాలన్నదే బిఆర్ఎస్ నాయకుల ఆలోచనని ఆరోపించారు.. రైతులు పూర్తి గా నాశనం కావాలన్నదే బిఆర్ఎస్ నేతల కోరిక ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ప్రభుత్వం అవగాహన కల్పిస్తోందనీ రైతులను రెచ్చగొట్టాలన్నదే బిఆర్ఎస్ ప్రయత్నం చేస్తోందని అన్నారు.. బిఆర్ఎస్ నాయకుల రెచ్చగొట్టే ప్రసంగాలను రైతులను నమ్మరనీ ధీమా వ్యక్తంచేశారు.. కాళేశ్వరంతో సంబంధం లేకుండా గత రెండున్నర యేళ్ల నుంచి పంటలు పండుతున్నాయనీ తెలిపారు. మహారాష్ట్రలో మంచి వర్షాలు పడుతున్నాయనీనీళ్లు వస్తాయనీ జోస్యంచెప్పారు. మా ప్రభుత్వం రైతు ప్రభుత్వం రైతుల కోసం మా ప్రభుత్వం బతుకుతోందనీ అన్నారు. 9 రోజుల్లోనే 9 వేల కోట్ల రైతు భరోసా ఇచ్చామనీ అన్నారు. రైతు భరోసా ఇవ్వడం బిఆర్ఎస్ కు ఇష్టం లేదనీ ఆరోపించారు. . కాంగ్రెస్ హయాంలో కట్టిన నాగార్జున సాగర్, శ్రీశైలం, జూరాల, ఎల్లంపల్లి, మిడ్ మానేరు లాంటి ప్రాజెక్టులు ఇప్పటికి చెక్కు చెదరలేదు. ప్రాజెక్టులపైన మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ కు లేదనీ అన్నారు. ప్రాణహిత కు వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే ప్రాణం పోశారనీ 2012లో కాంగ్రెస్ సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి 148 మీటర్ల ఎత్తులో బ్యారేజి నిర్మాణంకు మహారాష్ట్ర సిఎంతో అంగీకరింప చేశారనీ చరిత్రను గుర్తుచేశారు. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించి 16 లక్షల నలభై వేల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలని 38 వేల కోట్లతో డిపిఆర్ తయారు చేశారు. ఈ బ్యారేజి కోసం రూ.5523 కోట్ల రూపాయలను ఉమ్మడి రాష్ట్రంలోనే ఖర్చు చేశారు.

## మహిళలకు ఫెర్టిలైజర్ లైసెన్సులు

### యూరియా యాప్‌పై శిక్షణ

### సర్కార్ కీలక నిర్ణయం

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త :** ఫెర్టిలైజర్స్ లైసెన్సులకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మహిళా సంఘాలకు ఎరువుల పంపిణీ బాధ్యతలను అప్పగించనుంది. వ్యవసాయ శాఖ అధికారవర్గాల వివరాలు ప్రకారం రైతులకు ఎరువులు సరఫరా చేసే బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించనుంది. ఈ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో చురుగ్గా ఉన్న మహిళా సంఘాలను గుర్తించనుంది. వీరికి ఫెర్టిలైజర్ లైసెన్సులు అందించనుంది. రాష్ట్రంలో దాదాపు 4.67 లక్షల మహిళా సంఘాలు ఉన్నాయి. వీరిలో కొంతమందిని ఎంపిక చేసిన లైసెన్స్ అందించనున్నారు. అలాగే వీరికి యూరియా యాప్ వినియోగంపై ట్రైనింగ్ కూడా ఇవ్వనున్నారు. ఇందుకు అనుగుణంగా మహిళా సంఘాల కోసం 8,126 సొంత భవనాలను నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ కేంద్రాల్లోనే ఎరువులు నిల్వ చేసుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు. రాష్ట్రంలో ప్రతీ ఏటా 40 లక్షల టన్నుల ఎరువులు రైతులకు సరఫరా అవుతున్నాయి. వ్యవసాయ సహకార సంఘాలతో పాటు, ప్రైవేట్ ఎరువు దుకాణాల ద్వారా రైతులు తీసుకుంటున్నారు. మహిళా సంఘాలకు ఈ బాధ్యతలను అప్పగించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. దీని వల్ల రైతులు తమ గ్రామంలోనే ఎరువులు కొనుగోలు చేయవచ్చు. ఇందుకోసం పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఒక్కో గ్రామంలో 5 నుంచి 10 వరకు మహిళా సంఘాలు ఉన్నాయి. వీరిలో ఆసక్తిగల సంఘాలను అధికారులు ఎంపిక చేయనున్నారు. వీరికి ఎరువులను విక్రయించే బాధ్యతలను అప్పగించనున్నారు. దీని వల్ల రైతులతో పాటు మహిళా సంఘాలకు కూడా ప్రయోజనం చేకూరనుంది. ఈ కార్యక్రమం అమలు కోసం ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులతో పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు సమావేశమయ్యారు. మొదటి విడతలో ప్రయోగాత్మకంగా కొన్ని జిల్లాల్లో అమలు చేశారు. అనంతరం అక్కడ వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను బట్టి అన్ని జిల్లాల్లో అమలు చేస్తారు.

## రెండోరోజు ప్రశాంతంగా సిపిగెట్ పరీక్షలు

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న టీజీ సీపీజీఈటీ-2026 ఆన్‌లైన్ (కంప్యూటర్ ఆధారిత) ప్రవేశ పరీక్షలు రెండో రోజు(గురువారం) ప్రశాంతంగా జరిగినట్టు కన్వీనర్ ప్రొఫెసర్ రాజేందర్ కట్ల తెలిపారు. గురువారం నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో ఉదయం సెషన్‌లో ఎం.ఏ. ఎకనామిక్స్ కోర్సుకు 1,384 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా వారిలో 1,143 మంది పరీక్షలకు హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం సెషన్‌లో ఎం.ఏ. తెలుగు కోర్సుకు 2,946 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా అందులో 2,486 మంది హాజరయ్యారు. సాయంత్రం సెషన్‌లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 1,233 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా వారిలో 1,048 మంది పరీక్షకు హాజరైనట్లు ఆయన తెలిపారు. పరీక్షల నిర్వహణలో భాగంగా కాకతీయ విశ్వవిద్యాలయ అధికారులు, పరీక్షల నిర్వహణ తీరు, అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలు, కేంద్రాల్లో అమలు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు.

# బ్యాంకుల్లో నగదు కొరత

### రూ.20 వేల వరకూ మాత్రమే అనుమతి

### చుక్కలు చూపిస్తున్న సిబ్బంది

### రైతులు, సామాన్యులకు క్యాష్ కష్టాలు

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని బ్యాంకుల్లో నగదుకు తీవ్ర కొరత ఏర్పడింది. దీంతో సామాన్యులు ముఖ్యంగా రైతులు తిప్పలు పడుతున్నారు. బ్యాంకు అకౌంట్లలో లక్షల రూపాయలు ఉన్నప్పటికీ పైసలు తీసుకోలేక పరేషాన్ అవుతున్నారు. ప్రస్తుతం వానాకాలం పంటల సాగు సీజన్ కావడంతో దుక్కులు, విత్తనాలు, ఎరువులు, ఇతర పెట్టుబడులకు రైతులకు డబ్బుల అవసరం ఏర్పడింది. ఇటీవలే పత్తి, వడ్ల పైసలు రైతుల అకౌంట్లలో జమయ్యాయి. అలాగే రైతు భరోసా పైసలు పడ్డాయి. ఇదే సమయంలో పంట రుణాలు కూడా మంజూరవుతున్నాయి. ఖరీఫ్ సాగుకు ఆ డబ్బులు డ్రా చేసుకుందామని బ్యాంకులకు వెళ్లిన రైతులకు అక్కడి సిబ్బంది చుక్కలు చేపిస్తున్నారు. కొన్ని చోట్ల రోజుకు రోజుకు రూ.10 వేలు, రూ.20 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు.

రూ.లక్ష కావాలంటే నాలుగైదు రోజులు పనీపాటా పక్కనపెట్టి బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. యూపీఐ, ఆన్లైన్ చెల్లింపులు మరింత పెంచడానికి బ్యాంకులు క్యాష్ లిమిట్ పాటించాలంటూ ఆర్బీఐ నుంచి వచ్చిన ఆదేశాలే ఇందుకు కారణం. దీంతో బ్యాంకులు నగదు విత్‌డ్రా విషయంలో ఆంక్షలు అమలు చేస్తున్నాయి.

చాలామంది రైతులు, పెన్షనర్లు, నిరక్షరాస్యుల దగ్గర స్మార్ట్ ఫోన్లు లేవు. ఫోన్ పే, గూగుల్ పే వంటివి ఉపయోగించడం రాదు. అది తెలిసిన వాళ్ల సాయం తీసుకుందామంటే ఎవరిని నమ్మాలో అర్థంకాని పరిస్థితి. కొన్ని బ్యాంకుల్లో రోజుకు రూ.10 వేలు, రూ.20 వేలు మాత్రమే విత్ డ్రాకు అనుమతిస్తుండగా, మరికొన్ని బ్యాంకుల్లో రూ.50 వేల వరకు ఇస్తున్నారు. రూ.లక్ష క్యాష్ కావాలంటే ముందురోజు బ్యాంకుకు వెళ్లి అధికారులను బతిమాలుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇక రూ.లక్ష పైన అవసరమైతే అంత డబ్బు లేదంటూ చేతులెత్తేస్తున్నారు. ఎవరికైతే పైసలు ఇవ్వాలో వారి అకౌంట్‌కు ఆన్లైన్ ట్రాన్సాక్షన్ చేయాలని సూచిస్తున్నారు. ఫలితంగా మార్కెట్లో క్యాష్ ఫ్లో తగ్గిపోతున్నది. మరోవైపు చాలా చోట్ల నగదు లేక ఏటీఎంలు బోసిపోతున్నాయి. డబ్బులు డ్రా చేయడానికి ప్రయత్నిస్తే నో క్యాష్ అని చూపకుండా ట్రాన్సాక్షన్ డిక్లైన్డ్ అని చూపిస్తున్నాయి.

అయితే ఈ విధంగా రైతులు, చిరువ్యాపారులు, పెన్షనర్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్న బ్యాంకర్లు లీడర్లు, రియల్టర్లు, ఆఫీసర్లు, బడా వ్యాపారులకు మాత్రం ఎంతంటే అంత నగదు చెల్లిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## హరీశ్‌రావు అంత నిష్ణాతుడైతే.. కెసిఆర్ ఎందుకు తీసేశారు?

### మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కౌంటర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 9:** సాగునీటి రంగంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చేసిన విమర్శలపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘాటుగా స్పందించారు. గురువారం సచివాలయంలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... హరీశ్ రావుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇరిగేషన్‌లో హరీశ్ రావు ఏదో పెద్ద నిష్ణాతుడైనట్లు మాట్లాడుతున్నారని మంత్రి ఉత్తమ్ ఎద్దేవా చేశారు. "హరీశ్ రావుకు అంత సత్తా ఉంటే, గత ప్రభుత్వంలో ఆయన మామ కేసీఆర్ ఆయనను ఆ శాఖ నుంచి ఎందుకు తొలగించారు? హరీశ్ రావు పనితీరుపై నమ్మకం లేకనే కేసీఆర్ ఆయనను రాత్రికి రాత్రే నీటి పారుదల శాఖ నుంచి తీసేశారు' అని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లడమే లక్ష్యంగా హరీశ్ రావు ప్రెజెంటేషన్లు ఇస్తున్నారని, ఆయన చూపించిన అబద్ధపు గణాంకాలకు తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. హరీశ్ రావు చేసిన ప్రతి విమర్శకు సరైన సమయంలో, ఆధారాలతో సహా పూర్తి సమాధానం చెబుతామని మంత్రి స్పష్టం చేశారు.

## అత్యున్నత విద్యాప్రమాణాల నిలయంగా తెలంగాణ: సిఎం రేవంత్‌రెడ్డి ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 9:** తెలంగాణను అత్యున్నత విద్యా ప్రమాణాల నిలయంగా మార్చాలన్న ప్రజా ప్రభుత్వ ఆకాంక్ష నెరవేరుతోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉపాధ్యాయ నియామకాల నుంచి మౌలిక సదుపాయాల కల్పన వరకు రాజీ పడని ప్రజా ప్రభుత్వ పని తీరుకు కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన ఈ ఫలితాలే నిదర్శనమని వెల్లడించారు. విద్యా వ్యవస్థలో ఈ గణనీయమైన పురోగతికి కారణమైన ఉపాధ్యాయులు, అన్ని స్థాయిల అధికారులకు నా ప్రత్యేక అభినందనలు. దేశానికే ఆదర్శమైన విద్యా వ్యవస్థ నిర్మాణం దిశగా మన ప్రయత్నాన్ని కొనసాగిద్దాం అని గురువారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

## పొలం వద్ద నిద్రిస్తున్న యువకుడి దారుణహత్య

**మల్దకల్, జులై 9, ప్రభాతవార్త:** మల్దకల్ మండలం ఉలిగేపల్లిలో గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. పొలం వద్ద నిద్రిస్తున్న బోయ మహేష్ (22) అనే యువకుడు బుధవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. హత్యకు గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# రాష్ట్రంలో తగ్గనున్న వర్షపాతం

### అక్కడక్కడా తేలిక పాటి వర్షాలు

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రుతుపవన కార్యకలాపాలలో మార్పు వచ్చిందని, రాబోయే వారంలో పరిమిత వర్షపాతం ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) అంచనా వేసింది. ఇందులో భాగంగా తెలంగాణలో వర్షపాతం తగ్గుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ నెల 15వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా వర్షపాతం తగ్గుతుందని, అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు మాత్రమే కురుస్తాయని ఐఎమ్‌డి వెల్లడించింది. ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు, మేఘావృతమైన ఆకాశం కొనసాగే అవకాశం ఉంది. అయితే, పూర్తిగా పొడి వాతావరణం కాకుండా, జూలై 15 వరకు జిల్లాల్లోని అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. వర్షపాతం తగ్గే సూచనలు ఉన్నప్పటికీ, మొత్తం వాతావరణం మేఘావృతమై, బలమైన గాలులతో కూడి ఉంటుంది. జూలై 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా గాలులతో కూడిన పరిస్థితులు కొనసాగే అవకాశం ఉన్నందున, హైదరాబాద్ ఐఎమ్‌డి కూడా ఒక ప్రత్యేక హెచ్చరికను జారీ చేసింది.

గురువారం ఐఎమ్‌డి విడుదల చేసిన బులెటిన్ ప్రకారం, గత కొద్ది రోజులుగా వర్షాలకు కారణమైన వాతావరణ వ్యవస్థ తొలగిపోయింది. రాబోయే కొద్ది రోజుల్లో తెలంగాణలోని వాతావరణంపై దాని ప్రభావం ఉండే అవకాశం లేదు. ఈ మార్పు ఫలితంగా, జూలై 14 వరకు తెలంగాణ వ్యాప్తంగా అక్కడక్కడా చెదురుమదురుగా వర్షాలు లేదా ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని, జూలై 15న కొన్ని ప్రాంతాలలో వర్షపాతం స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది.

# వాతావరణ మార్పులను తట్టుకునే పంటలపై దృష్టి

### స్వల్పకాల వంగడాలకే ప్రాధాన్యత

### గణనీయంగా పెరిగిన విత్తన మార్పిడి

### ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త:** ఎల్‌నినో వల్ల ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు రైతులు వాతావరణ మార్పులను తట్టుకోగల పంటల సాగుపై దృష్టి పెట్టాలని క్రాప్స్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫర్ ది సెమీఆరిడ్ ట్రాపిక్స్ (ఇక్రిసాట్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ అన్నారు. హైదరాబాద్‌లోని ఐసీఆర్ఐఎస్ఏటీ ప్రాంగణంలో గురువారం జరిగిన ఇండియా సీడ్ ట్రేడ్ అండ్ ఇన్నోవేషన్ సమ్మిట్-2026 సందర్భం గా మాట్లాడుతూ, రుతుపవనాల సమయంలో ఎల్ నినో ప్రభావం వల్ల దేశంలో సాధారణ వర్షపాతం నమోదు కానందున, రైతులు వరి వంటి అధిక నీటి వినియోగం గల పంటలకు దూరంగా ఉండాలని సూచించారు. వీటికి ప్రత్యమ్నాయంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు పండించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కోవడానికి రైతులు స్వల్పకాలిక పంటలపై కూడా దృష్టి పెట్టాలన్నారు. ఈ పరిస్థితికి రైతులు అలవాటు పడటానికి కృషి విజ్ఞాన్ కేంద్రాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, విత్తన కంపెనీలు కీలక పాత్ర పోషించాలని అభిప్రాయపడ్డారు. అయితే, ఆలస్యమైన రుతుపవనాలను ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు ఒక ప్రణాళికను సిద్ధం చేశాయని ఆయన అన్నారు. అంతకుముందు, సదస్సు ప్రారంభ సమావేశంలో ప్రపంచ విత్తన వాణిజ్యం, ఆవిష్కరణలు మరియు సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించడంపై రైతులు, విత్తన కంపెనీల ప్రతినిధులు, ఇతర భాగస్వాములను ఉద్దేశించి డాక్టర్ పాఠక్ మాట్లాడుతూ, నాణ్యమైన విత్తనాలు, సారవంతమైన నేల అందుబాటులో ఉంటేనే దేశం, రైతులు అభివృద్ధి చెందుతారని అన్నారు. నాణ్యమైన విత్తనాలు అందుబాటులో లేకుండా హరిత విప్లవం సాధ్యమయ్యేది కాదని ఆయన అన్నారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద విత్తన కేంద్రమని పేర్కొంటూ, దేశంలో 17,000 మంది విత్తన సాగుదారులతో పాటు 550 నమోదిత విత్తన కంపెనీలు ఉన్నాయని తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా విత్తన మార్పిడి గణనీయంగా పెరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ డాక్టర్ వి. ప్రవీణ్ రావు, అసోసియేషన్ ఆఫ్ ఛాంబర్స్ ఆఫ్ ఇండస్ట్రీ ఇన్ ఇండియాకి చెందిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యవసాయ, అనుబంధ రంగాల మండలి ఛైర్మన్ వెంకట్రామ్ వసంతవాడ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ విలాస్ టోనాపి, అసోచామ్ డిప్యూటీ సెక్రటరీ జనరల్ డి.ఎస్. రాజోరా, విశ్రాంత ఐఏఎస్ అధికారి సునీల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఇ, ఎంటెక్, ఎంఆర్క్ రిజిస్ట్రేషన్లకు 16 వరకు అవకాశం

### 18న అర్హుల జాబితా ప్రకటన

### 19 నుంచి 21 వరకు వెబ్ ఆప్షన్లు

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త:** ఇంజనీరింగ్ పీజీ కోర్సులైన ఎంఈ, ఎంటెక్, ఎం ఆర్క్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే కౌన్సెలింగ్‌లో భాగంగా రిజిస్ట్రేషన్ల కోసం ఈ నెల 16 వరకు గడువును పొడిగించారు. ఈ నెల 2 నుంచి 9 వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించగా.. దానిని కాస్త ఈ నెల 16 వరకు పొడిగించినట్టు అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారి జాబితాను ఈ నెల 18న ప్రకటించనున్నారు. అర్హులైన వారు ఈ నెల 19 నుంచి 21 వరకు వెబ్ ఆప్షన్లను ఇవ్వడానికి అవకాశం కల్పించారు. ఈ నెల 22న వెబ్ ఆప్షన్లకు ఎడిట్ సౌకర్యం కల్పించారు. ఈ నెల 26న ఫేజ్-1 సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 27 నుంచి 30 వరకు ఆయా కాలేజీల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో చేరాల్సి ఉంటుందని కన్వీనర్ పాండురంగారెడ్డి ప్రకటనలో తెలిపారు.

# మన్ననూర్ పిటిజి గురుకులంలో ఫుడ్‌పాయిజన్

### 26 మంది విద్యార్థులకు అస్వస్థత

### అచ్చంపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స

### నిలకడగా విద్యార్థుల ఆరోగ్యం

**అచ్చంపేట, జులై 9, ప్రభాతవార్త:** అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో ప్రభుత్వ గిరిజన పిటిజి బాలుర గురుకుల పాఠశాలలో గురువారం ఉదయం అల్పాహారం తీసుకున్న కొద్దిసేపటికి ఫుడ్ ఫాయిజన్ తో 26 మంది విద్యార్థులకు అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి వెంటనే స్పందించి 108 కి ఫోన్ చేసి హుటాహుటిన అచ్చంపేట ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. ఆసుపత్రికి చేరుకున్న వెంటనే డాక్టర్లు విద్యార్థులకు చికిత్స అందించారు. విద్యార్థులతో మాట్లాడగా హాస్టల్లో ఉదయం అల్పాహారం కిచిడీ వడ్డించారని తిన్న వెంటనే వాంతులు కడుపు నొప్పి అని తెలిపారు. రోజు అన్నంలో పురుగులు వస్తున్నాయని చెప్పిన పట్టించుకోరని ఏం కాదు తిను అని చెప్తారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల్లో నాణ్యమైన భోజనం వడ్డిస్తున్నాం అని ఒక పక్క చెపుతుంది. ఇప్పటికీ ఇలాంటి సంఘటనలు జరుగుతున్న సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. త్రాగు నీటి ట్యాంకులు నెలలకొద్ది శుభ్రం చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విషయం తెలుసుకున్న అధికారులు జిల్లా అదనపు కలెక్టర్ దేవసాయం, అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, డీఎస్పీ పల్లె శ్రీనివాసులు ఆసుపత్రికి చేరుకొని విద్యార్థులను పలకరించారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న చికిత్స గురించి డాక్టర్లను తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా



విద్యార్థులను పరామర్శిస్తున్న అధికారులు

చూసుకోవాలని వార్డెన్ గీత, ప్రిన్సిపాల్ ను హెచ్చరించారు. ఫుడ్ పాయిజన్ పై డాక్టర్లను వివరణ కోరగా నీటి కలుషితమా ఫుడ్ కలిషితమా తెలియదని రిపోర్టు వచ్చిన అనంతరం స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేదని చికిత్స అనంతరం పంపించడం జరుగుతుందని తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ విషయం తెలుసుకుని వీడియో కాల్ లో డాక్టర్లకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు అదేవిధంగా ప్రతి విద్యార్థితో మాట్లాడడం జరిగింది. విద్యార్థి సంఘాల నేతలు ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వ ప్రతినిధులు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఘటనకు బాధ్యులైన వార్డెన్ పై చర్యలు తీసుకోవాలని సూచించారు.


## బొగ్గు గ్యాసిఫికేషన్ కోసం టెండర్ల ఆహ్వానం

### సెప్టెంబర్ 7 దరఖాస్తు గడువు ముగింపు

### రూ.37 వేల కోట్ల పథకానికి బొగ్గు మంత్రిత్వ శాఖ శ్రీకారం

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త:** ఉపరితల బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహం కోసం కేంద్రం దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు దీనికి సంబంధించి గురువారం కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దరఖాస్తులను సమర్పించడానికి సెప్టెంబర్ 7 చివరి తేదీగా పేర్కొంది. బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహం కోసం ఉద్దేశించిన రూ.37,500 కోట్ల ఆర్థిక వ్యయంతో దరఖాస్తులను కోరుతోంది. ఈ పథకానికి గాను కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మే 13న ఆమోదించింది. తదుపరి ఈ పథకానికి ఆమోదం లభించిన అనంతరం, జూన్ 25 న దీనికి సంబంధించి మార్గదర్శకాలను జారీ చేయడం జరిగింది. ఈ పథకం ఉపరితల బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను ప్రోత్సహించడం ద్వారా విలువ జోడింపును పెంచడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, ఇంధన, రసాయన రంగాలలో అధిక స్వావలంబన సాధించాలన్న భారతదేశ దార్శనికతకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా చేపట్టిన ఒక ప్రధాన కార్యక్రమంగా బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఆ తర్వాత , అర్హులైన దరఖాస్తుదారులను ప్రతిపాదనలు సమర్పించమని ఆహ్వానించింది. కాగా భాగస్వాముల భాగస్వామ్యాన్ని సులభతరం చేయడానికి, పథకం నిబంధనలు, దరఖాస్తు ప్రక్రియపై స్పష్టతను అందించడానికి, మంత్రిత్వ శాఖ ఈ నెల 20 న సమావేశాన్ని నిర్వహించనుంది. ఈ పథకం దరఖాస్తుదారులు, ఇతర భాగస్వాములు ఈ సమావేశంలో పాల్గొని, స్పష్టత కోసం తమ సందేహాలను సమర్పించవలసిందిగా కోరడమైనది.

## గగన్‌యాన్ పారాచూట్ పరీక్ష విజయవంతం



**భోపాల్, జులై 9:** ఇస్రో గగనయాన్ మిషన్‌లో ముఖ్యమైన ఇంటిగ్రేటెడ్ మెయిన్ పారాచూట్ ఎయిర్‌డ్రాప్ టెస్ట్‌ను విజయవంతంగా నిర్వహించింది. మధ్య ప్రదేశ్‌లోని షియోపూర్‌లో ఉన్న ఏరియల్ డెలివరీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ డ్రాప్ జోన్‌లో ఈ పరీక్షను చేపట్టినట్లు ఇస్రో వెల్లడించింది. గగనయాన్ తొలి మానవరహిత జీ1 (బి1) మిషన్‌లో ఎదురయ్యే గరిష్ట భారం పరిస్థితుల్లో ప్రధాన పారాచూట్ నిర్మాణ దృఢత్వం, రూపకల్పన సామర్థ్యాన్ని నిర్ధారించడమే ఈ పరీక్ష ప్రధాన ఉద్దేశ్యమని ఇస్రో తెలిపింది. గగనయాన్ మిషన్‌కు అవసరమైన కీలక ప్రధాన పారాచూట్ వ్యవస్థను అర్హత నిర్ధారించేందుకు నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ మెయిన్ పారాచూట్ ఎయిర్‌డ్రాప్ టెస్ట్‌ల శ్రేణిలో ఇది ఐదో పరీక్ష అని పేర్కొంది. ఐమ్యాట్05 విజయవంతం కావడంతో తొలి మానవరహిత గగనయాన్ మిషన్ (బి1) కోసం ప్రధాన పారాచూట్ వ్యవస్థ పనితీరు, విశ్వసనీయతపై పూర్తి స్థాయి నమ్మకం ఏర్పడిందని ఇస్రో వెల్లడించింది.

## ఇ20 పెట్రోల్‌తో ఒక్క కారైనా పాడైందా?



**న్యూఢిల్లీ, జులై 9:** ఇ20 పెట్రోల్ వల్ల వాహనాల ఇంజన్లు పాడైపోతున్నాయని మైలేజ్ పడిపోతోందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తీవ్రంగా ఖండించారు. ఇదంతా ప్రణాళికా ప్రకారం జరుగుతున్న దుష్ప్రచారమని ఆయన కొట్టిపారేశారు. ఈ20 పెట్రోల్ ను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావడా నికి ముందు పుణెలోని ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ప్రముఖ వాహన తయారీ సంస్థలు అన్ని రకాల పరీక్షలు నిర్వహించాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. అన్ని అనుమతులు వచ్చాకే దీనిని అమలు చేశామని తెలిపారు. కొన్ని వాహనాల్లో సమస్యలు వచ్చినట్లు తేలడంతో కంపెనీలతో విచారణ జరిపించామని, అందులో ఈ20 పెట్రోల్ వాడటం వల్ల కాకుండా కల్తీ ఇంధనం వల్లే సమస్యలు వచ్చినట్లు తేలిందని మంత్రి చెప్పుకొచ్చారు. ఈ20 పెట్రోల్ వల్ల ఇప్పటివరకు ఓ ఒక్క వాహనం కూడా పాడవ్వలేదని ఆయన స్పష్టం చేశారు. పాత వాహనాల్లోని కొన్ని చిన్న విడిభాగాలపై స్వల్ప ప్రభావం పడే అవకాశం ఉందని అందువల్ల సర్వీసింగ్ సమయంలో వాటి స్థానంలో రబ్బర్ వాషర్లను ఎలాంటి అదనపు రుసుము లేకుండా ఉచితంగా మార్చాలని వాహన కంపెనీలను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

## బిఎస్ఎన్ఎల్ శాటిలైట్ ఫోన్ వచ్చేసింది!




**న్యూఢిల్లీ, జులై 9:** ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బిఎస్ఎన్ఎల్ శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలను విస్తరించే క్రమంలో రూ.1.34 లక్షల ధరతో శాటిలైట్ ఫోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అన్ని పన్నులతో కలిపి ఈ హ్యాండ్‌సెట్ ధర రూ.1,34,166గా నిర్ణయించింది. సాధారణ మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో లేని ప్రాంతాల్లో వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్ సేవలు అందించేందుకు ఈ ఫోన్ ఉపయోగపడుతుందని బిఎస్ఎన్ఎల్ తెలిపింది. రక్షణ, సముద్ర రవాణా, విపత్తు నిర్వహణ, గనుల ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల్లో కార్యకలాపాలు, అడ్వెంచర్ ట్రావెల్ వంటి అవసరాలకు ఇది అనుకూలమని పేర్కొంది. శాటిలైట్ ఫోన్ సేవలు పొందాలనుకునే వారు సమీప బిఎస్ఎన్ఎల్ కార్యాలయాన్ని సంప్రదించాలని సంస్థ సూచించింది.

## రైల్వే ప్లాట్‌ఫామ్‌పై కూలిన వందేళ్ల క్లాక్‌టవర్




**కోజికోడ్, జులై 9:** కేరళలో అత్యంత రద్దీగా ఉండే కోజికోడ్ రైల్వే స్టేషన్లో అనూహ్య ఘటన చోటు చేసుకుంది. 100 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన ఓ క్లాక్ టవర్ హఠాత్తుగా కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ప్రయాణికులు ఎవరూ అక్కడ లేరని, ఆ క్షణంలో ప్లాట్ఫామ్ ఖాళీగా ఉండటం వల్ల ప్రమాదం తృటిలో తప్పిందని రైల్వే పోలీస్ అధికారులు వెల్లడించారు.

## విమానం గాల్లో ఉండగానే దూకేసిన ఇన్‌స్ట్రక్టర్



**బ్యూనస్ ఏరీస్, జులై 9:** విమానం గాల్లో ఎగురుతుండగానే ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్ దానిలో నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి నుంచి ట్రైనింగ్ తీసుకుంటున్న విద్యార్థికి క్యారీ ఆన్ అని చెప్పి మరీ అతడు దూకేశాడు. అర్జెంటీనాలోని టొలెడోలో జరిగిన ఈ అనూహ్య ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫ్లయింగ్ ప్యారెట్ కార్డోబా ఫ్లయింగ్ స్కూల్‌లో ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్న లియాండ్రో ఆండ్రెస్ ఓ విద్యార్థికి ట్రైనింగ్ ఇస్తున్న సమయంలో అకస్మాత్తుగా విమానం నుంచి దూకేశారు. ఏం చేయాలో నీకు తెలుసు. ఆ ప్రకారమే నడుచుకో అంటూ ఇన్‌స్ట్రక్టర్ తన హెడ్‌సెట్, సీట్‌బెల్ట్ తీస్తూ ఆ స్టూడెంట్‌కు చెప్పారు. ఇలా జరుగుతుందని ఏమాత్రం ఊహించని ఆ యువకుడు తొలుత కంగుతిన్నా తర్వాత విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేసి ప్రాణాలు దక్కించుకున్నాడు. కాగా ఇన్‌స్ట్రక్టర్ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు అతడి మరణానికి దారితీసిన కారణాలపై దర్యాప్తు జరుపుతున్నారు.





# చైనా-రష్యా వాణిజ్య మార్గం రైల్వే వంతెనపై అమెరికా వైమానిక దాడులు

**టెహ్రాన్, జులై 9:** మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు మరోసారి తీవ్రరూపం దాల్చాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై బుధవారం అర్ధరాత్రి అమెరికా జరిపిన వైమానిక దాడుల్లో చైనా, రష్యాలతో భూభాగం మీదుగా జరిగే వాణిజ్య రవాణాకు కీలకంగా ఉన్న రైల్వే వంతెనను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించినట్లు సమాచారం. ఇరాన్ ప్రభుత్వ అనుబంధ ఫార్స్ న్యూస్ ఏజెన్సీ కథనం ప్రకారం, గోలెస్తాన్ ప్రావిన్స్‌లోని అక్కాలా జిల్లాలో ఉన్న అక్ టెక్ ఖాన్ రైల్వే వంతెనపై అమెరికా క్షిపణులు దాడి చేశాయి. ఈ రైల్వే మార్గం చైనాకజకిస్థాన్-తుర్క్‌మెనిస్థాన్-ఇరాన్ దేశాలను అనుసంధానిస్తూ, చైనా, రష్యాతో ఇరాన్ భూ మార్గ వాణిజ్యానికి అత్యంత కీలకంగా ఉంది. ప్రస్తుతం యుద్ధ పరిస్థితుల కారణంగా సముద్ర, వైమానిక రవాణా భద్రతాపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ రైల్వే మార్గం ఇరాన్‌కు అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా చైనా, రష్యా వంటి ప్రధాన వాణిజ్య భాగస్వామ్య దేశాలతో సరకు రవాణా ఎక్కువగా ఈ మార్గం ద్వారానే జరుగుతోంది. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కూడా ఈ రైల్వే వంతెనపై దాడి జరిగిన విషయాన్ని ధ్రువీకరించింది. దాడిలో వంతెనకు నష్టం వాటిల్లిందని, అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని వెల్లడించింది.

### మళ్లీ అమెరికా- ఇరాన్ మధ్య ఎదురుదాడులు

మంగళవారం హోర్ముజ్ జలసంధిలో పలు నౌకలను ఇరాన్ లక్ష్యంగా చేసుకోవడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. దీనికి ప్రతిగా అమెరికా గురువారం తెల్లవారుజామున ఇరాన్‌పై మరోసారి వైమానిక దాడులు చేపట్టింది. దీనికి ప్రతిస్పందనగా ఇరాన్ అమెరికా మిత్రదేశాలపై క్షిపణి దాడులు జరపడంతో ప్రాంతీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన 60 రోజుల తాత్కాలిక అవగాహన ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ, వరుస ఎదురుదాడులు ఆ ఒప్పందం భవితవ్యంపై అనిశ్చితిని నెలకొల్పుతున్నాయి. గురువారం జరిగిన దాడుల సమయంలో అమెరికా ఐదో నౌకాదళ ప్రధాన కేంద్రం ఉన్న బహ్రెయిన్‌లో కనీసం మూడు సార్లు సైరన్లు మోగాయి. కువైట్, ఖతార్ వైపు కూడా క్షిపణులు దూసుకెళ్లినట్లు సమాచారం. జోర్డాన్‌లో కూడా హెచ్చరిక సైరన్లు మోగగా, అక్కడ అమెరికా సైనిక బలగాలు, యుద్ధ విమానాలు మోహరించి ఉన్నాయి. ఇరాన్‌లోని ఏకైక అణు విద్యుత్ కేంద్రం పరిసర ప్రాంతాలపై కూడా అమెరికా వైమానిక దాడులు జరిగినట్లు ఓ ఇరాన్ అధికారి ఆరోపించారు. దేశంలోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా పేలుళ్లు సంభవించినట్లు వార్తలు వెలువడ్డాయి.

### ట్రంప్ వ్యాఖ్యల అనంతరమే అమెరికా దాడులు

హార్ముజ్ జలసంధిలో నౌకలపై ఇరాన్ దాడులు తాత్కాలిక కాల్పుల విరమణకు ముగింపు పలికినట్లేనని, అవి కొనసాగితే ఘర్షణ మరింత విస్తరిస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన కొద్ది గంటల్లోనే తాజా వైమానిక దాడులు చోటుచేసుకున్నాయి. ఈ పరిణామాలు ప్రపంచ ఇంధన సరఫరాలకు కీలకమైన హోర్ముజ్ జలసంధిలో రవాణాపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని అంతర్జాతీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, రెండు రోజులుగా కొనసాగుతున్న అమెరికా వైమానిక దాడుల్లో కనీసం 14 మంది మరణించగా, మరో 78 మంది గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది సైనికులేనని అధికారులు తెలిపారు. కువైట్ సైన్యం మూడు బాలిస్టిక్ క్షిపణులు, ఒక క్రూయిజ్ క్షిపణి, పది డ్రోన్లను కూల్చివేసినట్లు వెల్లడించింది. ఈ ఘటనలో క్షిపణి శకలాలు పడటంతో ఒక వ్యక్తి గాయపడ్డాడు. బహ్రెయిన్ కూడా తమ వైపు వచ్చిన క్షిపణులను అడ్డుకున్నట్లు ప్రకటించింది. ఖతార్‌లో నష్టంపై తక్షణ సమాచారం అందలేదు. జోర్డాన్ ప్రభుత్వం మాత్రం ఇరాన్ నుంచి వచ్చిన అన్ని క్షిపణులను తమ వైమానిక రక్షణ వ్యవస్థ విజయవంతంగా అడ్డుకుందని వెల్లడించింది.

# ఇరాన్‌పై అమెరికా భీకర దాడులు

## చాబహార్, కోనారక్, బందర్‌అబ్బాస్ ప్రాంతాల్లోను పేలుళ్లు.. ఎయిర్‌బేస్‌లపైనా దాడి

## కువైట్, బహ్రెయిన్‌ల్లోని యుఎస్ సైనిక కేంద్రాలపై ఇరాన్ ప్రతీకార దాడులు

**టెహ్రాన్, వాషింగ్టన్, జులై 9:** పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొంది. ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు తార స్థాయికి చేరాయి. ఇరాన్‌పై అమెరికా వరుసగా రెండో రోజూ వైమానిక దాడులు జరపగా, అందుకు ప్రతీకారంగా అమెరికా మిత్ర దేశాలైన బహ్రెయిన్, కువైట్, ఖతార్‌లను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణి దాడులకు దిగింది. దీంతో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవెల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) పాక్షికంగా వినియోగిస్తున్న ఇరాన్‌షహంలోని వైమానిక స్థావరంపై అమెరికా దళాలు దాడులు చేసినట్టు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ఓ చిత్రాన్ని, వీడియోను పంచుకున్నారు. ఇరాన్‌లోని బుషెర్ అణు విద్యుత్ కేంద్రం, నౌకాశ్రయ నగరాలైన చాబహార్, కోనారక్, బందర్ అబ్బాస్ వంటి పలు ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించినట్టు ఇరాన్ మీడియా వెల్లడించింది. ఈ దాడుల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన హెచ్చరికల తీవ్రతను మరింత పెంచారు. హార్మూజ్ జలసంధిలో ఇరాన్ నౌకలను లక్ష్యంగా చేసుకుంటే, తాము ఇరాన్ లక్ష్యాలను 20 రెట్లు గట్టిగా దెబ్బతీస్తామని ఆయన హెచ్చరించారు. మరోవైపు ఒప్పందం కోసం ఇరాన్ తమతో మాట్లాడాలని తీవ్రంగా ప్రయత్నిస్తోందని, కానీ వారిని నమ్మలేమని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ పౌర మౌలిక సదుపాయాలైన విద్యుత్ ప్లాంట్లు, చమురు ఉత్పత్తి కేంద్రాలపై దాడి చేస్తామంటూ గతంలో చేసిన హెచ్చరికలను ఆయన పునరుద్ఘాటించారు. ఏం జరిగినా చాలా వేగంగా జరుగుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

అమెరికా దాడులపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. దాడి చేస్తే ప్రతిదాడి తప్పదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘేర్ గలీబాఫ్ ఎక్స్ వేదికగా హెచ్చరించారు. మీరు దాడి చేస్తే, మీపై దాడి జరుగుతుంది. ఈ విషయం అమెరికా ఇంకా నేర్చుకోలేదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలు బలానికి నిదర్శనం కావని, బలప్రయోగ విధానం విఫలమైందనడానికి అవే నిదర్శనమని ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి కజెం ఘరీబాబాది అన్నారు. హంతకుడైన ట్రంప్‌కు బలప్రయోగ భాషలోనే సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చి కూడా స్పందిస్తూ, తమ దేశ ప్రజలను అవమానకర భాషలో దూషించడం వల్ల వారి గొప్పతనం తగ్గదని, తాము మాటలతో కాకుండా చేతలతోనే సమాధానమిస్తామని పేర్కొన్నారు. దీంతో ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు 8శాతం పెరిగాయి. ఈ పరిణామాలతో పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో శాంతికి పెను ప్రమాదం ముంచుకొచ్చింది.

### దౌత్యం, చర్చల ద్వారానే ఘర్షణలు పరిష్కారం: మోడీ



**మెల్‌బోర్న్, జులై 9:** పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ ఉద్రిక్తంగా మారింది. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులతో దద్దరిల్లుతోంది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న ప్రధాని నరేంద్రమోడీ పశ్చిమాసియాలో తాజా పరిస్థితులపై స్పందించారు. మెల్‌బోర్న్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న అన్ని ఘర్షణలు దౌత్యం, చర్చలు ద్వారానే పరిష్కారమవుతాయని పేర్కొన్నారు.

# నన్ను హతమార్చేందుకు ఇరాన్ కుట్ర

## టర్కీనుంచి ట్రంప్ తిరుగుప్రయాణం



**అంకారా, జులై 9:** పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు భారీ స్థాయిలో కమ్ముకున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో సంచలన ప్రకటనచేసారు. తనను హతమార్చడానికి ఇరాన్ కుట్ర పన్నిందని ప్రకటించారు. ఆ దేశం రూపొందించిన హిల్ లిస్ట్ లో అందరికంటే మొదట తన పేరే ఉందని తేల్చి చెప్పారు. ఇరాన్ రూపొందించిన హిట్ లిస్ట్‌లో తానే మొదటి స్థానంలో ఉన్నానని చెప్పుకొన్నారు. ఆ దేశాన్ని అన్ని విధాలా దిగ్బంధించానని, అందుకే తనను మట్టు బెట్టడానికి శాయశక్తులా ప్రయత్నాలు సాగిస్తోందని పేర్కొన్నారు. నాటో సదస్సు ముగించుకుని అంకారా నుంచి అమెరికాకు తిరుగు ప్రయాణమైన సమయంలో ఎయిర్ ఫోర్స్ వన్ లో మార్పులు చేశారు. ఇందులో ప్రయాణి స్తున్న విలేకరులకు విండో బ్లైండ్స్ పూర్తిగా మూసివేయాలని ఆదేశించారు. దీనికి గల కారణాలపై విలేకరులు ప్రశ్నించగా ఇరాన్‌ను ఉద్దేశించి ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అక్కడ ఉన్న కొందరి వల్లే ఈ రకమైన కఠిన జాగ్రత్తలు తీసుకోవాల్సి వచ్చిందని బదులిచ్చారు. తనకు నిరంతరం ప్రాణహాని పొంచి ఉందని, ఇరాన్ ప్రధాన శత్రువును తానేనని గుర్తు చేశారు. ఈ తిరుగు ప్రయాణంలో ట్రంప్ పాత మోడల్ ఎయిర్ ఫోర్స్ వన్ విమానాన్ని ఎంచుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

**భారత్ పాక్ యుద్ధం నేనే ఆపా:** ట్రంప్ మళ్లీ పాత పాటే పాడుతున్నారు. గతంలో తన చొరవవల్లే భారత్- పాకిస్థాన్ యుద్ధం ఆగిందంటూ గొప్పలు చెప్పుకొంటున్నారు. ఎయిర్ ఫోర్స్ వన్ లో ప్రయాణిస్తూ ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఏడాది మే నెలలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ సమయంలో 11 విమానాలు కూలిపోయినట్లు చెప్పారు. అయితే అవి భారత్‌వా, పాక్‌వా లేదంటే రెండు దేశాలకూ చెందినవా అన్నదానిపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. తన జోక్యంవల్లే ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది యుద్ధాలు ఆగాయని ట్రంప్ చెప్పారు.

# షిండేతో శరద్ పవార్ భేటీ

**మహారాష్ట్ర కొత్త రాజకీయ సమీకరణాలు**



**ముంబై, జులై 9:** ఎన్సీపి అధినేత శరద్ పవార్, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే మధ్య జరిగిన భేటీ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ సమావేశం నేపథ్యంలో మహారాష్ట్ర రాజకీయ వర్గాల్లో కొత్త ఊహాగానాలు చెలరేగుతు న్నాయి. మహారాష్ట్ర-కర్ణాటక సరిహద్దు వివాదంపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అధ్యక్షతన బుధవారం అసెంబ్లీలో నిర్వహిం చిన కీలక సమావేశానికి హాజరైన శరద్ పవార్ అనంతరం ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కార్యాలయానికి వెళ్లి ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆ సమయంలో కేబినెట్ సమావేశంలో ఉన్న షిండే, శరద్ పవార్ తన కార్యాలయంలో ఎదురుచూస్తున్నారని సమాచారం అందడం తో సమావేశాన్ని మధ్యలోనే ముగించి కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ శరద్ పవార్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికిన షిండే, సుమారు 15 నిమిషాల పాటు ఆయనతో చర్చించారు. అనంతరం శిండే అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే శరద్ పవార్ మాత్రం షిండే కార్యాలయం లోనే ఉండి, తన పార్టీ ఎమ్మెల్యేలతో ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో సమావేశం నిర్వహించడం మరింత ఆసక్తికరంగా మారిం ది. ఈ సమావేశంలో ఏం చర్చించారన్న విషయాన్ని ఇరువురు నేతలు వెల్లడించలేదు. శిండే కార్యాలయం మాత్రం దీనిని కేవలం మర్యాదపూర్వక భేటీగా పేర్కొంది. ఈ భేటీ జరిగిన సమయం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకోవడంతో రాష్ట్ర రాజకీయాల్లో విస్తృత చర్చకు కారణమైంది. ఇటీవల ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ)కు చెందిన ఆరుగురు లోక్‌సభ సభ్యులు ఏక్‌నాథ్ శిండే శిబిరంలో చేరిన నేపథ్యంలో కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్‌పి), శివసేన (యుబిటి)లతో కూడిన మహావికాస్ అఘాడీ కూటమిలో అంతర్గత విభేదాలు నెలకొన్నాయి. ఇలాంటి సున్నిత సమయంలో పవార్-శిండే భేటీ జరగడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (ఎస్‌పీ)లోని ఒక వర్గం ఎన్డీఏలో చేరేందుకు ఆసక్తి చూపుతోందన్న ప్రచారానికి కూడా ఈ సమావేశం మరింత ఊతమిచ్చింది. ఇదిలా ఉండగా, ఈ భేటీపై ఎంవిఎలోని భాగస్వామ్య పక్షం శివసేన (యుబిటి) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పార్టీ సీనియర్ నాయకుడు సంజయ్ రౌత్ మాట్లాడుతూ, శరద్ పవార్ షిండే కార్యాలయానికే వెళ్లాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. ఈ చర్య వల్ల ఎన్సీపి (ఎస్‌పి) విశ్వసనీయత దెబ్బతింటుందని ఆయన వ్యాఖ్యానించారు. ఏక్‌నాథ్ షిండేను 'ద్రోహి'గా అభివర్ణించిన రౌత్, ఆయనతో పవార్ సమావేశం కావడం ఎంవీఏ భాగస్వామ్య పార్టీలన్నింటినీ బాధించిందన్నారు. ఎంవిఎలోని అన్ని పార్టీలు షిండేకు దూరంగా ఉండాలని సూచించారు. శరద్ పవార్ రాజకీయంగా అత్యంత గౌరవనీయ నాయకుడని అంగీకరించిన రౌత్, మన ప్రభుత్వాన్ని కూల్చిన వ్యక్తి కార్యాలయంలో పార్టీ సమావేశం నిర్వహించడం పవార్ ప్రతిష్ఠను తగ్గించే చర్య. మహారాష్ట్ర రాజకీయాల్లో ఏక్‌నాథ్ శిండే ద్రోహం, అవినీతికి ప్రతీకగా మారారని విమర్శించారు.

## చైనా ఆర్థికవేత్త అనుమానాస్పద మృతి

**బీజింగ్, జులై 9:** చైనా జిడిపిని ప్రశ్నిస్తున్న ప్రముఖ ఆర్థికవేత్త గావో షాన్వెల్(55) అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయన అనారోగ్యంతో మరణించారని చైనా ప్రభుత్వ మీడియా వెల్లడించింది. ఈ మరణంపై మాత్రం అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గావో చైనా ప్రభుత్వ యాజమాన్యంలోని పెట్టుబడి సంస్థలో ప్రధాన ఆర్థికవేత్తగా పనిచేశారు. చైనా ఆర్థిక వ్యవస్థపై నిజాలు చెప్పే ఆర్థికవేత్తగా గావోకు పేరుంది. 2024లో వాషింగ్టన్‌లో గావో షాన్వెల్ చేసిన ప్రసంగం చైనాలో ప్రకంపనలు సృష్టించింది. గత రెండు మూడేళ్లుగా చైనా వాస్తవ జిడిపి వృద్ధిరేటు సగటున 2 శాతం మాత్రమే ఉందని, ప్రభుత్వం చెబుతున్న 5శాతం వాస్తవానికి దూరంగా ఉందని చెప్పారు.

**ట్రంప్‌కు ఫెడరల్ కోర్టు షాక్**

## రూ.48 కోట్ల పరిహారం చెల్లించాలని తీర్పు

**న్యూయార్క్, జులై 9:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. మాజీ జర్నలిస్ట్, రచయిత్రి ఈ. జీన్ కారోల్ పై లైంగిక వేధింపులు, పరువు నష్టం కలిగించిన కేసులో అమెరికా ఫెడరల్ కోర్టు డొనాల్డ్ ట్రంప్ కు మరోసారి షాక్ ఇచ్చింది. ట్రంప్ దోషిగా తేలిన ఈ కేసులో కారోల్‌కు రూ. 5.8 మిలియన్ల అంటే భారత కరెన్సీలో రూ.48 కోట్ల వరకు పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని న్యూయార్క్ ఫెడరల్ జడ్జి లూయూస్ ఏ కప్లాన్ ఆదేశించారు. ఈ తీర్పుపై ట్రంప్ చేసిన అప్పీలును విచారించడానికి గత వారం అమెరికా సుప్రీంకోర్టు నిరాకరించింది.

# ఆగస్టు 15లోపు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తాం

## హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం




**హైదరాబాద్, జులై 9 ప్రభాతవార్త:** విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు స్పష్టత నిచ్చింది. ఆగస్టు 15లోపు ఈ ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని హైకోర్టుకు తెలిపింది. బుధవారం జరిగిన విచారణను గురువారానికి వాయిదా వేయగా.. విచారణ సందర్భంగా ఆగస్టు 15లోపు ఈ ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని, ఈ ఏడాదికి సంబంధించిన కొత్త అడ్మిషన్ల ఫీజును కూడా చెల్లిస్తామని స్పష్టం చేసింది. అదేవిధంగా ఇప్పటికే అడ్మిషన్లు పొంది వివిధ కోర్సులు చదువుతున్న 2వ, 3వ, 4వ సంవత్సరం విద్యార్థుల ఫీజును కూడా చెల్లిస్తామని హైకోర్టుకి తెలిపింది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై హైకోర్టులో విచారణ సందర్భంగా ప్రభుత్వ ప్రతిపాదనను పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వ్యతిరేకించారు. కొన్నేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడం లేదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వాటికి సంబంధించిన బకాయిలు సుమారు రూ.10 వేల కోట్ల వరకు ఉంటాయన్నారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు 2023 నుంచి ఉన్నాయని, ఆ బకాయిలను వెంటనే చెల్లించాలని కళాశాలల యాజమాన్యాల తరపు న్యాయవాది కోరారు. అవి చెల్లించిన తరువాత కొంత గడువుతో మిగతా బకాయిలు చెల్లించేలా చూడాలని హైకోర్టును కోరారు. గత విచారణలో జీవో9లో నాలుగు నిబంధనలపై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో అందులో కొన్ని నిబంధలపై స్టే ఎత్తివేయాలని ప్రభుత్వం హైకోర్టుకు విజ్ఞప్తి చేసింది. స్టే వల్ల కొత్తగా చేరిన విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కోర్టు దృష్టికి తీసుకువెళ్లింది.

నేడు(శుక్రవారం) ఇంజనీరింగ్ విద్యార్థులకి సంబంధించిన సీట్ల కేటాయింపు జరగనుండగా వారు ఈ నెల 14 వరకు కాలేజీల్లో చేరడానికి అవకాశం కల్పించారు. ఈ ప్రక్రియకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉంటుందని అందుకే గతంలో విధించిన స్టేను ఎత్తేయాలని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును అభ్యర్థించింది. దీర్ఘకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకపోవడంతోపాటు, ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఫీజులను విద్యార్థుల అకౌంట్లలో వేస్తామంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను సవాలు చేస్తూ పలు కళాశాలలు పిటిషన్‌లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఆ పిటిషనపై విచారణ చేపట్టిన హైకోర్టు విద్యార్థుల నుంచి కళాశాలలు ఫీజులు వసూలు చేసుకోవచ్చంటూ జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను తొలగించాలని కోరుతూ ప్రభుత్వం పిటిషన్‌ను దాఖలు చేసింది. వాటిపై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి బుధవారం విచారణ చేపట్టగా.. కొనసాగింపుగా గురువారం కూడా విచారణ జరిపారు. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది శ్రీరఘురాం వాదనలు వినిపిస్తూ.. ఇంజనీరింగ్ అడ్మిషన్లు నేటి(శుక్రవారం) నుంచి ప్రారంభం కానున్నాయని, ఫీజు చెల్లించనట్లయితే అడ్మిషన్‌లను కాలేజీలు నిరాకరిస్తున్నాయని హైకోర్టుకు వివరించారు. కోర్టు మధ్యంతర ఉత్తర్వుల కారణంగా విద్యార్థులు ఫీజులు చెల్లించలేక నష్టపోయే ప్రమాదం ఉందని వాదనలు వినిపించారు.

# గోల్డ్ తీసుకుని వదిలేయండి అన్నా.. వదల్లేదు!

● బెంగళూరు మైసూర్ ఎక్స్‌ప్రెస్ హైవేపై దాష్టీకం ● కుటుంబంపై దాడి ● వైరల్ వీడియోతో ముగ్గురు అరెస్టు



**బెంగళూరు, జులై 9:** కర్ణాటకలోని అత్యంత రద్దీగా ఉండే జాతీయ రహదారుల్లో ఒకటైన బెంగళూరు- మైసూరు ఎక్స్‌ప్రెస్‌వేపై దారుణమైన ఘటన చోటుచేసుకుంది. పసిబిడ్డలతో ప్రయాణిస్తున్న ఒక కుటుంబాన్ని వెంబడించి, దుండగులు వారిపై దాడికి తెగబడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, పోలీసులు స్పందించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న సాగర్ కుమార్ (37), ఆదివారం రాత్రి తన కుటుంబంతో కలిసి మైసూరు నుంచి బెంగళూరుకు కారులో బయలుదేరారు. ఆయనతో పాటు భార్య, తల్లి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీరంగపట్నం టోల్ ప్లాజా వద్ద వీరి కారు, మరో మారుతి స్విఫ్ట్ కారును స్వల్పంగా ఢీకొట్టింది. ఆ సమయంలో గొడవ సద్దుమణిగినట్లు కనిపించినా, స్విఫ్ట్ కారులోని వ్యక్తులు సాగర్ వాహనాన్ని వెంబడించారు. మండ్య జిల్లా మద్దూరు సమీపంలో తమ వాహనాలతో వారని అడ్డగించి దాడికి దిగారు. వారి వెనుక వస్తున్న మరో వాహనంలోని డాష్‌క్యామ్‌లో ఈ దాడి దృశ్యాలు రికార్డయ్యాయి. నిందితులు సాగర్‌ను కారు లోంచి బయటకు లాగి విచక్షణారహితంగా పిడిగుద్దులు కురిపించారు. తన భర్తను రక్షించేందుకు కారు దిగిన సాగర్ భార్య, పసిబిడ్డ ఉన్నాడని, కావాలంటే తన ఒంటిపై ఉన్న బంగారం తీసుకెళ్లాలని, తమను వదిలేయాలని వేడుకుంది. అయినప్పటికీ దుండగులు కనికరించకుండా దాడిని కొనసాగించారు. చివరకు అటుగా వెళ్తున్న ఇతర ప్రయాణికులు జోక్యం చేసుకోవడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. వీడియో ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు, బెంగళూరుకు చెందిన క్యాబ్ డ్రైవర్లు సహా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడికి ఉపయోగించిన రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

## 20న పార్లమెంటు వరకూ కాక్రోచ్ పార్టీ ర్యాలీ

**న్యూఢిల్లీ, జులై 9:** ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద గత 20 రోజులుగా నిరసన తెలుపుతున్న కాక్రోచ్ జనతా పార్టీ(సిజెపి) మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఈనెల 20న పార్లమెంట్ వరకు శాంతియుత పాదయాత్రకు పిలుపునిచ్చింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలి రోజే ఈ మార్చ్ చేపట్టనున్నట్లు వెల్లడించింది. పేపర్ లీక్‌లకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సిజెపి డిమాండ్ చేస్తోంది. ఇదే డిమాండ్‌తో పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కూడా గతనెల 28 నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈనెల 20న ప్రకటించిన పార్లమెంట్ పాదయాత్రలో పాల్గొంటారని సిజెపి వెల్లడించింది. జులై 20న జరగబోయే శాంతియుత పార్లమెంట్ పాదయాత్రలో పాల్గొనాలని సోనమ్ వాంగ్‌చుక్ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.

# కాఫీతో చాక్లెట్ తోడు.. చురుకుపాలు సైదోడు !





కాఫీలో ఉండే కెఫీన్ ఏకాగ్రత, అప్రమత్తత పెంచడానికి పనిచేస్తుంది. డార్క్ చాక్లెట్‌లో ఫ్లేవనాల్స్, థియోబ్రోమిన్‌రక్తప్రసరణ, మూడ్‌పై సానుకూల ప్రభావం కలిగిస్తుంది. అవి రెండూ కలిపి సేవిస్తే చురుకుదనం మీ వశమౌతుంది. మీకెప్పుడైనా తల బరువెక్కినట్లో, కళ్లలో మందకొడితనం ఆవహించినట్లు ఉంటేనే ఏదో తెలిసిన మందులు వాడేయాలను అనుకోవద్దు. ఒక కప్పు కాఫీతో పాటు చిన్న ముక్క డార్క్ చాక్లెట్ తింటే చాలా ప్రయోజనాలు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. రుచితో పాటు దీని ప్రయోజనాల వెనక ఆసక్తికరమైన సైన్స్ కూడా ఉందని వివరిస్తున్నారు. కాఫీ, డార్క్ చాక్లెట్ రెండు ఉత్తజాన్ని చురుకుదనాన్ని పెంచేవని అందరికీ తెలిసిందే. కాఫీ నిద్రమత్తును తగ్గించి అప్రమత్తతను పెంచుతుంది. అందుకే పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు, చదువుకునే సమయంలో లేదా ప్రయాణాల్లో చాలా మంది కాఫీ తాగడం సహజం కదా.. కెఫీన్ నేరుగా నాడీ వ్యవస్థపై ప్రభావం చూపి ఏకాగ్రతను పెంచేందుకు సాయపడుతుందని ఆరోగ్య నిపుణులు చెప్పేమాట. డార్క్ చాక్లెట్ కేవలం రుచికరమైన స్నాక్ మాత్రమే కాదు. ఇందులో ఫ్లేవనాల్స్, థియోబ్రోమిన్ అనే సహజ పదార్థాలు ఉంటాయి. ఇవి శరీరంలో రక్తప్రసరణను మెరుగుపరచడంలో సాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మెదడుకు రక్త సరఫరా మెరుగుపడితే చురుకుదనం పెరిగే అవకాశం ఉంటుంది. అలాగే డార్క్ చాక్లెట్ మూడ్‌ను ఉల్లాసంగా ఉంచడంలో కూడా తోడ్పడుతుంది. కాఫీ, డార్క్ చాక్లెట్ రెండింటిలోని పదార్థాలు కలిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు. కాఫీలోని కెఫీన్ తక్షణ ఉత్సాహాన్ని అందిస్తే, డార్క్ చాక్లెట్‌లోని థియోబ్రోమిన్ నెమ్మదిగా ప్రభావం చూపుతుంది. దీంతో ఒక్కసారిగా ఎనర్జీ పెరిగుతుంది. అప్పుడప్పుడు ఆస్వాదించదగిన చిట్కా. కాఫీ ఎక్కువగా తాగడం వల్ల కొందరిలో నిద్రలేమి, గుండె వేగంగా కొట్టుకోవడం, ఆందోళన వంటి సమస్యలు వస్తున్నాయనీ అంటుంటారు. ఏ ఆహారాన్నైనా మితంగా తీసుకోవడమే మంచి పద్ధతి. ఆహార సమతుల్యత పాటించవచ్చు.


## సమన్వయాన్ని పెంచే స్విస్ బాల్ !



**బరువు తగ్గాలి.. ఆరోగ్యం మెరుగుపడాలి. ఇకనైనా వర్కవుట్లు చేద్దాం అని చాలాసార్లే అనుకుంటాం. కానీ అమలు చేయం. ఈ స్విస్ బాల్‌ని ఇంటికి తెచ్చుకుని చూడండి. బోలెడన్ని ప్రయోజనాలు.**

స్విస్‌బాల్‌తో పొట్ట, వీపు, పొత్తికడుపునకు ప్రయోజనం ఇచ్చే కసరత్తులు సులువుగా చేయొచ్చు. దీతో శరీరాన్ని బ్యాలెన్స్ చేయ గలరు. మెరుగైన పోశ్చర్ కూడా వస్తుంది. ఉదాహరణకు బాల్‌పై సిట్-అప్స్, ప్లాంక్స్ ప్రయత్నించి చూడండి. గర్భిణులు, వర్క్‌ఫ్రమ్ హోమ్ చేసేవారు, డెస్క్ ఉద్యోగులు.. ఈ స్విస్ బాల్‌పై వ్యాయామం చేయడం వల్ల వెన్ను కండరాలు బలపడతాయి. గర్భిణులకు ప్రసవ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయి. రోజువారీ పనులు చేసుకోవడం కష్టంగా ఉందా? అయితే,మీ శరీరం ఫ్లెక్సిబుల్‌గా మారాలంటే స్విస్‌బాల్‌తో వ్యాయామాలు మొదలుపెట్టండి. ఒత్తిడీ అదుపులో ఉంటుంది.

# పట్టుదలతోనే ఆకాంక్షల తీరు !



ఉద్యోగమనేది జీవితంలో ఒక భాగమేననుకొన్న ఓ భారతీయ విద్యాని పట్టు విడవకుండా చేసిన ప్రయత్నమే ఆమెకు ఓ ఉద్యోగానికి దారి చూపించింది. పట్టుదలతో శ్రమించి, ఈ కాలపు అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఉద్యోగం సంపాదించిన ఒక భారతీయ యువతి కథ. యువతకు ఆదర్శంగా నలిచింది. న్యూయార్క్ యూనివర్సిటీ (ఎన్‌వైయూ) నుండి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన దివ్య బన్సాల్. పట్టువదలని విక్రమార్కుడి వలె చేయని ఉద్యోగ ప్రయత్నంలేదు. ఎక్కని కంపెనీ గుమ్మం లేదు. ఎన్నో సార్లు తన దరఖాస్తు తిరస్కరించబడినా మళ్లీ మళ్లీ ప్రయ్నిస్తూనే ఉంది. వీసా స్పాన్సర్‌షిప్ వంటి సమస్యలున్నా తొలి ప్రయత్నమే మనకు అనుకూలించక పోయినా ప్రయత్నం చూస్తూ ఉంటే ఉద్యోగం తప్పక వస్తుందని ఆమె తోటి విద్యార్థులకు చెబుతుంది. దివ్య ఉద్యోగం 420 కంపెనీలకు దరఖాస్తులు పంపింది. అయితే వందలాది దరఖాస్తులు తిరస్కరణకు గురికాగా, ఆమెకు కేవలం మూడే ఇంటర్వ్యూలకు పిలుపు వచ్చింది. తనవన్నీ విఫల ప్రయత్నాలని అనుకోలేదు. నిరాశ చెందకుండా పట్టుదలతో ప్రయత్నించి చివరికి రెండు ఉద్యోగ ఆఫర్లను సొంతం చేసుకుంది. రెండు చేతుల్లోనూ ఆఫర్లు పెట్టుకొని వాటిలో 'ది బెస్ట్' ఎంచుకోవడం ఆమె చేతుల్లోనే ఉంది. తాను న్యూయార్క్‌లో జీవితాన్ని నిర్మించుకోవడానికే వచ్చాననీ, కేవలం కెరీర్ కోసం ఉద్యోగంతో పాటు తనకు ఇష్టమైన నృత్యం జీమ్, ఇంట్లో వంటకాలు, ఆత్మీయులతో సమయం గడపడం వంటి వాటికి సమాన ప్రాధాన్యత ఇస్తానని తన జీవిత ఆకాంక్షలను చెబుతోంది.

# అన్నమయ్య

**నారాయణ సూరి, లక్కమాంబ** దంపతులకు వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో వైశాఖ పూర్ణిమినాడు కడపి జిల్లా తాళ్లపాకలో జన్మించాడు అన్నమయ్య. ఎనిమిదేళ్లకే ఎవరికీ చెప్పకుండా తిరుమలకు బయల్దేరాడు. ఆ యాత్రలో ఆకలిగొన్న అన్నమయ్యకు అలమేలు మంగమ్మ వృద్ధురాలిగా కనిపించి పాయసం అందించింది. తిరుమల చేరి స్వామిని దర్శించుకున్నాక.. అలమేలు మంగమ్మను కీర్తిస్తూ శ్రీ వేంకటేశ్వర శతకం రచించాడు. ఆ మహాక్షేత్రంలోనే ఉంటూ స్వామిని దర్శించుకుంటూ కాలం గడపసాగాడు. అన్నమయ్య ఆచూకీ తెలిసిన తల్లిదండ్రులు తిరుమల వెళ్లి అన్నమయ్యను తాళ్లపాకకు తెచ్చుకోగలిగారు. కానీ ఆయనలో స్వామి ధ్యాస తగ్గలేదు. భార్యవల్ల దారికి వస్తాడని వివాహం చేశారు. ఒకటి కాదు రెండు పెళ్లిళ్ల చేసుకున్నా.. శ్రీ వేంకటేశునిపై అపార భక్తి తగ్గలేదు. కనుకనే.. తిరుమల వెంకన్నను స్వామీ నీకు తిరుమల లడ్డూ కావాలా? అన్నమయ్య పాట కావాలా? అనడిగితే ఆ కోనేటిరాయడు రెండోదే కోరుకుంటాడు. ఆయన పాట స్వామికి అంత ఇష్టం మరి. దక్షిణాదిన పదకవితాశైలి, భజన సంప్రదాయాలకు ఆద్యుడు అన్నమయ్య. తన జీవితకాలంలో వేలాది కీర్తనలు రచించాడు. వియజ నగర సామ్రాజ్య ప్రతినిధి అయిన సాళువ నరసింగ రాయలు..తనపై కూడా కీర్తనలు రచించమని కోరగా తిరస్కరించాడు అన్నమయ్య. శ్రీహరిని స్తుతించిన ఈ నోరు మానవమాత్రులను కీర్తించదు అన్నాడు. ఆ మాటలకు ఆగ్రహించిన నరసింగరాయలు అన్నమయ్యను చెరసాలలో బంధించాడు. స్వామి అనుగ్రహంతో రాజుకు జ్ఞానోదయమై అన్నమయ్యను విడుదల చేయడమే కాదు, క్షమించమని ప్రాధేయపడ్డాడు. అన్నమయ్య సంకీర్తనల ప్రవాహం సెలయేరులా ప్రవహించింది. తిరుమల హుండీకి ఎదురుగా ఉన్న రాతి పలకల గదిలో సంకీర్తనల భాండాగారం బయటపడింది. అలా వేలాది అన్నమయ్య కీర్తనలు, మరెన్నో అమూల్య సంకీర్తనల సంపద అందుకోగలిగాం. బ్రహ్మమొక్కటే పరబ్రహ్మ మొక్కటే.. కీర్తనలో సమాజంలోని అసమానతలను చీల్చి చెండాడాడు అన్నమయ్య నిండార రాజు నిదురించే నిద్రయు ఒక్కటే. అంటూ రాజు, బంటులకు తేడా ఏముందని ప్రశ్నించాడు. ఏనుగు మీద అయినా, శునకం మీద అయినా సూర్య కిరణాలు ఒకేరీతిలో పడతాయి అన్నాడు. పంచభూతాలకు లేని ఈ పట్టింపులు నీకెందుకు? అంటూ ఆనాడే చురక పెట్టాడాయన. అన్నమయ్య పరమ భక్తుడే కాదు గొప్ప సంఘసంస్కర్త ఆధ్యాత్మిక విప్లవ చైతన్యమూర్తి.

# మీట నొక్కితే చాలు !



**బియ్యం, పప్పులు లాంటివి ఎంత జాగ్రత్తగా పదిలపరచినా పురుగు చేరుతుంది.** కొన్నిసార్లు బూజుపడుతుంది కూడా. అందుకు ముఖ్య కారణం. తడి చేత్తో కొలత డబ్బాను పట్టుకోవడం. చెయ్యి తుడుచుకున్నాం కదా అనుకుంటాం కానీ.. మిగిలి ఉన్న అతి కొద్ది చెమ్మ వల్ల కూడా పదార్థాలు పడైపోతాయి. మనకు అందుబాటులోకి వచ్చిన 'రొటేటింగ్ రైస్ డిస్పెన్సర్' అలాంటి ఇబ్బందులను తొలగిస్తుంది. ఇందులో కింది భాగంలోని పెద్ద అరలో బియ్యం, పైనున్న చిన్న అరల్లో కందిపప్పు, మినప్పప్పు, రవ్వ లాంటివి నిలువచేయవచ్చు. మీట తిప్పితే చాలు. కావాలనుకున్నది పంపులోంచి నీళ్లలా వచ్చేస్తుంది. చుట్టూ తిరిగే వీలు ఉండటానికి అవసరమైన అర ఎదురుగా వచ్చేట్లు తిప్పి, కావలసినంత పట్టుకుని మీట ఆపితే సరిపోతుంది. గాలి చొరబడక పోవడమే కాదు, వాటర్ ప్రూఫ్, డస్ట్ ప్రూఫ్ ఉండంతో పదార్థాలు తాజాగా ఉంటాయి. నాణ్యమైన ఫుడ్ గ్రేడ్ ప్లాస్టిక్‌తో తయారయ్యింది కనుక ఆరోగ్య సమస్యలు రావు, పర్యావరణానికీ నష్టం లేదు.

# మీ శ్రీమతికి శుభాకాంక్షలు చెప్పారా?



ఏమండోయ్! మీ శ్రీమతి పుట్టిన రోజు ఎపుడో గుర్తుందా! లేదా! అయితే ఇక అంతే అది కూడా గుర్తుంచుకోలేకపోతే మీరేం భర్త అండి. వెంటనే మీ 'మైండ్ బేక్'లో నోట్ చేసేసుకోండి. లేకుంటే ఇబ్బందే, ఆ తర్వాత మీ యిష్టం. పుట్టినరోజుకు భర్త ప్రేమతో ఇచ్చే చిరు కానుక కూడా ఎంతో సంతోషాన్నిస్తుంది కదా! ఏమీ ఇవ్వకున్నా ఆ రోజును గుర్తుంచుకుని శుభాకాంక్షలు చెప్పినా చాలనుకునే అల్ప సంతోషులం మనం. కానీ, మగవాళ్ల మాత్రం గుర్తులేదు. పనిలో పడి మర్చిపోయా.. అంటూ రకరకాల కారణాలు చెప్పేస్తుంటారు. మనమూ దాన్ని మర్చిపోయి.. సర్దుకుపోతుంటాం. అయితే, ఈ విషయాన్ని అంత తేలిగ్గా తీసుకోని దేశం ఒకటి ఉందని మీకు తెలుసా? ఇక్కడ భార్య పుట్టిన రోజును మర్చిపోతే ఇక వాళ్ల పని అంతే. 'సమోవా' అనే దేశంలో దీన్ని నేరంగా భావిస్తారట. అమెరికా సమీపంలో ఉండే పాలీనేసియన్ ఐల్యాండ్ దేశం ఇది. అందుకోసం ఇక్కడి ప్రభుత్వం ఏకంగా ఓ చట్టమే చేసింది. పైగా ఆ చట్టం సరిగా అమలవుతుందా? లేదా అనేది చూడడానికి ప్రత్యేకంగా పోలీసు బృందాలను కూడా ఏర్పాటు చేశారట. భార్య పుట్టిన రోజును మొదటిసారి మర్చిపోతే పోలీసులు భర్తకు వార్నింగ్ ఇచ్చి వదిలేస్తారట. అదే పొరపాటు రెండోసారి చేస్తే వాళ్లకు జరిమానా లేదా గరిష్టంగా ఐదేళ్లపాటు జైలు శిక్ష కూడా వేస్తారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేస్తారు. అంతేకాదు, భార్యకు తన హక్కుల గురించి, ఈ చట్టం గురించి అవగాహన కల్పించ డానికి దేశమంతా క్యాంపులనూ నిర్వహిస్తారట. ఏదిఏమైనా ఇలాంటి చట్టం మన దేశంలో కనుక ఉండి జైళ్లన్నీ నిండిపోతాయేమో.

# తెర

## 'దాదా ది సౌరవ్ గంగూలీ స్టోరీ' ఫస్ట్ లుక్ రిలీజ్



ప్రపంచ వ్యాప్తంగా మే 14, 2027న సినిమా భారీ విడుదల..లెజెండ్రీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ పుట్టిన రోజు సందర్భంగా దాదా ది సౌరవ్ గంగూలీ స్టోరీ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. బాలీవుడ్ స్టార్ రాజ్‌కుమార్‌రావ్ టైటిల్ పాత్రలో నటిస్తున్నారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు ఈ రోజు మరింత ప్రత్యేకంగా మారింది. ఇదే సమయంలో ఈ సినిమాను 2027, మే 14న లాంగ్ హాలిడే వీకెండ్ సందర్భంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అధికారికంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో 2002లో ఇంగ్లాండ్‌పై భారత్ సాధించిన చారిత్రాత్మక నాట్‌వెస్ట్ ట్రోఫీ విజయం తర్వాత లార్డ్స్ బాల్కనీలో సౌరవ్ గంగూలీ జెర్సీ ఊపిన ఐకానిక్ మూమెంట్ ను రాజ్‌కుమార్ రావ్‌తో సినిమాటిక్‌గా రీక్రియేట్ చేసినట్లు చూపించారు. దాదా ది సౌరవ్ గంగూల్ధీ సినిమా క్రికెట్ ఆట ఆడిన వ్యక్తి మాత్రమే కాకుండా దానిని మార్చిన మనిషి అసాధారణ ప్రయాణాన్ని చూపిస్తుంది. ఒక ప్రతిభావంతుడైన యువ క్రికెటర్‌గా ప్రారంభమై భారతదేశంలో అత్యంత ప్రభావశీలమైన కెప్టెన్లలో ఒకరిగా ఎదిగిన గంగూలీ ప్రయాణాన్ని ఈ చిత్రం ఆవిష్కరిస్తుంది.'దాదా ది సౌరవ్ గంగూలీ' సినిమాకు విక్రమాదిత్య మోత్వానె దర్శకత్వం వహిస్తున్నారు. లవ్ రంజన్, అంకూర్ గార్గ్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టీసిరీస్, డీబీఎల్ సమర్పణలో, లవ్ ఫిల్మ్స్ నిర్మాణంలో ఈ సినిమా రూపొం దుతోంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2027, మే 14న థియేటర్లలో భారీ ఎత్తున విడుదల కానుంది.

## 'వదలా': ట్రైలర్ లాంచ్



జగపతి బాబు, లయ, అకెళ్ల వి కృష్ణ, కిషోర్ నాయుడు చిరుమామిల్ల, తమ్మారెడ్డి భరద్వాజ్, చరిత చిత్ర ప్రొడక్షన్ వదలా మిస్టరీ గ్రిప్పింగ్ ట్రైలర్ లాంచ్‌వెర్సటైల్ యాక్టర్ జగపతి బాబు ఎమోషన్స్, మిస్టరీ, సస్పెన్స్ ఫ్యామిలీ థ్రిల్లర్ 'వదలా'తో సర్ప్రైజ్ చేయడానికి సిద్ధమవుతున్నారు. అకెళ్ల వి.కృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో లయ, హృతికా శ్రీనివాస్ కీలక పాత్రల్లో నటించారు. చరిత చిత్ర ప్రొడక్షన్ బ్యానర్‌పై కిషోర్ నాయుడు చిరుమామిల్ల, తమ్మారెండ్డి భరద్వాజ్ నిర్మించిన ఈ చిత్రం, ఆకట్టుకునే ఫస్ట్ గ్లింప్స్, మంచి ఆదరణ పొందిన టీజర్‌తో ఆసక్తిని పెంచింది. ఈ సినిమా జూలై 17న థియేటర్లలోకి రానుంది. సినిమాటోగ్రాఫర్ చోటా కె. నాయుడు తన విజువల్స్‌తో సస్పెన్స్ వాతావర ణాన్ని అద్భుతంగా చూపించారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో జగపతిబాబు మాట్లా డుతూ..'వదలా' సినిమా జూలై 17న వదులుతున్నాం. ఈ సినిమా కథ మీద నాకు చాలా నమ్మకం ఉంది. కచ్చితంగా ఆడు తుందని నమ్ముతు న్నాను. చాలా రోజుల తర్వాత నేను సోలోగా చేసి మొత్తం భారం తీసుకుని, ఇద్దరు హీరోయిన్స్‌తో ఒక ఫ్యామిలీ థ్రిల్లర్ చేస్తే నాకంటూ ఒక గుర్తింపు వస్తుందని చేసిన ప్రయత్నం ఇది. .నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ.. నేను ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు అయ్యింది. ఇన్నేళ్లలో ఎన్నో మార్పులు వచ్చాయి. అప్పటితో పోలిస్తే ఇప్పుడు ఎన్నో అంశాలను దృష్టిలో పెట్టుకుని సినిమా తీయాల్సి వస్తోంది. ఓటీటీ, హిందీ డబ్బింగ్... ఇలా చాలా విషయాలు చూడాల్సి వస్తోంది. ఎలా తీసినా ప్రేక్షకులను అలరించడమే అంతిమ లక్ష్యం. హీరోయిన్ లయ మాట్లాడుతూ.. "ట్రైలర్ నచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. అందరూ చాలా హార్డ్ వర్క్ చేసిన సినిమా ఇది. వదలా టైటిల్ చాలా క్యాచీగా ఉంది. జగపతిబాబుతో మళ్లీ కలిసి నటించడం చాలా ఆనందంగా ఉంది.

## 'మారెమ్మ' అందరికీ నచ్చుతుంది: మిట్టపల్లి సురేందర్



'మారెమ్మ' ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్, 'బావ బావ', మారి సాంగ్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.

**సినిమాలో వచ్చిన మొదటి అవకాశం గురించి?**

'ధైర్యం' సినిమాకు తొలిసారి పాట రాశాను. ఆ తర్వాత రాజన్నలో కాలిగజ్జె ఘల్లుమంటే, జార్జ్ రెడ్డిలో వాడు నడిపే బండి రాయల్ ఎన్‌ఫీల్డ్, లవ్ స్టోరీలో నీ చిత్రం చూసి, రాజు వెడ్స్ రాంబాయిలో రాసిన పాటలు నాకు మంచి పేరు తీసుకొచ్చాయి.

**మారెమ్మలో రాసిన 'మారి' పాట గురించి?**

'మారి' అనేది సినిమాలో హీరో ఆడుకునే దూడ పేరు. ఇలాంటి పాట రాసే అవకాశం రావడం నా అదృష్టం. దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు క్లైమాక్స్‌కి వచ్చేసరికి ఆయనతో పాటు నేను కూడా ఏడ్చేశాను.

**ఈ మధ్యకాలంలో రాసిన పాటల గురించి?**

పెద్ది సినిమాలో రెండు పాటలు రాశాను. ఢిల్లీ ఎపిసోడ్‌లో వచ్చే అలసిపోవద్దురా పెద్ది, అలాగే పెద్ది ట్రైన్‌లో తిరిగి వస్తున్నప్పుడు వచ్చే అనగనగా పాట, జగపతి బాబు ఎపిసోడ్‌లో వచ్చే ఆగిన శ్వాసలో ఆశయం ఉంది పాటలు రాశాను. అవన్నీ కథకు ఆయువు పట్టు లాంటి పాటలు. థియేటర్‌లో ప్రేక్షకులను ఎంతగానో కదిలించాయి.

**రవితేజని కలిశారా?**

ఈ సినిమా కోసం కాదు. చోర్ బజార్ సినిమాకు పాట రాసినప్పుడు ఆ సినిమాలోని పాటను రవితేజ లాంచ్ చేశారు. ఆ సందర్భంగా ఆయనను కలిశాను.

**మారెమ్మ రషెస్ చూశారా?**

నేను కథ మొత్తం చదివాను. కథ చదివినప్పుడు నేను ఎలాంటి ఎమోషన్ ఫీల్ అయ్యానో, అదే ఎమోషన్ స్క్రీన్‌పైకి వచ్చింది. దర్శకుడు చాలా అద్భుతంగా తీశారు.

**నిర్మాత గురించి?** మయూర్ తొలిసారి నిర్మాత అయినప్పటికీ ఎక్కడా రాజీపడకుండా సినిమా తీశారు.

**దర్శకుడు గురించి?**

దర్శకుడు చాలా టాలెంటెడ్. ప్రతి పాటను దగ్గరుండి రాయించారు. ఆయనకు ప్రతి విషయంలో మంచి ఇన్‌వాల్వ్‌మెంట్ ఉంటుంది.


**మీ స్ఫూర్తి ?** సినీ పరిశ్రమలో వేటూరి, చంద్రబోస్ నాకు స్ఫూర్తి.

**సంగీతం చేయాలనే ఆలోచన ఉందా?**

లేదు. రెండు పడవల ప్రయాణం చేయను. ప్రస్తుతం సినిమా పాటలు రాయడానికే పూర్తి సమయాన్ని కేటాయించాను.

**ఇప్పుడు రాస్తున్న సినిమాల గురించి?**


ప్రస్తుతం దాదాపు పది సినిమాలకు పాటలు రాస్తున్నాను. ఇదుపుకాయితం, జిల్లేడు చెట్టు, దేత్తడి, డేవిడ్ రెడ్డి ఇలా పలు సినిమాలకు రాస్తున్నాను.



## ఏ 'టాక్సిక్' మ్యూజిక్ వీడియో 'తబాహీ' రిలీజ్

మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, కేవీఎన్ ప్రొడక్షన్స్, జీ మ్యూజిక్ కంపెనీ కలిసి 'టాక్సిక్' ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్ సినిమాలోని తొలి పాట తబాహీ అఫీషియల్ మ్యూజిక్ వీడియోను విడుదల చేశాయి. రాకింగ్ స్టార్ యశ్, కియారా అద్వానీ జంటగా కనిపిస్తున్న ఈ పాటలో ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రేమను అత్యంత స్వచ్ఛంగా, గాఢంగా చూపిం చిన ఈ పాట, అద్భుతమైన విజువల్స్, భావోద్వేగాలతో కూడిన కథనం, మ్యూజిక్ వీడియో విడుదలకు ముందు మేకర్స్ సోషల్ మీడియాలో ఆసక్తికరమైన ప్రమోషన్ చేశారు. విశాల్ మిశ్రా స్వరపరచి, ఆలపిం చిన ఈ పాటకు హిందీలో రాజ్ శేఖర్ సాహిత్యం అందించారు. ఈ పాటను హిందీతో పాటు కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు, గాయకుడు విశాల్ మిశ్రా మాట్లాడుతూ, 'తబాహీ' సాధా రణ ప్రేమగీతం కాదు. ప్రేమ లోని త్యాగం, ఆవేశం, భావోద్వేగాలను ఈ పాట చూపి స్తుంది. యశ్, గీతూ మోహన్‌దాస్ కలిసి కథ అందించిన ఈ చిత్రానికి గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాను కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో చిత్రీకరించగా, తెలుగు, హిందీ, తమిళం, మలయాళంతో పాటు ఇతర భాషల్లో కూడా డబ్ చేసి విడుదల చేయనున్నారు.కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో యశ్, నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు .ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్' చిత్రం ఆగస్టు 26, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

## ఆగస్ట్ 14న 'అగధ' వస్తోంది



నిర్మాత గా ఒక చరిత్ర సృష్టించిన ఎం.ఎస్. రాజు , దర్శకునిగా అగధ్ధ చిత్రాన్ని ఒక విజువల్ వండర్ గా తీర్చిదిద్దారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన మిస్టిక్ డివైన్ థ్రిల్లర్ చిత్రం అగధ ప్రపంచవ్యాప్తంగా ఆగస్ట్ 14, 2026న భారీ స్థాయిలో విడుదల కానుంది.ఆ మధ్య విడుదలైన అగధ్ధ టీజర్ ఒక సెన్సేషన్ సృష్టించింది. ప్రేక్షకులు ఈ సినిమా రిలీజ్ కోసం ఆసక్తిగా ఎదురు చూసేలా చేసింది. టీజర్ లోని విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, మిస్టీరియస్ వాతావరణం, గ్రాండియర్ మేకింగ్‌కు అన్ని వర్గాల నుంచి ప్రశంసలు లభించాయి.అగధ్ధ గురించి దర్శకుడు ఎం.ఎస్. రాజు మాట్లాడుతూ, 'అగధ' నా డ్రీమ్ ప్రాజెక్ట్. టీజర్‌లో చూసింది ఈ సినిమా ప్రపంచంలో ఒక చిన్న భాగం మాత్రమే. సినిమాలో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే ఎన్నో అంశాలు ఉన్నాయి. ఇది ప్రతి ఫ్రేమ్ లోనూ ఓ విజువల్ వండర్‌లా అనిపించే సినిమా. అలాగే ఎమోషన్స్ కి టాప్ ప్రయారిటీ ఇచ్చాం. ప్రతి ఆర్టిస్ట్, ప్రతి టెక్నీషియన్ అద్భుతంగా పనిచేశారు. ముఖ్యంగా కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్ తమ పాత్రల్లో అసాధారణ నటన కనబరిచారు. ప్రేక్షకులు థియేటర్లలో ఒక కొత్త అనుభూతిని పొందుతారు. నిర్మాత కాశీ విశాలాక్షి బలుసు మాట్లాడుతూ, "అగధ్ధను అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో నిర్మించాం. టీజర్‌కు వచ్చిన స్పందన మా ఆనందాన్ని మరింత పెంచింది. ఆగస్ట్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని విశ్వసిస్తున్నాం" అన్నారు.నటి కామాక్షి భాస్కర్ల మాట్లాడుతూ,"మహాదేవి పాత్ర నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే పాత్ర. ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది" అన్నారు. హీరో శ్రవణ్‌రెడ్డి మాట్లాడుతూ, 'డర్టీ హరి' తర్వాత మళ్లీ ఎం.ఎస్. రాజు గారితో పని చేయడం సంతోషంగా ఉంది. 'అగధ'లో నా పాత్ర చాలా భిన్నంగా ఉంటుంది. సినిమాలో ఎన్నో సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి" అన్నారు.

## 'మిస్టర్ మిడిల్ క్లాస్'17న రిలీజ్



శ్రీకాంత్, లయ హీరో హీరోయిన్స్‌గా నటకిరీటి రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు జి. నాగేశ్వర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందు తున్న అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్ మిస్టర్ మిడిల్ క్లాస్. జీకే సిఎన్ నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. జూలై 17న ఈ చిత్రం ప్రేక్షకులు ముందుకు రానుంది. రిలీజ్ డేట్ పోస్టర్ లో శ్రీకాంత్ వేంకటేశ్వర స్వామీ గెటప్‌లో కనిపించడం అందరినీ ఆకట్టుకుంది. మిస్టర్ మిడిల్ క్లాస్ ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే కథ .అందరూ కలసి ఎంజాయ్ చేసే ఫ్యామిలీ ఎంటర్టైనర్. ఈ చిత్రంలో సునీల్, రఘుబాబు, అలీ, వెన్నెల కిశోర్, పృథ్వీ, బాబూ మోహన్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో అలరించబోతున్నారు. ఈ చిత్రానికి సాయి కార్తీక్ మ్యూజిక్, 'గరుడవేగ' అంజి సినిమాటోగ్రాఫర్, డైమండ్ రత్నబాబు డైలాగ్స్ అందిస్తున్నారు.

# జెయింట్ల జోరు.. క్వార్టర్ ఫైనల్ హోరు

*ప్రపంచాన్ని ఊపేస్తున్న సాకర్ వరల్డ్ కప్ కీలక దశకు చేరుకుంది. లీగ్ దశలో పోటీపడ్డ 48 జట్లలో కేవలం 8 జట్లే మిగిలాయి. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా, రన్నరప్ ఫ్రాన్స్‌తో పాటు యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్, బెల్జియం, మొరాకో, నార్వే, ఇంగ్లాండ్ జట్లు క్వార్టర్ ఫైనల్ పోరుకు సిద్ధమయ్యాయి. ఫ్రాన్స్, మొరాకో మ్యాచ్‌తో కీలక దశ ఆరంభం కానుంది. 11న అర్ధరాత్రి స్పెయిన్‌తో బెల్జియం, 12 తెల్లవారుజామున నార్వేతో ఇంగ్లాండ్, 12 ఉదయం అర్జెంటీనాతో స్విట్జర్లాండ్ తలపడనున్నాయి*




* కప్ వేటలో దిగ్గజాల ఢీ
* క్వార్టర్ ఫైనల్ కిక్‌ఆఫ్
* విజేతకే సెమీస్ టికెట్
* విజయం వైపు స్టార్స్ రన్
* మెస్సీ, ఎంబాపె, హాలాండ్ ఫైట్

(వార్త క్రీడా విభాగం)

సాకర్ ప్రపంచకప్ లీగ్ దశలో 48 జట్లు పోటీపడితే అందులో నుంచి 32 జట్లు రౌండ్ ఆఫ్ 32కు చేరాయి. అక్కడి నుంచి 16 జట్లు ప్రిక్వార్టర్స్‌కు చేరుకున్నాయి. ఇప్పుడు క్వార్టర్‌ఫైనల్లో 8జట్లు అమీతుమీకి సిద్ధమవుతున్నాయి.సాకర్ ప్రపంచకప్‌పై భారీ అంచనాలు పెట్టుకున్న పెద్ద జట్లలో చాలావరకు నిష్క్రమించాయి.జర్మనీ, పోర్చుగల్,నెదర్లాండ్స్, క్రొయేషియా జట్లు ప్రిక్వార్టర్స్‌లోనే ఆటను ముగించాయి.

డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన అర్జెంటీనా తమ స్థాయికి తగ్గట్లే వరుస విజయాలతో దూసుకుపోతోంది. ఆ జట్టు స్టార్ ఆటగాడు లియోనల్ మెస్సీ 5 మ్యాచ్‌ల్లో 8 గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో దూసుకుపోతున్నాడు. 2022 ఫిఫా రన్నరప్ ఫ్రాన్స్ కూడా తమ స్థాయికి తగ్గ ఆటతీరును ప్రదర్శిస్తూ వస్తోంది. ముఖ్యంగా ఆ జట్టు యువ సంచలనం కైలియన్ ఎంబాపె 5మ్యాచ్‌ల్లో ఏడు గోల్స్‌తో మెస్సీకి సవాల్ విసురుతున్నాడు. నార్వే ఆటగాడు ఎర్లింగ్ హాలండ్, స్పెయిన్ ఆటగాడు లామినే యమాల్ తమ జట్ల విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. మరోవైపు స్పెయిన్, ఇంగ్లండ్‌తో పాటు బెల్జియం తమ స్థాయి ఆటతీరుతో క్వార్టర్స్‌లో అడుగుపెట్టాయి. ఇక ఎవరూ ఊహించని రీతిలో మొరాకో, నార్వే, స్విట్జర్లాండ్ కూడా ప్రిక్వార్టర్స్‌లో అదరగొట్టి క్వార్టర్స్‌లో ప్రవేశించాయి.

### ఫ్రాన్స్ వర్సెస్ మొరాకో

ఫ్రాన్స్- మొరాకో పోరుతో క్వార్టర్స్ సమరం ఆరంభం కానుంది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన ఫ్రాన్స్‌ను ఆపడం మొరాకోకు సవాలే. ఆడిన అయిదు మ్యాచ్‌ల్లోనూ ఫ్రాన్స్ విజయం సాధించింది. నాకౌట్ తొలి మ్యాచ్‌లో స్వీడన్‌ను చిత్తు చేసిన ఆ జట్టు.. జర్మనీని ఇంటిముఖం పట్టించిన పరాగ్వేపై ప్రిక్వార్టర్స్‌లో కాస్త కష్టపడి నెగ్గింది. ఇక మొరాకోను తక్కువగా అంచనా వేయడానికి వీలులేదు. గొప్ప ఫామ్‌లో ఉంది.తొలి నాకౌట్ మ్యాచ్‌లో బలమైన నెదర్లాండ్స్‌ను మట్టికరిపించిన మొరాకో.. తర్వాత కెనడాపై ఘనంగా గెలిచింది. ఏడు గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో మెస్సీతో పోటీ పడుతున్న ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు కిలియన్ ఎంబాపె క్వార్టర్స్‌లో ఎలాంటి ప్రదర్శన చేస్తాడన్నది ఆసక్తికరంగా మారింది.

### స్పెయిన్ వర్సెస్ బెల్జియం

బలమైన ఆటగాళ్లతో కూడిన ఈ రెండు జట్ల మధ్య మ్యాచ్ హోరాహోరీగా సాగే అవకాశం ఉంది. స్పెయిన్ ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు కట్టుదిట్టమైన రక్షణతో ఆకట్టుకోగా, బెల్జియం అమెరికాపై 4-1తో విజయం సాధించి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. స్పెయిన్ సమష్టి ఆటపై ఆధారపడుతుండగా, బెల్జియం జట్టు అటాకింగ్ గేమ్ మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది.

### నార్వే వర్సెస్ ఇంగ్లాండ్

ఎర్లింగ్ హాలండ్ నేతృత్వంలోని నార్వే, ఇంగ్లాండ్‌ను ఢీకొననుంది. స్టార్ స్ట్రైకర్ ఎర్లింగ్ హాలాండ్ అద్భుత ఫామ్‌తో నార్వే తొలిసారిగా ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకోగా.. జూడ్ బెల్లింగ్‌హామ్, హ్యారీ కేన్ నేతృత్వంలోని ఇంగ్లాండ్‌డ్ అనుభవాన్ని నమ్ముకుని బరిలోకి దిగుతోంది. బ్రెజిల్‌పై నార్వే సాధించిన విజయం జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచగా, మెక్సికోపై ఇంగ్లండ్ విజయంతో నాకౌట్ దశలో తన బలాన్ని చాటుకుంది. హాలాండ్-కేన్ మధ్య గోల్స్ పోటీ మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించే కీలక అంశంగా మారింది.

### అర్జెంటీనా వర్సెస్ స్విట్జర్లాండ్

లియోనెల్ మెస్సీ మ్యాజిక్‌తో అదరగొడుతున్న అర్జెంటీనా... స్విట్జర్లాండ్‌తో తలపడనుంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించే దశనుంచి మూడో గోల్స్‌తో అదరగొట్టి ఈజిప్ట్‌పై 3-2 తేడాతో గెలుపుతో క్వార్టర్స్‌కు వచ్చింది. కొలంబియాను పెనాల్టీ షూటౌట్‌లో ఓడించి స్విట్జర్లాండ్ తొలిసారి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. స్విట్జర్లాండ్ కట్టుదిట్టమైన రక్షణతో ప్రత్యర్థికి గట్టి సవాల్ విసరాలని చూస్తోంది. ఈ మ్యాచ్ ఆసక్తి రేపుతోంది.

## వింబుల్డన్ ఫైనల్లో ముచోవా, నోస్కోవా



**లండన్, జులై 9:** వింబుల్డన్ మహిళల సింగిల్స్ ఫైనల్ ఆల్ చెక్ రిపబ్లిక్ పోరుగా మారింది. చెక్ రిపబ్లిక్ టెన్నిస్ స్టార్స్ కరోలినా ముచోవా, లిండా నోస్కోవా ఫైనల్లో ప్రవేశించారు. మహిళల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో ఏడోసీడ్ కోకో గాఫ్‌పై కరోలినా ముచోవా మూడు సెట్ల పోరులో చెమటోడ్చి నెగ్గగా, రెండో సెమీఫైనల్లో లిండా నోస్కోవా అలవోకగా మార్టా కోస్ట్యూక్‌పై గెలుపొందింది.

మహిళల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో ఏడో సీడ్, అమెరికా టీనేజ్ సంచలనం కోకో గాఫ్‌ను మూడు సెట్ల పోరులో ముచోవా ఓడించింది. తొలి సెట్‌ను ముచోవా రెండుసార్లు గాఫ్ సర్వీసును కొల్లగొట్టి 6-2తో అలవోకగా నెగ్గి శుభారంభం చేసింది. అయితే తొలిసారి వింబుల్డన్ సెమీఫైనల్ ఆడిన కోకోగాఫ్ ఆ వెంటనే పుంజుకుంది. బలమైన సర్వీసులతో విరుచుకుపడుతూ ఏస్‌లు సంధించింది. ముచోవా సర్వీసును మూడుసార్లు బ్రేక్ చేసి రెండో సెట్‌ను 6-1తో ముగించి సమవుజ్జీగా నిలిచింది. ఫలితం తేల్చే మూడో సెట్‌లో ఇరువురు కొదమ సింహాల్లా తలపడ్డారు.ఎవరి సర్వీసులు వారు నిలబెట్టుకోవడంతో సెట్ టైబ్రేకర్ వరకు కొనసాగింది. రెండు సార్లు గేమ్ పాయింట్లను కాచుకుని ముచోవా చివరకు 12-10తో గెలుపొంది ఫైనల్ చేరింది. రెండో గ్రాండ్ స్లామ్ ఫైనల్ చేరడం ముచోవాకు ఇది రెండోసారి. కాగా ఇప్పటివరకు గ్రాండ్ స్లామ్ టోర్నీల్లో క్వార్టర్ ఫైనల్ దాటని లిండా నోస్కోవా.. ఈ సారి ఏకంగా ఫైనల్ చేరింది. రెండో సెమీఫైనల్లో 12వ సీడ్ కోస్ట్యూక్‌పై వరుస సెట్లలో 6-4, 6-4తో అలవోకగా గెలుపొందింది.



## వైభవ్ మూడోసారీ

టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ వరుసగా మూడో మ్యాచ్‌లోనూ నిరాశపరిచాడు.మరోసారి తక్కువ రన్స్‌కే పరిమితమయ్యాడు. రెండో టీ20లాగే జోఫ్రా ఆర్చర్ షార్ట్ పిచ్ బంతికి వైభవ్ దొరికిపోయాడు. తొలి ఓవర్‌లో ఆర్చర్‌ను ఆచితూచి ఆడిన వైభవ్.. రెండో ఓవర్ వేసిన జోష్ టంగ్ బౌలింగ్‌లో వరుసగా ఫోర్, సిక్స్ బాది రిథమ్ అందుకున్నాడు. కానీ తర్వాత ఓవర్‌లో ఆర్చర్ వేసిన షార్ట్‌లెంగ్త్ బంతికి భారీ షాట్ ఆడబోయి వైభవ్ ఔటయ్యాడు. బంతి బ్యాట్ టాప్‌ఎడ్జ్ తీసుకుని గాల్లోకి లేవగా సామ్ కుర్రాన్ క్యాచ్ అందుకున్నాడు. దీంతో 10 బంతుల్లో ఒక ఫోర్, సిక్స్‌తో కేవలం 15 పరుగులు చేసి వైభవ్ ఔటయ్యాడు. వైభవ్ సూర్యవంశీ గత రెండు మ్యాచ్‌లలో 14, 13 పరుగులు నమోదు చేశాడు. మొత్తంగా తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో మొదటి మూడు మ్యాచ్‌లలో 42 పరుగులు చేశాడు.

## శ్రేయాస్ కెప్టెన్ ఇన్నింగ్స్



**బ్రిస్టల్, జులై 9:** అయిదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బ్రిస్టల్‌లో జరిగిన నాలుగో టీ20మ్యాచ్‌లోనూ టీమిండియా టాప్ ఆర్డర్ తడబడింది. ఓపెనర్లు అభిషేక్(16), వైభవ్(15), ఫస్ట్‌డౌన్ ఇషాన్ కిషన్(4) విఫలమైనా శ్రేయాస్ అయ్యర్(49 బంతుల్లో 80 నాటౌట్; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 158 రన్స్ చేయగలిగింది.టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 48 రన్స్‌కే 3 కీలక వికెట్లు కోల్పోయి మరోసారి తడబడింది. ఈ దశలో కెప్టెన్ శ్రేయాస్ సమయోచితంగా ఆడుతూ శివమ్ దూబే(22)తో కలిసి వంద మార్కు దాటించాడు. నాలుగో వికెట్‌కు 53 రన్స్ జోడించి ఆదుకున్నాడు.ఆ తర్వాత కూడా ఒక వైపు తిలక్ వర్మ(11), వాషింగ్టన్ సుందర్(5), అక్షర్ పటేల్(1) రూపంలో వికెట్లు పడుతున్నా... శ్రేయాస్ అయ్యర్ ధాటిగా ఆడుతూ 33 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. చివరివరకు అజేయంగా నిలుస్తూ భారత్ స్కోరును 150 మార్కు దాటించాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో ఆర్చర్, జోష్ టాంగ్ చెరో రెండు వికెట్లు.. విల్ జాక్స్, అదిల్ రషీద్ చెరో వికెట్ పడగొట్టారు.

## విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతు

# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, జులై 9:** రెండు సెషన్లలో నష్టాలు చవిచూసిన స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిసాయి. గ్లోబల్ మార్కెట్లలో సానుకూల సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు, రూపాయి స్థిరత్వం, తొలి త్రైమాసిక ఫలితాల సీజన్‌పై సానుకూల అంచనాలు మార్కెట్‌కు ఊతమిచ్చాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 238.22పాయింట్లు పెరిగి 76,741.82వద్దముగిస్తే ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 80.75 పాయింట్లు లేదా 0.34 శాతం లాభపడి 23,962.80వద్ద స్థిరపడింది.దీంతో నిఫ్టీ 23,950 మార్క్‌ను అధిగమించింది. గత రెండు ట్రేడింగ్ సెషన్లలో నిఫ్టీ 2.25 శాతం, సెన్సెక్స్ 2.28 శాతం చొప్పున క్షీణించాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.41 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.69 శాతం చొప్పున పెరిగాయి. మార్కెట్‌లో కొనుగోళ్ల ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది.

బీఎస్‌ఈలో 2,896షేర్లు లాభాల్లో ముగియగా, 1,342 షేర్లు మాత్రమే నష్టపోయాయి. 190 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. పీఎస్‌యూ బ్యాంకులు, కన్స్యూమర్ డ్యూరబుల్స్‌కు డిమాండ్ సెక్టార్ల వారీగా చూస్తే ప్రభుత్వ రంగ బ్యాంకులు, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు మంచి లాభాలు నమోదు చేశాయి.ఐటీ,ఆటో రంగ షేర్లు మాత్రం ఒత్తిడిలో కొనసాగాయి. నిఫ్టీ లాభాలకు ప్రధానంగా సన్ ఫార్మాస్యూటికల్స్ 2.78, భారతి ఎయిర్‌టెల్ 2.49, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్0.83 శాతం చొప్పున మద్దతునిచ్చాయి. రూపాయి,కమోడిటీలువిదేశీ మారక ద్రవ్య మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలహీనపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.41 వద్ద కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్లో సెప్టెంబర్ డెలివరీ బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 44 సెంట్లు లేదా 0.56 శాతం పెరిగి 78.46 డాలర్లకు చేరుకుంది.

భారత 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 6.75 శాతం వద్ద కొనసాగగా, ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5, 2026 గోల్డ్ ఫ్యూచర్స్ 0.51శాతం పెరిగి 10గ్రాములకు రూ.1,44,449వద్ద ట్రేడయ్యాయి. టిసిఎస్ షేరు స్వల్పంగా 0.07శాతం లాభపడింది. రెడ్డీస్ ల్యాబొరేటరీస్ షేరు 5.77శాతం క్షీణించింది.ప్రీమియర్ ఎనర్జీస్. ఫీనిక్స్ మిల్స్ షేరు 3.34శాతం లాభపడ్డాయి. ఇతర కంపెనీలుఎన్టీపీసీ రెన్యూవబుల్ ఎనర్జీ నుంచి రూ.558.29 కోట్ల సౌర పీవీ మాడ్యూల్స్ సరఫరా ఆర్డర్ లభించడంతో ఇన్‌సొలేషన్ ఎనర్జీ షేరు 11.80 శాతం ఎగిసింది. ఈ అండ్ సీ గ్లోబల్ 2.47 శాతం పెరిగింది. డెలివరీ షేరు 2.67 శాతం లాభపడింది. యునో మిండా షేరు 2.22 శాతం పెరిగింది. సోలెక్స్ ఎనర్జీ 2.21 శాతం, రాజేష్ పవర్ సర్వీసెస్ 3.76 శాతం పెరిగింది. ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ 1.40 శాతం లాభపడింది. ఇక ఐపిఒల పరంగాచూస్తే కుసుమ్‌గర్ ఐపీఓకు మంచి స్పందన లభించింది.1.14 కోట్ల షేర్ల ఆఫర్‌కు 14.57 కోట్ల షేర్లకు బిడ్లు రావడంతో ఈ ఇష్యూ 12.71 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఐపీఓ జూలై 10న ముగియనుంది. ధరల శ్రేణి ఒక్కో షేరుకు రూ.398 నుంచి రూ.419గా నిర్ణయించారు.లేజర్ పవర్ అండ్ ఇన్‌ఫ్రా ఐపీఓకు మాత్రం మందగించిన స్పందన లభించింది.

2.55 కోట్ల షేర్ల ఆఫర్‌కు వ్యతిరేకంగా కేవలం 38.67 లక్షల షేర్లకు మాత్రమే బిడ్లు వచ్చాయి. దీంతో ఈ ఇష్యూ 0.15 రెట్లు మాత్రమే సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఐపీఓ జూలై 13న ముగియనుండగా, ధరల శ్రేణి ఒక్కో షేరుకు రూ.203 నుంచి రూ.214గా నిర్ణయించారు.

## 98శాతం వెనక్కివచ్చిన రూ.2వేల కరెన్సీనోట్లు: ఆర్బీఐ

**ముంబయి, జులై 9:** దేశంలో చెలామణిలో ఉన్న రూ.2000 నోట్లలో దాదాపు 98.47 శాతం వెనక్కి వచ్చినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) వెల్లడించింది. దాదాపు మూడేళ్ల క్రితం ఈ నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించిన ఆర్బీఐ, తాజాగా ప్రస్తుతపరిస్థితిపై గణాంకాలను విడుదల చేసింది.కరెన్సీ నిర్వహణలో భాగంగా 2023 మే 19న రూ.2000 నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్బీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో మార్కెట్‌లో మొత్తం రూ.3.56 లక్షల కోట్ల విలువైన రూ.2000 నోట్లు ఉన్నాయి. తాజా గణాంకాల ప్రకారం, ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి చెలామణిలో ఉన్న నోట్ల విలువ కేవలం రూ.5,451 కోట్లకు తగ్గిందని ఆర్బీఐ తెలిపింది. రూ.2000 నోట్లను మార్చుకునేందుకు దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్బీఐ ఇష్యూ కార్యాలయాల్లో ఇప్పటికీ సౌకర్యం అందుబాటులో ఉంది. నోట్లను ఉపసంహరించుకున్నప్పటికీ, అవి చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయని (లీగల్ టెండర్) ఆర్బీఐ మరోసారి స్పష్టం చేసింది.









## టిసిఎస్ నికరలాభం రూ.13,349 కోట్లు

**ముంబయి, జులై 9:** దేశంలోనే అతిపెద్ద ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ(టీసీఎస్) తొలి త్రైమాసికంలో నికర లాభం 4.6 శాతం పెరిగి రూ.13,349 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదేకాలంలో కంపెనీ రూ.12,760 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. కంపెనీ ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. తొలి త్రైమాసికంలో ఆదాయం 13.9 శాతం వృద్ధితో రూ.72,275 కోట్లకు చేరుకోగా, గత ఏడాది ఇదే కాలంలో అది రూ.63,437 కోట్లుగా ఉంది. వరుస త్రైమాసిక ప్రాతిపదికన ఆదాయం 2.2 శాతం పెరిగింది.స్థిరకరెన్సీ ప్రాతిపదికన ఆదాయం 0.4శాతం వృద్ధిని నమోదు చేసింది. టీసీఎస్ ఆదాయం అంచనాలను మించి నమోదవగా, నికర లాభం మాత్రం స్వల్పంగా అంచనాలకు దిగువన నిలిచింది. అంచనాల ప్రకారం కంపెనీ ఆదాయం రూ.71,862 కోట్లు, నికర లాభం రూ.13,394 కోట్లుగా ఉంటుందని భావించారు.ప్రపంచ ఆర్థికఅనిశ్చితులు,ఏఐ ప్రభావం కారణంగా ఈ త్రైమాసికం సవాళ్లతో కూడుకున్నప్పటికీ కంపెనీ పనితీరు అంచనాలకు అనుగుణంగానే ఉందని పేర్కొంటున్నారు. ఎస్‌కెఎఫ్ సంస్థతో 80 కోట్ల డాలర్ల మెగా ఒప్పందం, సర్వీస్‌నౌ తో బహుళ మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందం కుదుర్చుకుంది. తొలి త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆర్డర్ బుక్ 9.5 బిలియన్ డాలర్లకు చేరుకుంది.

## రూ.12వేల కోట్ల టార్గెట్‌తో ఎస్‌బిఐ ఫండ్స్ ఐపీఓ

**ముంబయి, జులై 9:**ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బిఐ అనుబంధంగా ఉన్న ఎస్‌బిఐ ఫండ్స్ ఐపిఒకు వస్తోంది. జూలై 14 నుంచి సబ్‌స్క్రిప్షన్లు ప్రారంభం కానున్నాయి.రూ.11,693 కోట్ల విలువైన ఈ ఐపీఓకు కంపెనీ ఒక్కో షేరుకు రూ.545 నుంచి 574 వరకు ధరల శ్రేణిని నిర్ణయించింది. ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ విధానంలో జరగనుండగా, ముఖ విలువ రూ.1 గల గరిష్ఠంగా 20.37 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు.

2026 సంవత్సరంలో ఇప్పటివరకు ఇదే అతిపెద్ద ఐపీఓగా నిలవనుంది.ప్రైస్‌బ్యాండ్




గరిష్ఠ స్థాయి ప్రకారం కంపెనీ మార్కెట్ విలువ రూ.1.17 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉంది.ఎస్‌బీఐ వాటాదారులకు ప్రత్యేక కోటాఈ ఐపీఓలో అర్హత కలిగిన ఎస్‌బీఐ వాటాదారుల కోసం మొత్తం ఇష్యూలో సుమారు 1.306 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రత్యేకంగా కేటాయించారు. గరిష్ఠ ధర ప్రకారం ఈ రిజర్వేషన్ విలువ దాదాపు రూ.750కోట్లుగా ఉంటుంది.అయితే రిటైల్ ఇన్వెస్టర్లకు కొన్ని ఐపీఓల్లో ఇచ్చే విధంగా ఎస్‌బీఐ వాటాదారులకు ఎలాంటి ధర రాయితీ ఉండదు.వారు నిర్ణయించిన ప్రైస్ బ్యాండ్ పరిధిలోనే బిడ్ చేయాల్సి ఉంటుంది. అర్హత కలిగిన ఎస్‌బీఐ ఉద్యోగుల కోసం రూ.170 కోట్ల విలువైన షేర్లను రిజర్వ్ చేయగా,వారికి ఒక్కోషేరుపైరూ.54చొప్పున డిస్కౌంట్ అందించనున్నారు.ఎస్‌బీఐఫండ్స్ మేనేజ్‌మెంట్ ఉద్యోగుల కోసం 2,70,271 ఈక్విటీ షేర్లు,అర్హత కలిగిన ఎస్‌బీఐ ఉద్యోగుల కోసం సుమారు 29.9 లక్షల ఈక్విటీ షేర్లను ప్రత్యేకంగా కేటాయించారు.

## అధునాతన ఫీచర్లతో నిస్సాన్ టెక్టాన్



**ముంబయి, జులై 9:** మిడ్‌సైజ్ ఎస్‌యూవీ విభాగంలో పోటీని మరింత పెంచుతూ నిస్సాన్ భారత్‌లో టెక్టన్ కొత్త మోడల్ విడుదల చేసింది. 2023లో కిక్స్ నిలిపివేసిన తర్వాత నిస్సాన్ నుంచి వస్తున్న తొలి మిడ్‌సైజ్ ఎస్‌యూవీ ఇదే. మార్కెట్‌లో ఇప్పటికే ఉన్న ఎస్‌యువి మోడళ్లకు ఇది పోటీ ఇవ్వనుంది. టెక్టన్‌లో రెండు టర్బో పెట్రోల్ ఇంజిన్ ఆప్షన్లు ఉన్నాయి. 1.0 లీటర్ ఇంజిన్ 100 బీహెచ్‌పీ శక్తి, 166 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీనికి 6 స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్ ఇచ్చారు. లీటర్‌కు 19.4 కిలోమీటర్ల మైలేజ్ వస్తుందని కంపెనీ చెబుతోంది. 1.3లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ 163 బీహెచ్‌పీ శక్తి, 280 ఎన్‌ఎం టార్క్‌ను అందిస్తుంది.ఈ వేరియంట్‌లో 6స్పీడ్ మాన్యువల్, డీసీటీ ఆటోమేటిక్ గేర్‌బాక్స్ ఉన్నాయి. దీని మైలేజ్ లీటర్‌కు 18.5 కిలోమీటర్లుగా ప్రకటించింది. డిజైన్ పరంగా టెక్టన్‌కు బలమైన లుక్ ఇచ్చారు. ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్‌లు, కనెక్టెడ్ డీఆర్‌ఎల్స్, 18 అంగుళాల అలాయ్ వీల్స్, కనెక్టెడ్ ఎల్‌ఈడీ టెయిల్‌ల్యాంప్‌లు ఆకట్టుకుంటాయి. లోపల 10.1 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్, 10.25 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌ను అందించారు.

## ఎంఎఫ్‌లోకి ఆనంద్‌రాఠీ వెల్త్

**ముంబై, జులై 9:** వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థ ఆనంద్ రాఠీ వెల్త్ లిమిటెడ్ తొలి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ నికర లాభంలో గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది. అధిక ఆదాయం కారణంగా కంపెనీ లాభాలు దాదాపు 60శాతం పెరిగాయి.ఇదే సమయంలో, మ్యూచువల్ ఫండ్ వ్యాపారంలోకి ప్రవేశించేందుకు సెబీకి దరఖాస్తు చేయాలని నిర్ణయించింది. కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం మార్చి త్రైమాసికంలోని రూ.102 కోట్ల నుంచి జూన్ త్రైమాసికంలో రూ.163 కోట్లకు చేరి 59.7 శాతం పెరిగింది.

అదే కాలంలో మొత్తం ఆదాయం రూ.344 కోట్ల నుంచి రూ.422 కోట్లకు పెరిగి 22.6 శాతం వృద్ధిని ఆనంద్ రాఠీ వెల్త్ లిమిటెడ్ నమోదు చేసింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.